పేదల పెద్దాస్పత్రి సమస్యలమయంగా మారింది. అన్ని విభాగాల్లో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. సౌకర్యాల సమస్య వెంటాడుతోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆస్పత్రికి వస్తున్న రోగులకు భరోసా కరువవుతోంది. ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నట్లు పాలకులు పదేపదే చెబుతున్నా అది ఆచరణలో అమలుకావడం లేదు. ఖరీదైన టెస్టులకు ప్రైవేటు సెంటర్లకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఆస్పత్రికి వచ్చే బాధితులను కొందరు సిబ్బంది భయపెట్టి బయటకు పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు 24 గంటలూ అందుబాటులో ఉండి అత్యవసర సేవలు అందించాల్సిన క్యాజువాలిటీని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొంతలోకొంత ఉపశమనంలా క్యాథ్‌ల్యాబ్ ప్రారంభం మాత్రం మంచి పరిణామమే.



సర్వజన ఘోష!

జీజీహెచ్‌లో అన్నీ సమస్యలే

- పూర్తిస్థాయిలో లభించని సేవలు
- క్యాజువాలిటీలో కనీస వైద్యం కరువు
- సాయంత్రం ఓపీకి ససేమిరా
- అందుబాటులో లేని ఆరోగ్య భరోసా
- నర్సింగ్ విద్యార్థులకు వసతి కరువు
- నేడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాక
- క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించనున్న సత్యకుమార్‌యాదవ్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో వైద్యసేవలు అంతంతమాత్రంగా మారాయి. పాలకులు, ప్రభుత్వ అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు చేసినా యంత్రాంగం తీరులో మార్పు రావడం లేదు. జీజీహెచ్ ఆవరణంలోని నర్సింగ్ విద్యార్థులకు సొంత భవనం లేదు. ఆసుపత్రి మూడవ అంతస్తులోని స్పెషల్ రూములు, రోగులకు కేటాయించిన మరికొన్ని రూములు వారికి వసతిగా, తరగతి గదులుగా మారాయి. దూర ప్రాంత రోగుల కోసం ఏర్పాటు చేసినా సాయంత్రం ఓపీకి కొందరు వైద్యులు ససేమిరా అంటున్నారు. అయితే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఒంగోలు విచ్చేసి, జీజీహెచ్‌లో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తుండగా, పేదల వైద్యానికి భరోసా ఇవ్వాలని, జీజీహెచ్‌కు చేసిన నిర్లక్ష్యపు జబ్బుకు తగిన వైద్యం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

● అమలుకాని సాయంత్రం ఓపీ

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్‌లకు పూర్తిస్థాయి సేవలు అందించాలని గతంలో వైద్య ఆరోగ్య శాఖ మిగతా 6లో...

గాడిన పడని వైద్యశాఖ

- ఆరోగ్య కేంద్రాలకు వైద్యాధికారులు ఎప్పుడు వస్తారో తెలియని దుస్థితి
- మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు
- ఆలస్యంగా వస్తున్న వారికి షోకాజ్ నోటీసులు
- యాప్‌లో చిరుద్యోగులకు అష్టకష్టాలు

6



దర్శి ప్రాంతంలో అకాల వర్షం, ఈదురుగాలులకు నేలకొరిగిన బొప్పాయి తోట

గాలివాన బీభత్సం

జిల్లాలోని పలుప్రాంతాల్లో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల పంటలు నేలకొరిగాయి. దర్శి, పొదిలి ప్రాంతాల్లో బొప్పాయి చెట్లు విరిగిపడ్డాయి. కల్లాలో ఆరబెట్టిన మిరపకాయలు తడిసిపోయాయి. గాలికి స్తంభాలు నేలకొరిగాయి. రేకులషెడ్లు లేచిపోయాయి. అకాల వర్షం రైతులకు నష్టాలను మిగిల్చింది.

- అకాల వర్షం.. అపార నష్టం
- దెబ్బతిన్న బొప్పాయి, మిర్చి తోటలు
- లబోదిబోమంటున్న రైతులు

దర్శి/పామూరు/పొదిలి/తర్లుపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రేకల్లో పేర్చి ఉన్న పొగాకు కర్రలు తడిసి ముద్దయ్యాయి. దర్శి మండలంలోని తూర్పుచౌటపాలెం, చందలూరు, వెంకటచల్లంపల్లి, మారెడ్డిపల్లి, దర్శిరెడ్డిపల్లి, అబ్బాయపాలెంలో ఈదురుగాలులు, వర్షానికి సుమారు 200 ఎకరాల్లో బొప్పాయి నేలకొరిగింది. తూర్పువీరాయపాలెంలో పొగాకు షెడ్లు లేచిపోయి సరుకు నేలమట్టమైంది. లక్షలాది మిగతా 6లో...



తర్లుపాడులో వర్షానికి తడుస్తున్న పొగాకు రేక



మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

అటవీ, రెవెన్యూ శాఖల ఉమ్మడి సర్వే

హద్దురాళ్ల గుర్తింపు కోసం వెతుకులాట

కురిచేడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామం సర్వే నంబర్లు 88, 90లలో 799.40 ఎకరాల భూమిని రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్‌కు కేటాయించారు. ఈక్రమంలో భారీ యంత్రాలతో చిల్లచెట్లు తొలగించే పనులు చేపట్టారు. అయితే, అటవీ శాఖ అధికారులు సదరు భూమి తమదంటూ అడ్డం తిరిగారు. మూడు రోజులుగా ఈ విషయమై అటవీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు తర్జనభర్జనలు పడ్డారు. ఎవరి రికార్డులు వారు తెచ్చి తమదంటే తమదని వాదులాడుకున్నారు. చివరికి ఉన్నతాధికారులు ప్రవేశించి రెండు శాఖలు ఉమ్మడి సర్వే చేయాలని సూచించారు. గురువారం రెండు శాఖలకు చెందిన సర్వేయర్లు ఉమ్మడి సర్వే చేపట్టారు.

కురిచేడు మండలంలో రైతులకు, నిరుద్యోగులకు ఉపాధి చూపేందుకు కూటమి ప్రభుత్వం రూ.130 కోట్లతో గంగదొనకొండలో ప్రాజెక్టుకు ఏర్పాట్లు చేసింది. దీనివల్ల ప్రత్యక్షంగా రైతులు, నిరుద్యోగులకు... పరోక్షంగా పరిసర గ్రామాల వారికి ఉపయోగం ఉంటుంది. ఇటువంటి పెద్ద ప్రాజక్టు అటవీ శాఖ క్రొరీలతో నీలినీడలు కమ్ముకున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేయాలని సూచించారు. మూడు రోజులుగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు వారి రికార్డులు సరిచూసుకున్నారు. ఒకరి రికార్డులు మరొకరు అందించుకుని సరిచూసుకున్నారు. గురువారం ఉమ్మడి సర్వేకు పూనుకున్నారు.

అటవీ శాఖకు చెందిన జిల్లా అధికారి శ్రీనివాసరావు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి తమ శాఖల అధికారులతో కలిసి గంగదొనకొండ పక్కనే ఉన్న నాయుడుపాలెం రిజర్వ్ ఫారెస్ట్‌లో 3 కి.మీ నుంచి 5 కి.మీ మేర నడచి హద్దురాళ్ల గుర్తించారు. అక్కడ నుంచి సర్వే చేయాలని అనుకున్నా సాంకేతి సమస్యతో కుదరలేదు. మరలా దొనకొండ మండల చందవరం వద్ద ఉన్న అడవిలో హద్దురాయిని గుర్తించారు. నాయుడుపాలెం రిజర్వ్ ఫారెస్ట్‌కు మూల స్తంభంలాంటి హద్దురాయి దొనకొండ మండలం పోలేపల్లి వద్ద ఉందని అక్కడకు వెళ్లి గుర్తించారు. అక్కడ నుంచి జియోలాజికల్, ల్యాట్ ల్యాండ్ సర్వే చేశారు. తదనంతరం దొనకొండ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలించి చర్చలు జరిపారు. ఉన్నతాధికారులకు సర్వే రిపోర్టులు పంపి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సీబీజీ ప్లాంటు వద్ద పనులు యథావిధిగా జరుగుతున్నాయి. పరిశీలనలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, అసిస్టెంట్ డీఎఫ్‌వో పి.శ్రీనివాసరావు, ఎఫ్ఆర్‌వో నరసింహారావు, డిప్యూటీ ఆర్‌వో బి.నాయక్, ఎఫ్‌బీవో ధనలక్ష్మి, తహసీల్దార్ రజనీ కుమారి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో హనుమంతరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బిల్లుల సవరణకు ముడుపులు



- ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకం
- ఏళ్ల తరబడి ఎన్ఆర్ఈజీఎస్ బిల్లులు రాక అల్లాడుతున్న నిర్వాహకులు

దర్శి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్వహించిన పనులకు కోట్లాది రూపాయల బిల్లులు అందక నిర్వాహకులు అల్లాడుతున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన కొంతమంది ఏం చేయాలో పాలుపోక లబోదిబోమంటున్నారు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడు కాల్వలు నిర్మించారు. ఆ బిల్లులు రూ.ఆరు కోట్లకు పైగా రావాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఆ పనులను టీడీపీ సానుభూతిపరులు చేశారనే కక్షతో బిల్లులు ఇవ్వకుండా నిలిపివేసింది. విజిలెన్స్ విచారణ పేరుతో వేధించింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటనే బిల్లులు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడుస్తున్నా బిల్లులు అందకపోవటంతో పనులు చేపట్టినవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పెండింగ్ బిల్లులు వేస్తామని చెబుతున్నా ఆచరణలో అమలు కాకపోవటంతో బిల్లులు ఎప్పుడు పడతాయోనని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

పర్సంటేజీల విషయం తెలియదు

పంచాయతీరాజ్ డీఈ విఠల్‌రాథోడ్‌ను వివరణ కోరగా.. దర్శి నియోజకవర్గంలో గత టీడీపీ హయాంలో చేసిన పనులకు రూ.ఆరు కోట్లకు పైగా బిల్లులు రావాల్సిన మాట వాస్తవమేనన్నారు. ఎఫ్టీఆర్‌లు తయారు చేసి పంపేందుకు పర్సెంటేజీలు అడుగుతున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. ఇంజనీరింగ్ అధికారులు ఆ బిల్లులను నేరుగా ఉన్నతాధికారులకు పంపారని చెప్పారు.



అధికారుల చేతివాటం

సవరణ బిల్లులు పంపేందుకు అధికారులు మళ్లీ పర్సెంటేజీలు తీసుకుంటుండంతో నిర్వాహకులు డబ్బులు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనులకు బిల్లులు చేసినందుకు గతంలోనే ఇంజనీరింగ్ అధికారులకు పది శాతం పర్సెంటేజీలు చెల్లించారు. అదే పనులకు నూతన ప్రభుత్వం సవరణ బిల్లుల ఎఫ్టీవోలు(ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్) తయారుచేసి పంపాలని ఆదేశించింది. వైసీపీ ప్రభుత్వం విధించిన కోతలను పక్కనపెట్టి పూర్తి బిల్లులు పంపాలని సూచించింది. ఎఫ్టీవో తయారీకి అధికారులు ఆరు శాతం వాటా అడుగుతున్నారని పనులు చేసినవారు వాపోతున్నారు. కొంతమంది ఇప్పటికే రెండోసారి పర్సెంటేజీలు ఇచ్చి బిల్లులు పంపించుకున్నారు. అయినా నిధులు రాక అల్లాడుతున్నారు.


పేదల కోసం పోరాటం



భూముల వద్ద పేదలతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నేతలు

- స్థలం దక్కే వరకు వదిలేది లేదు
- అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి
- టిడ్కో ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలి
- అగ్రహారం భూములను పరిశీలించిన సీపీఐ నేతలు కె.రామకృష్ణ, ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదలకు నివేశన స్థలాలు దక్కే వరకు పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఒంగోలు సమీపంలోని ఆగ్రహారం వద్ద గత వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేసిన భూములను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్యతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండుసెంట్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒంగోలు సమీపంలోని అగ్రహారం వద్ద గత ప్రభుత్వం 400 ఎకరాలకుపైగా భూమిని కొనుగోలు చేసి పేదలకు అప్పటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటి పట్టాలు కాకుండా భరోసా పత్రాలు ఇచ్చారని ఆరోపించారు. భూమిలో రాళ్లు వేశారే తప్ప ఏ ఒక్కరికి పొజిషన్ చూపలేదన్నారు. కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని మండిపడ్డారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అనర్హుల పేరుతో ఎవ్వరికీ పొజిషన్ చూపలేదన్నారు. దీంతో ఒంగోలు నగరంలోని పేదలు అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలు దాదాపు 80శాతం పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ ఇళ్లపై శీతకన్ను వేసి గృహాల నిర్మాణానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదని ఆరోపించారు. ఈ ప్రభుత్వమైనా టిడ్కో ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల మిగతా 6లో...



కామిత వరదాత చెన్నకేశవ

- విలక్షణం స్వామి దర్శనం.. నాలుగు యుగాల దేవుడు
- ఆలయంలో అద్భుత వాస్తు శిల్పకళలు
- నూతనంగా 4 రాజగోపురాల నిర్మాణం

7

పోలీసులను నమ్మించి.. బురిడీ కొట్టించి..

గాడిన పడని వైద్య శాఖ

- ఆరోగ్య కేంద్రాలకు వైద్యాధికారులు
- ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి
- మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు
- ఆలస్యంగా వస్తున్న వారికి షోకాజ్ నోటీసులు
- యాప్‌లో చిరు ఉద్యోగుల అష్టకష్టాలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో అనేక మార్పులను కూటమి ప్రభుత్వం తెస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కాని పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులు ఎక్కువ శాతం మంది తమ వ్యక్తిగత పనులు ముగిసినా తర్వాత ఏదో మొక్కుబడిగా వైద్యశాలలకు వచ్చి పోతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కొంతమంది వైద్యాధికారులు పీజీ చేసేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతో పనిచేస్తుండగా మరికొంతమంది వైద్యాధికారులు వ్యక్తిగతంగా ప్రైవేటు వైద్యశాలలు పెట్టుకొని అక్కడ ఎక్కువ సమయం కేటాయిస్తుండగా మరికొంతమంది కార్పొరేట్ వైద్యశాలల్లో పార్ట్‌టైంగా పనిచేస్తూ పీహెచ్‌సీ డ్యూటీకి ఏగనామం పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మరికొంత మంది ఉద్యోగులు తమకు ఉన్న పలుకుబడిని వినియోగించుకొని పనిలేని పోస్టులకు డిప్యూటేషన్లు వేయించుకొని తమ వ్యక్తిగత పనులను చూసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ముఖ హాజరులోనూ మోసం

ఇటీవల ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖహాజరును తప్పనిసరి చేసింది. అది కూడా వారు పనిచేసే వైద్యశాల పరిధిలోనే ముఖహాజరు వేయాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా ఆ హాస్పటల్‌కు సంబంధం లేని ప్రాంతాల్లో హాజరు వేసి తాము డ్యూటీలో ఉన్నామని చెప్పుకునే పరిస్థితి ఏర్పడింది. అలా ముఖహాజరును పరిశీలించిన వైద్యశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తే వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేస్తున్నారు. ఆ విధంగా పదుల సంఖ్యలో షోకాజ్ నోటీసులు ఇచ్చారంటే జిల్లాలో వైద్యాధికారులు ఏ విధంగా పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజానీకం వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. వారికోసం అవసరమైన మందులను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అయినా వైద్యాధికారులు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సకాలంలో అందుబాటులో ఉండకపోవడంతో జనం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోవైపు అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యాధికారుల కొరత పట్టిపీడిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లలో ఐదుగురు వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉండగా జిల్లాలోని అనేక వైద్యశాలల్లో సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది.

చిరు ఉద్యోగులకు యాప్‌ల భారం

కాగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలుచేస్తున్న పలురకాల పథకాలకు సంబంధించి యాప్‌ల్లో ప్రతిరోజు అప్‌లోడ్ చేయాల్సి రావడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమప్రాంతంలోని అనేక ప్రాంతాల్లో నెట్‌వర్క్ అనేది అంతంతమాత్రంగానే ఉంది. అయితే ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేసేందుకు చాలా కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఇంటిని సందర్శించి ఆ ఇంటికి సంబంధించిన వివరాలన్నింటిని అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు జాప్యం జరుగుతుండటం, మరొకచోట చేస్తే అక్కడ కాకుండా ఇంకొక చోట చేసినట్లు యాప్‌లో చూపిస్తుంటడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

'సర్వజన' ఘోష!

(5వ పేజీ తరువాయి)

దృష్టిసారించింది. ఈ మేరకు ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో సేవలను ప్రారంభించారు. ఆదివారం మినహా ప్రతిరోజు సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఔట్ పేషెంట్‌లకు (బయట రోగులకు) సేవలు అందించాల్సి ఉంది. నాలుగు దశాబ్దాల క్రితం అప్పట్లో ఈవెనింగ్ ఓపీ నిర్వహించారు. అయితే కాలానుగుణంగా దానిని రద్దు చేశారు. మరలా ఈ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ఓపీ విభాగానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం వచ్చేవారికి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులో లేవని వైద్యశాఖ గుర్తించింది. మధ్యాహ్నం 2గంటల తర్వాత భోజన విరామం తర్వాత పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలని, మరుసటి రోజు వరకు బాధితులు ఎదురుచూడకుండా ఉండేందుకు మధ్యాహ్నం ఓపీతో ఒకరోజులోనే పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, మందులు తీసుకోవడంతోపాటు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావచ్చని వైద్యశాఖ భావించినప్పటికీ పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు.

క్యాజువాలిటీలో భయపెట్టి బయటకు...

తీవ్ర వ్యాధులు, గాయాలతో క్యాజువాలిటీకి వచ్చే వారిని అక్కడి సిబ్బంది భయపెట్టి బయటకు పంపుతున్నారనేది కొందరు ఆవేదన. ముఖ్యంగా 108లో జీజీహెచ్‌కి వచ్చి స్ట్రక్చర్‌పై పడుకోబెట్టగానే అంబులెన్స్ సిబ్బంది నుంచి నర్సులు, డాక్టర్లు, ఇతర సహాయకులు రోగి తరపు బంధువులను భయపెట్టి బయటకు పంపడం నిరంతరం జరుగుతున్న ప్రక్రియ. ఇక్కడ వైద్యం లేదు, బయట ఆసుపత్రికి పొమ్మని సలహా ఇవ్వడం, అప్పటికీ వారు వినకుంటే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రే తదితర పరీక్షలకు తీసుకెళ్లే సమయంలో అటెండర్ స్థాయి సిబ్బంది సైతం ఇదే మాటలు చెప్పడంతో రోగి తరఫున బంధువులు మరింత ఆందోళన చెందుతున్నారు. దీంతో ప్రైవేటుకే పంపండి అనేలా రోగి బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారే స్వయంగా ప్రైవేటు అంబులెన్స్‌లకు ఫోన్ చేసి పిలిపించడం, తమకు నిరంతరం సంబంధాలు ఉండే ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లడం షరామామూలైంది. ఆ తర్వాత ఆ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం వీరికి కమీషన్ ఇవ్వడం నిరంతరం జరుగుతున్న ప్రక్రియ.

వచ్చామా.. పోయామా..!

ముఖ్యమైన శస్త్ర చికిత్సలకు వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. సర్జరీ విభాగంలో 70శాతం మంది రోగులు ఆపరేషన్ కోసం వస్తుండగా కీలకమైన సర్జన్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు ఐదుగురు వరకు ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరముండగా, మెడిసిన్ విభాగంలో మరో ముగ్గురు వైద్యుల కొరత ఉంది. సాధారణ బదిలీలో భాగంగా కొందరు వైద్యులు, తిరుపతి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల నుంచి మరికొందరు వైద్యులు వచ్చారు. అయితే వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే విధుల్లో అందుబాటులో ఉంటారని, మిగిలిన రోజుల్లో అత్యవసర వైద్యానికి వీరి సేవలు కరువయ్యాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య క్రమేపి తగ్గుతుంది.

నేడు ఆరోగ్యశాఖ మంత్రి ఒంగోలు రాక

వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం ఒంగోలుకు వస్తున్నారు. ఉదయం 11 గంటలకు మొదటగా జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన గుండె జబ్బుల నిర్ధారణ వైద్య పరికరం క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం జీజీహెచ్ వైద్యాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

అట్టహాసంగా టీడీపీ ప్రభ తరలింపు

- ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్
- భారీగా తరలివచ్చిన ప్రజానీకం
- నేడు చీమకుర్తిలో మందిరాల సంబరాలు



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం తిరునాళ్ల సంబరాలు ఊపందుకున్నాయి. ఒక్కొక్కటిగా ప్రభలు రామతీర్థంనకు తరలి వెళ్లన్నాయి. ఈనెల 12న రామతీర్థంలో తిరునాళ్ల మహోత్సవాన్ని వైభవంగా జరుపుకోవటానికి నిర్వాహకులు సంసిద్ధమవుతున్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చీమకుర్తిలో నిర్మించిన ప్రభ తడికెను భారీ ఊరేగింపు మధ్య సంప్రదాయ బద్ధంగా రామతీర్థంనకు తరలించారు. ఈ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆసాంతం ర్యాలీలో పాల్గొన్న వారిని ఉత్సాహ పరిచారు .అంతకుముందు టీడీపీ నాయకులు, ప్రభ నిర్వాహకులు ఎమ్మెల్యే బీఎన్‌కు ఘన స్వాగతం పలికారు. ఊరేగింపులో టీడీపీ శ్రేణులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

మందిరాల సంబరాల్లో 4 ప్రభలు

తిరునాళ్లలో భాగంగా శుక్రవారం రాత్రివేళ చీమకుర్తి పట్టణంలో మందిరాల సంబరాలు నిర్వహించటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగు మందిరాల ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను టీవీ, సినీ కళాకారులచే ప్రదర్శించనున్నారు. తూర్పుబజార్, హరిహరక్షేత్రం, గాంధీనగర్, బీవీఎస్ఆర్ కళ్యాణమండపం వద్ద నాలుగు విద్యుత్‌ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

గాలివాన బీభత్సం



పామూరు మండలంలోని చిదంబరంపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో నేలకొరిగిన బొప్పాయి తోటలు

(5వ పేజీ తరువాయి)

రూపాయల నష్టం వాటిల్లటంతో రైతులు లబోదిబోమంటున్నారు. తూర్పుచౌటపాలెంలో పాతసాని ఆదిరెడ్డి సాగుచేసిన ఎనిమిది ఎకరాల బత్తాయితోట నేలకొరిగింది. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెలుగొండారెడ్డి సాగుచేసిన నాలుగు ఎకరాల బొప్పాయి తోటలో చెట్లు విరిగి పూర్తిగా దెబ్బతింది. అనేకమంది రైతులకు చెందిన బొప్పాయి తోటలు పూర్తిగా విరిగిపడ్డాయి. సామంతపూడి, తూర్పువీరాయపాలెం గ్రామాల్లో కూడా మిర్చి తోటలు దెబ్బతిన్నాయి.

విరిగిన స్తంభాలు, చెట్లు

పొదిలి మడలంలో చిదంబరంపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో గురువారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. 50 ఎకరాల్లో బొప్పాయి పంట నేలపాలైంది. పంటకు వచ్చిన సమయంలో అకాలవర్షంతో తీవ్రనష్టం వాటిల్లిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో కురిసిన ఓ మోస్తరు వర్షం, ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. పది నిమిషాల గాలివానకు దుకాణాల ముందు రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు, ప్రధాన రహదారి వెంబడి వేపచెట్లు నేలకొరిగాయి. ఎన్ఎస్‌పీ పంప్ హౌస్, తహసీల్దార్ కార్యాలయం, దర్శి రోడ్డు వాసవి కాంప్లెక్స్ ముందు ఉన్న వేపచెట్లు విరిగిపోయాయి. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న లక్ష్మీఫర్నీచర్ షాపుపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. పది నిమిషాలపాటు వీచిన ఈదురుగాలులు పట్టణాన్ని వణికించాయి.

తడిచిన పొగాకు, మిర్చి

తర్లుపాడు మండలంలో గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రేకల్లోని పొగాకు, కల్లాల్లోని మిర్చి తడిచి ముద్దయ్యింది. ఒక్కసారిగా పెనుగాలులు వీయడంతో పట్టలు కూడా కప్పుకునేందుకు వీలులేకుండా పోయింది. ఎక్కువగా పొగాకు తడవడంతో రంగు మారిపోతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కల్లాల్లోని మిర్చి తడవకుండా రైతులు పట్టలు కప్పుకున్నారు. గాలికి మిర్చికాయలు రాలిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పొగాకు, మిర్చి రైతులకు ఈ వర్షం కొంతమేర నష్టం వాటిల్లింది.

పామూరులో మోస్తరు వర్షం

పామూరులో గురువారం సాయంత్రం గాలులు, ఉరుములు మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. గత 15రోజుల నుంచి తీవ్ర ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

ట్రైసైకిళ్ల తయారీని ప్రారంభించాలి

ఒంగోలు నగరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో గత ఏడాది కాలంగా నిలిచిపోయిన ట్రై సైకిళ్ల తయారీని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి నాయకులు గురువారం విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ ఇన్‌చార్జి మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గురువారం గుంటూరులోని తన కార్యాలయంలోని ఆయనను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఒంగోలులోని దివ్యాంగుల శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో ట్రై సైకిళ్ళ తయారీ ఏడాదిగా నిలిచిపోవటం వల్ల ఏడు జిల్లాల్లోని దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు అందక ఇబ్బందులు పడుతున్నారని సమితి నాయకులు తెలిపారు. ట్రైసైకిళ్ల తయారీకి అవరమైన నిధులు ఉన్నప్పటికి అధికారులకు, మెటీరియల్ సరఫరాదారుడికి మధ్య లావాదేవీల్లో విబేధాలు తలెత్తటంతో ట్రైసైకిళ్ల తయారీ నిలిచిపోయిందని వివరించారు. 2020సంవత్సరంలో 1,465 ట్రై సైకిళ్ల తయారీకి ప్రభుత్వం రూ.80 లక్షలు విడుదల చేసిందని, ఇప్పటి వరకు 800 మాత్రమే తయారీ చేసి పంపిణీ చేశారన్నారు. మిగిలిన వాటిని తయారు చేయలేదన్నారు. ఆ నిధులు అ లాగే ఉన్నా తయారీని చేపట్టటం లేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా, జిల్లా అధ్యక్షుడు దూపాటి రమణయ్య, బత్తుల సాయికుమార్, రవితేజ పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ వరలక్ష్మి

కారుమంచి కెనాల్ పరిశీలన

చీమకుర్తి, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణ శివారున ధ్వంసమైన కారుమంచి మేజర్ కాలువను గురువారం ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దెబ్బతిన కాలువకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించటానికి క్షేత్రస్థాయి నివేదిక అందించే నిమిత్తం ఈ ప్రాంతాన్ని క్షుణ్ణంగా సందర్శించారు. ఈ సందర్భంగా చీమకుర్తి డీసీ అధ్యక్షుడు పాలడుగు నారాయణ కాలువ వివరాలను ఎస్ఈకి వివరించారు. కార్యక్రమంలో ఈఈ రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

అంబేడ్కర్ ట్రోఫీని ఆవిష్కరించిన ఎస్పీ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని భీమ్ సేవా సమితి, భీమ్ ప్రగతి సంయుక్తంగా ఒంగోలులో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎస్పీ ఏఆర్.దామోదర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం టోర్నమెంట్ ట్రోఫీని ఆవిష్కరించారు. క్రీడలు ఉత్సాహాన్ని, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ఆయన చెప్పారు. యువత అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు దాసరి కోటేశ్వరరావు, ఆదినారాయణ, శ్రీరాములు, కృపారావు, ప్రవీణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముందస్తుగా గంగమ్మ తిరునాళ్ల

- నక్కబొక్కలపాడులో టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వీర్ల గంగమ్మ తిరునాళ్ల శనివారం జరగనుంది. తిరునాళ్ల ముందస్తు ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాట కచేరిని ఏర్పాటు చేయడంతో పలు గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి వీక్షించారు. టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో తిరునాళ్ల రోజు ఇదే గ్రామం నుంచి రెండు విద్యుత్ ప్రభలను తిరునాళ్లలో ఏర్పాటు చేయనున్నారు.



నేటినుంచి హరిహరక్షేత్రం వార్షికోత్సవాలు

చీమకుర్తి, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలోని ప్రసిద్ధ హరిహరక్షేత్రం 19వ వార్షికోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరుపుకోవటానికి ముస్తాబయింది. శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్న వేడుకల్లో హోమాలు, శాంతి కళ్యాణం, విశేషపూజలు జరుపుతారు. అయ్యప్పస్వామి పడిభజన పూర్ణాహుతి, నగరోత్సవం నిర్వహిస్తారని మాజీమంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

ఈ నెలాఖరులోపు భూసేకరణ పూర్తిచేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పరిధిలో భూసేకరణను ఈనెలాఖరులోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం ప్రాజెక్టుల భూసేకరణపై ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వెలిగొండప్రాజెక్టు అధికారులతో జేసీ సమీక్షించారు. ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వచ్చే ఏడాది జూలై నాటికి సాగు,తాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు ప్రభావిత ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లింపుతో పాటు ఆర్‌అండ్ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌తో పాటు భూసేకరణ అధికారులు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు ఉన్నారు.

పేదల కోసం పోరాటం

(5వ పేజీ తరువాయి)

ఈశ్వరయ్య మాట్లాడుతూ మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నివేశన స్థలాల పత్రాలు ఇచ్చారే తప్ప ఎవరికి పొజిషన్ చూపలేదన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత తన స్వార్థం చూసుకొని మరో పార్టీలోకి మారిపోయారన్నారు. ఇచ్చిన పట్టాలకు పొజిషన్ చూపేందుకు బాలినేని ఎక్కడా చొరవచూపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో సరళాదేవినగర్, దత్తాత్రేయ కాలనీ, కార్మికనగర్‌లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ధర్నా శిబిరం వద్దకు జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు వచ్చి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పేదలకు ఇంటిస్థలాల విషయం ప్రభుత్వ పరిశీలన ఉందని, అర్హులైన వారందరికి పట్టాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆర్.వెంకట్రావు, వడ్డే హనుమారెడ్డి, కే వీరారెడ్డి, ఆర్. రామకృష్ణ, ఎం.విజయ, ఎన్. మురళీ, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు, కరవది సుబ్బారావు, ఆర్.లక్ష్మీ, ముత్తని అంజయ్య, గద్దల రవి, బాల కోటయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు సీపీఐ కార్యాలయం నుంచి ఎర్రజెండాలతో నాయకులతో కలిసి లబ్ధిదారులు భారీగా అగ్రహారం భూముల వద్దకు చేరుకున్నారు. అక్కడ రామకృష్ణతో కలిసి ఆ భూములను పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక గ్రీవెన్స్‌హాలులో గురువారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అందువల్ల క్షేత్రస్థాయిలో పరిష్కారం కోసం వచ్చిన రెవెన్యూ సమస్యల వివరాలను, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై గ్రామాలవారీగా మండల కార్యచరణ రూపొందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో, పీజీఆర్ఎస్‌లో వచ్చిన రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు, క్షేత్ర స్థాయిలో ఆయా సమస్యలను పరిశీలించి అర్జీదారులతో మాట్లాడి పరిష్కరించాలని చెప్పారు. సమస్య పరిష్కారం వీలు కానిపక్షంలో అందుకు గల కారణం అర్జీదారునికి స్పష్టంగా చెప్పాలన్నారు. రెగ్యులరైజేషన్ స్కీం-25 ప్రక్రియపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఉన్న రెవెన్యూ సమస్యలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్, డీఆర్వో చినఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

50 శాతం రాయితీతో అదనపులోడు క్రమబద్ధీకరణ

- ఎస్ఈ వెంకటేశ్వర్లు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు 50శాతం రాయితీతో అదనపులోడు క్రమబద్ధీకరణ చేసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు కోరారు. గురువారం నాగులుప్పలపాడులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న విద్యుత్‌సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు. అదనపు లోడు అవసరమైన వారికి 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరణ చేస్తున్న విషయాన్ని వినియోగదారులకు తెలియపరచాలని తెలిపారు. వేసవిలో లోవోల్టేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అవసరమైన మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈ తోట శ్రీకాంత్, ఏఈ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు 14 నుంచి దరఖాస్తులు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం ఈ నెల 14వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ తెలిపారు. ఈనెల 14 నుంచి మే 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్పొరేషన్ ద్వారా రుణం పొంది యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తుదారుని వయస్సు 21 నుంచి 50 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, కులం, ఆదాయం, పుట్టినతేదీ, తెలుపురంగురేషన్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఫోన్ నంబర్‌తో బీఎంఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. యూనిట్లు గ్రౌండింగ్ జూన్ 21 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఒంగోలు క్రైం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఓ వ్యభిచారగృహంపై పోలీసులు దాడి చేసి ముగ్గురు మహిళలు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక రాజీవ్‌గృహకల్ప ఒకటో లైన్‌లో ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందంటూ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. అయితే పోలీసుల దాడి చేయక ముందే నిర్వహకుడు పరారీ అయ్యాడు. నిర్వహకుడు జగదీష్ ఆ ఇంట్లో నుంచి బయటకు వెళ్ళిపోయిన తరువాత అతడిని గుర్తించారు. ఈ మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు డీఎస్పీలకు పోస్టింగ్‌లు

ఒంగోలు క్రైం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీలకు జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాలో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు పోస్టింగ్ ఇచ్చారు. ఒంగోలులోని మహిళ పోలీస్‌స్టేషన్‌కు వీవీ.రమణకుమార్, పోలీస్ శిక్షణ కాలేజీలో డీఎస్పీగా ఎం.బాలసుందరరావు, ఏపీఎస్పీ 7వ బెటాలియన్ కామెండెంట్‌గా టి.శ్రీనివాసులును నియమించారు.

15 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

సంతనూతలపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాలలో 2023-25 బ్యాచ్‌కు చెందిన ఛాత్రోపాధ్యాయులకు రెండవ సంవత్సరం 4వ సెమిస్టర్ చివరి సెషన్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 15నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు గురువారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సంబంధిత ప్రైవేట్ డీఎడ్ కళాశాలల యాజమాన్యం సంబంధిత వివరాలతో మైనంపాడు డైట్ కళాశాల వద్దకు రావాలని ప్రిన్సిపాల్ కోరారు.

విద్యుత్‌శాఖ ఉద్యోగి ఇంట్లో చోరీ

ఒంగోలు క్రైం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళం పగులకొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన ఒంగోలు నగరం కర్నూలురోడ్డులోని పవర్ ఆఫీసు ఎదురుగా ఉన్న అల్లూరి సీతారామరాజు వీధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. విద్యుత్‌శాఖలో పనిచేసే ఎస్‌కే.గౌస్యాబేగం ఈనెల 7న ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళారు. గురువారం సాయంత్రం ఆమెకు కొరియర్ ఇచ్చేందుకు డెలివరీ బాయ్ వెళ్లాడు. అక్కడ తలుపులు పగులగొట్టి ఉండటం గుర్తించి ఆమెకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమె అక్కడ నుంచే తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారుగా రూ.లక్ష విలువైన సొత్తు చోరీ జరిగి ఉండవచ్చని అంచనా. ఇంటి తలుపు తాళం పగులకొట్టిన దుండగలు లోపలికి చొరబడి కప్‌బోర్డ్లు అన్ని ధ్వంసం చేసి సామగ్రిని చిందర వందర చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కామిత వరదాత చెన్నకేశవుడు



శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులు



రాజ్యలక్ష్మి అమ్మ వారి మూలవిరాట్



చెన్నకేశవ స్వామి మూల విరాట్



చెన్న కేశవస్వామి గాలి గోపురం

- విలక్షణం స్వామి దర్శనం.. మార్కాపురం చెన్నుడు నాలుగు యుగాల దేవుడు
- ఆలయంలో అద్భుత వాస్తు శిల్పకళలు
- నూతనంగా 4 రాజగోపురాల నిర్మాణం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మిచెన్న కేశవుడు నాలుగు యుగాల దేవుడిగా కామిత వరదాతగా ప్రసిద్ధిగాంచాడు. చివరగా కలి యుగంలో మారికా అనే యాదవుల స్త్రీ.. పుట్టలో ఉన్న కేశవునికి పాలధారలతో అభిషేకించిందని, ఆమె పేరుమీదనే మారికాపురం వెలసి మార్కాపు రంగా పిలవబడుతోందని ప్రతీతి. చెన్నకేశవ స్వామి క్షేత్రం వైష్ణవ క్షేత్రమే కాక విశిష్ట హరిహరాద్వైత క్షేత్రం. ఈ ఆలయం విజయనగర రాజుల చరిత్రకు సజీవ సాక్ష్యం.



ఆలయ నిర్మాత సిద్ధిరాజు తిమ్మరాజయ్య

రథం విశిష్టత

రాయల కాలం కంటే ముందు చెన్నకేశవుడికి రాతిరథంపై ఉత్సవం జరిగేది. అనంతరం శ్రీకృష్ణదేవరాయులు కర్రతో చతురస్ర రథం చేయించారు. 1804లో రథం శిథిలావస్థకు చేరగా అప్పటి కరణం నర్రాజు కోణమరాజు భక్తుల సహకారంతో రథం చేయించారు. శతాబ్దానికి అది శిథిలం కాగా గొట్టిపడియ కరణం భక్తుల సహకారంతో రథం చేయించారు. అనంతరం 2005-07లో రూ.50 లక్షల ఖర్చుతో అప్పటి ఆలయ చైర్మన్ చాటకొండ రామయ్య దాతల సహకారంతో నూతన రథం చేయించారు.

నూతన వెండి రథం



చెన్నకేశవ స్వామికి ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ యక్కలి కాశీ విశ్వనాథం ఆధ్వర్యంలో దాతల సహకారంతో 550 కిలోల వెండిని సేకరించి రూ.3.50 కోట్లతో వెండిరథ నిర్మాణం చేయించారు. రథసప్తమి నాడు చెన్నకేశవునికి సప్త వాహనాలపై నగరోత్సవం నిర్వహిస్తున్నారు.

బంగారు, వెండి బల్లులు



ఆలయంలో బంగారు, వెండి బల్లుల తాపడం చేయించి భక్తులకు స్పర్శ దర్శనం కల్పించారు. యాగశాలలో సుదర్శన చక్రం ప్రతిష్ఠించారు. శాండ్‌బ్లాస్టింగ్ విధానంతో శిల్పాలకు సహజ కళ రప్పించారు. గుడి చుట్టు సాలాహారం నిర్మించారు. నూతన రథసప్తమి వాహనశాల, సూర్య రథ నిర్మాణం చేయించారు.

నూతన రాజగోపుర నిర్మాణాలు

ఆలయంలో సుమారు రూ.5.50 కోట్లతో నూతన రాజగోపుర నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పటికే ఆలయానికి 11 అంతస్థుల మహా రాజగోపురం తలమానికంగా ఉంది. ఉత్తరం, దక్షిణం వైపు 53 అడుగులు, తూర్పు,పడమర వైపు గోపురాలు 71 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారు.



11 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. 11వ తేదీ అంకురార్పణ, ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, రాత్రి రాయబారం, ఎదుర్కోల, సూర్యవాహనసేవ నిర్వహించనున్నారు. 12న కల్యాణం నిర్వహించనున్నారు. 13న చంద్రవాహనం, 14న సింహవాహనం, 15న శేషవాహనం, 16న వ్యాళి వాహనం, 17న పొన్నవాహనం, 18న హనుమంత వాహనం, 19న గరుడ వాహనం, 20న గజవాహనం, 21న రథోత్సవం, 22న అశ్వవాహనం, 23న హంస వాహనం, 24, 25, 26, 27న వసంతోత్సవం, 28న ఊంజల్ సేవ, 29న 16 రోజుల పండుగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రభలు పలు సాంస్కృతిక కళా కార్యక్రమాలు, ఎడ్ల బండ్ల లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు



వాస్తు శిల్ప వైభవం

చెన్నుని ఆలయ మండపంలో అద్భుత శిల్ప సంపద ఉంది. అన్నదమ్ముల స్తంభాలు ఆశ్చర్యచకితులను చేస్తాయి. అన్నదమ్ములైన ఇద్దరు శిల్పులు మధ్యలో తెరకట్టి ఒకరినొకరు చూసుకోకుండా చెక్కిన శిల్పాలు అచ్చు ఒకేలా ఉంటాయి. భవిష్యత్తులో ఆలయ మహాద్వార, మహా మండప నమూనాలతో ఉండాలని ఈ స్తంభాలు సూచిస్తాయి. మొత్తం 40 స్తంభాలు సకల ప్రాణిసమూహాలకు చిహ్నాలుగా ఉంటాయి. ఆలయంలో పదముగ్గురు ఆళ్వార్లు, వేణుగోపాల స్వామి, లక్ష్మీనరసింహస్వామి, గోదాదేవి, శ్రీదేవి భూదేవి సమేత రంగనాయక స్వామిల అంతరాలయాలు ఉంటాయి. ఆలయ ఈశాన్య భాగంలో యజ్ఞశాల ఉంది.



రాయలవారి విజయ స్తంభాలు

రాయల వారి ఆదేశం

శ్రీకృష్ణ దేవరాయులు విజయనగరాన్ని పరిపాలించే కాలంలో మార్కాపురం ప్రాంతం ఆయన ఏలుబడిలో ఉండేది. నెల్లూరు సీమను పరిపాలించిన సిద్ధిరాజు తిమ్మరాజయ్య రాయలవారి ఆదేశాల మేరకు చెన్నకేశవస్వామి గర్భాలయ, అంతరాలయ, మధ్యరంగ మండపాలు, మహాద్వార నిర్మాణం గర్భగుడిపై విమాన గోపుర నిర్మాణాలు చేయించారు. మహాద్వారంపై గాలిగోపుర నిర్మాణం జరగలేదు. క్రీ.శ.1529లో శ్రీకృష్ణదేవరాయుల పరమపదించడంతో ఆలయ నిర్మాణం ఆగిపోయింది. 1529న అచ్యుతదేవ మహారాయులు శ్రీశైలం వెళ్తూ కోనేటి కొండరాజయ్య, రంగరాజయ్యలను మిగిలిన దేవాలయ నిర్మాణాలకు పురమాయించారు. స్వామి తూర్పు భాగాన పుష్కరిణిలో మండపం వీరి ఆధ్వర్యంలో నిర్మితమయ్యాయి. ధనుర్మాసంలో సూర్యకిరణాలు గర్భాలయంలోని స్వామి మూల విరాట్ పాదాల నుంచి శిరస్సు వరకు ప్రసరిస్తాయి..

అబ్బురం.. రాతి మండపం

ఆస్థాన మండపం చుట్టూ ఒకే రాతితో చుంచు నిర్మాణం వంపులు వంపులుగా చెక్కబడి అందంగా కనిపిస్తుంటుంది. చుంచుకు విశేషమైన ప్రాముఖ్యం ఉంది. మార్కాపురం చుంచు, మంగళగిరి గాలిగోపురం, ఎగువపాలెం రచ్చబండ ప్రసిద్ధి గాంచాయి. నవరంధ్ర నిర్మితమైన మానవ దేహానికి సంకేతాలుగా 9 అంతస్తులతో గవాక్షాలతో అతి సుందర గాలిగోపురం చెన్నయ్య ప్రత్యేకం. గాలి గోపురాన్ని 1929లో లింగరాజు అనే భక్తుడు భక్తుల సహకారంతో ప్రారంభించారు. అనంతరం రామనం యోగేశ్వరరావు గ్రామస్థుల సహకారంతో 7 అంతస్తులు పూర్తి చేశాడు. 1936లో శ్రీరంగం శ్రీవాస మమలై జీయర్ స్వామి గోపుర కలశ స్థాపన మహా సంప్రోక్షణ కుంభాభిషేకం నిర్వహించారు. గాలి గోపురం శిథిలం కావడంతో రూ.70 లక్షలతో జీర్ణోద్ధరణ పనులు నిర్వహించారు. 2013లో శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి జీర్ణోద్ధరణ జరిగిన గాలి గోపురానికి మహాసంప్రోక్షణ కుంభాభిషేకం నిర్వహించారు.



అన్నదమ్ములు చెక్కిన స్తంభాలు

పోలీసులను నమ్మించి.. బురిడీ కొట్టించి..

పాత దొంగ ఇన్‌ఫార్మర్‌గా ఉంటూ రెండు నెలలో పలు దొంగతనాలు

అదుపులో మోస్ట్‌వాంటెడ్?

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలు చేయడంలో అతను ఆరితేరిన క్రిమినల్. చిన్నవయస్సు నుంచే చిల్లర దొంగతనాలు చేస్తూ పట్టుబడ్డ చరిత్ర ఉంది. ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో అతనిపై షీటు కూడా ఉంది. తాను చోరీలు చేయడం మానేశానని పోలీసులతో నమ్మించి చెలిమి చేశాడు. ఇతర దొంగల గురించి పోలీసులకు సమాచారమిచ్చేవాడు. దీంతో పోలీసులు కాస్త సడలింపు ఇచ్చారు. అదే అదునుగా భావించి రెండు నెలలుగా ఒంగోలు పరిసరాలలో 15 నుంచి 20 దొంగతనాలకు పాల్పడ్డాడు. కొన్నిచోట్ల దొరికిన సీసీ ఫుటేజీ, ఫింగర్ ప్రింట్ ఆధారంగా చోరీ చేసింది చిడితోటి మధుగా గుర్తించారు. అతను పేర్నమిట్ట గ్రామంలోని కొండ కింద ఉంటాడు. అంతేకాదు తాను దైవభక్తిలో మునిగిపోయానని ఇంటి వద్ద ఓ చిన్న గుడి కూడా కట్టించాడు. దొంగిలించిన సామగ్రిని ఆ గుడిలో దాచిపెడుతూ పైకి తాను మార్పు చెందానని ఐడీ పార్టీ పోలీసులను నమ్మించాడు. దీంతో అతని కదలికలపై పోలీసులు దృష్టి పెట్టడం మానేశారు.అదే అదునుగా తాళ్లూరు, అద్దంకి, కందుకూరు తదితర ప్రాంతాలలో చోరీ చేసిన సొత్తును గుడిలో దాచి పెట్టాడు. అంతే కాకుండా వెంగముక్కలపాలెం వెళ్లే దారిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని అక్కడ కొంత సామగ్రి దాచాడు. ఇలా దొంగ సొత్తు దాచి పెడుతున్నా ఒంగోలు పోలీసులకు ఏ మాత్రం అనుమానం రాలేదు. తాళ్లూరు పోలీసు స్టేషన్ పరిధిలో చోరీల గురించి విచారణ కోసం పేర్నమిట్ట వచ్చిన పోలీసులకు మధు ఇంట్లో దొంగిలించిన సామాగ్రి కనిపించింది. దీంతో ఆ సామగ్రిని తీసుకెళ్లేందుకు తాళ్లూరు పోలీసులు ఒంగోలులో ఉన్న సీసీఎస్ పోలీసులకు సమాచారం ఇచ్చి తీసుకెళ్లారు. అప్పటి నుంచి మధు కోసం తాళ్లూరు పోలీసులు తిరుగుతున్నారు. అతనిపై షీటు ఉన్న తాలూకా పోలీసులు కానీ, దొంగతనం చేసి సొత్తు దొరికింది అనీ తెలిసిన సీసీఎస్ పోలీసులు కాని అతని కోసం కన్నెత్తి చూడకపోవడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అనేక కేసులలో నిందితుడిగా ఉన్న మధు కదలికలపై ఒంగోలు పోలీసులు దృష్టి సారించకపోగా ఇన్‌ఫార్మర్ అనే నెపంతో వదిలేసి తిరుగుతున్నారు. అదేఅదునుగా రెండు నెలల్లో సుమారు 15 దొంగతనాలు చేసినట్లు తెలిసింది. తాళ్లూరు పోలీసులు గాలిస్తుండగా మధు దొరికినట్లు సమాచారం. అనేక కేసులలో మధు నిందితుడు కావడంతో పోలీసులు గోప్యంగా విచారిస్తున్నారు.

పాత నేరస్థుల కదలికలపై కొరవడిన నిఘా

పాత నేరస్థులపై నిఘా కొరవడింది.నేరాలకు పాల్పడి జైలు నుంచి వచ్చాక తిరగి మళ్లీ నేరాలు చేయడం పరిపాటిగా మారింది. మధు చిన్నతనం నుంచి దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. అలాంటి నేరచరిత్ర ఉన్న వ్యక్తిని ఇన్‌ఫార్మర్ అని నమ్మి వదిలేయడంతో సుమారు 15 నుంచి 20 చోరీలు చేశాడు. అదేవిధంగా మార్కాపురం చెందని ఓ నేరస్థుడు ఒంగోలులోని దిబ్బలరోడ్డులో ఏటీఎం చోరీకి విఫలయత్నం చేసినట్లు పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. ఇలా పాతనేరస్థులపై నిఘా కొరవడంతో అనేక దొంగతనాలు జరుగుతున్నాయి.

జిల్లాలో వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వెట్టిచాకిరీ వ్యవస్థను పూర్తి స్థాయిలో నిర్మూలించేలా అన్నిశాఖల అధికారులు దృష్టిసారిచాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వెట్టిచాకిరీ నుంచి విముక్తి అయిన వారికి పునరావాసం కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో గురువారం జరిగిన జిల్లా స్థాయి వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వెట్టిచాకిరీ వ్యవస్థను పూర్తి స్థాయిలో నిర్మూలించేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇటీవల వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని గుర్తించి ఆ వ్యవస్థ నుంచి బయటకు తీసుకొచ్చామన్నారు. కొత్తపట్నం మండలం అల్లూరు, ఈతముక్కల గ్రామాలకు చెందిన ఏడు కుటుంబాలు చిలకలూరిపేట సమీపంలో జామాయిల్ పనికివెళ్లగా వారి అమాయకత్వాన్ని, పేదరికాన్ని అవకాశంగా చేసుకొని యజమాని వెట్టిచాకిరీ చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి ఘటనలు అధికారుల దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత ఐజేఎం ప్రతినిధి ప్రియాంక వెట్టిచాకిరి వ్యవస్థ రద్దు యాక్ట్ 1976 పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈ శ్రమ్ పోర్టల్‌లో ప్లాట్ ఫాం కార్మికులు, గిగక్ష కార్మికుల సమీకణ, పేర్లు నమోదుకు కార్మికశాఖ రూపొందించిన వాల్ స్టిక్కర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జేసీ గోపాల కృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ప్రతి ఇంటికీ డోర్ నెంబర్లు వేయిస్తాం

డీఆర్వో ఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంతోపాటు అన్ని మునిసిపాలిటీల్లో గృహాలకు డోర్ నెంబర్లు వేయిస్తామని డీఆర్వో చిన ఓబులేషు చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతినెలా జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయడంతో పాటు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలు సరిగా ఉన్నాయా, లేవా పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. ఓట్ల చేర్పులు, మార్పులకు రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. కాగా రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు అంశాలను సమావేశంలో ప్రస్తావించగా వాటిపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు ఎం. వెంకటశివరామిరెడ్డి, ఎస్ జాన్సన్, ఎ కుమార్, వరకుమార్, ఎంవీ సత్యనారాయణ, ఎన్నికల్ సెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకట్రావు, రసూల్, డీఎస్ క్రాంతికుమార్, సత్యం, పోగు సదర్శన్, రమేష్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యలో సంస్కరణలు

ఈ విద్యా సంవత్సరంలో చేరబోయే ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు అమలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఇంటర్ విద్యలో పలు సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇంటర్ విద్యా మండలి జనవరిలో ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యావేత్తల నుంచి తీసుకున్న అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ సంస్కరణలకు శ్రీకారంచుట్టింది. ఉన్నత విద్య, పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలుకు ఇంటర్మీడియేట్ విద్యా మండలి చర్యలు తీసుకుంది. ఈ సంస్కరణలు ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ గ్రూపులకు వర్తించే విధంగా చర్యలు తీసుకున్నారు. రెండవ సంవత్సరం విద్యార్థులకు పాత పద్ధతిలోనే ఈ ఏడాది కొనసాగుతుంది.

సబ్జెక్ట్‌ల రూపకల్పన కూడా కొత్తగా..

మొదటి సంవత్సరం పాఠ్యాంశాల పునర్విమర్శ ద్వారా కొత్త పాఠ్యపుస్తకాల రూపకల్పన చేశారు. అదనపు సబ్జెక్టులతో కొత్త కాంబినేషన్ల రూపకల్పన చేశారు. మ్యాథ్స్-ఎ, మ్యాథ్స్-బి ఈ రెండింటిని ఒకే సబ్జెక్టుగా, బోటని, జువాలాజీలను కలిపి బయాలజీ గా ప్రవేశపెట్టనున్నారు. ప్రశ్నాపత్రం డిజైన్ కూడా మొదటి సంవత్సరం విద్యార్థులకు మార్పు చేశారు. జాతీయ పాఠ్యాంశాల రూపకల్పనను అనుసరించి విద్యార్థి గుర్తించుకోవడం కంటే అర్థవంతంగా అవగాహన చేసుకోవడమే లక్ష్యంగా సిలబస్‌ను రూపొందించారు. సైన్స్ గ్రూపులకు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను, ఆర్ట్స్ గ్రూపులకు హిమానిటీస్‌ను ఇంటర్ బోర్డు సిలబస్‌ను అనుసరించారు. పార్ట్-1 సబ్జెక్టు కింద ఆంగ్లభాషను తప్పనిసరిచేశారు. పార్ట్-2 సబ్జెక్టు కింద జాతీయ భాషలతో పాటు మరికొన్ని సబ్జెక్టులు ఉంటాయి. వీటిలో విద్యార్థి తన అభీష్టం మేరకు ఒక దానిని ఎంపిక చేసుకోవచ్చు. పార్ట్-3 గ్రూపు కోర్స్ సబ్జెక్టు ఈ విభాగంలో సాధారణ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉంటాయి. ఒక్కొక్క గ్రూపునకు మూడు సబ్జెక్టులు ఉంటాయి. కొత్తవిధానంలో ఎంపీసీ విద్యార్థి అదనపు సబ్జెక్టుగా బయాలజీని, బైపీసీ విద్యార్థి అదనపు సబ్జెక్టుగా గణితాన్ని ఎంపిక చేసుకోవచ్చు. అలా ఇంటర్ విద్యలో ఇంటర్మీడియెట్ విద్యా మండలి అనేక సంస్కరణలను చేపట్టింది.

నగరానికి నీటి కష్టాలు..!

- నిరంతరం పలుచోట్ల తాగునీటి సమస్య
- వేసవిలో ప్రజలకు తప్పని కష్టాలు
- పలు కాలనీల్లో నీరు విడుదలై నేటికి వారం
- కనీసం ట్యాంకర్లు కూడా ఏర్పాటు చేయని కార్పొరేషన్ అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం మొదలైంది. ఎండలు మండుతున్నాయి. తాగునీటి అవసరాలు పెరిగాయి. కానీ నీటి సరఫరా మాత్రం మెరుగుపడటం లేదు. పదేపదే వేధిస్తున్న మోటార్ల సమస్యతో ప్రజల గొంతు ఎండుతోంది. ఒంగోలు నగరంలో 2 లక్షల 52 వేల మంది జనాభా, సుమారు 67 వేల గృహాలు, తాగునీటి పైపులేని మరో 10వేల గృహాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు. వారానికో, పది రోజులకొకసారి తాగునీటి అవస్థలు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత మంది జనాభా గల నగరంలో నీటి సరఫరాకు అనుగుణంగా చర్యలు లేకపోవడంతో వేసవి సమయంలో సాధారణంగా కనిపించే విద్యుత్ సమస్యను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా పూర్వం ఎప్పుడో కొనుగోలు చేసిన రెండు మోటార్లు వేధిస్తున్నా, ప్రత్యామ్నాయంగా అదనపు మోటార్లు ఏర్పాటు చేయకపోవడం ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నది. ఇదిలా ఉండగా, పలు కాలనీల్లో నీరు విడుదలై వారం రోజులు అవుతున్నా, కనీసం ట్యాంకర్లు కూడా ఏర్పాటు చేయకపోవడం ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం కనిపిస్తున్నది.

అస్తవ్యస్తంగా సరఫరా

నగరంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. నీటి సరఫరా కోసం ఏడాదికి రూ.50లక్షలు ఖర్చు చేస్తున్నా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. పలుచోట్ల విచ్చలవిడిగా ఉన్న లీకులు కారణంగా ఉన్న నీరు గృహాలకు సరిపడినంతగా వచ్చే అవకాశాలు కన్పించడం లేదు. పైపులైనులు లేని కారణంగా ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా శివారు కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ప్రభుత్వ ట్యాంకర్లు గతంలో మూడు ఉండగా అవి ప్రస్తుతం మరమ్మతులతో నిరుయోగంగా ఉన్నాయి. ఇక కార్పొరేషన్‌లో విలీనమైన పది పంచాయతీలకు అరకొర ట్యాంకర్లే దిక్కయ్యాయి.

పలు కాలనీలకు బంద్

నగరంలోని పలు కాలనీలకు నీరు విడుదలై నేటికి వారం రోజులు అవుతుంది. వడ్డెవానికుంట, హరిహరనగర్, దామచర్ల నగర్, శివాజీనగర్‌కు నీరు వచ్చి వారం రోజులు అయింది. అలాగే గాంధీనగర్, కొత్త డొంక, జడ్పీ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, మిలటరీ కాలనీ, యానాది సంఘం, శివప్రసాద్ కాలనీలకు గత నాలుగు రోజులుగా నీరు రాకపోవడంతో అక్కడి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి నీటి సమస్యల పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు.



వారం రోజుల క్రితం కొండమీద పాత ఫిల్టర్ బెడ్‌లో పాడైన మోటార్లు

అంజయ్య మాస్టార్ రాజీనామా

ఒంగోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాకతీయ సేవా సమాఖ్య గౌరవ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు గనిపినేని అంజయ్య రాజీనామా చేశారు. ఒంగోలులోని మంగమ్మ కళాశాల ప్రిన్సిపాల్‌గా రిటైర్డ్ అయిన అంజయ్య స్థానిక పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా గుర్తింపు కలిగి ఉన్నారు. గత కొంతకాలంగా కాకతీయ సేవా సమాఖ్యకు గౌరవాధ్యక్షులుగా పనిచేస్తున్న ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఒంగోలులో కమ్మ సామాజికవర్గానికి చెందిన మరొక సంఘం ఏర్పడింది. అయితే తాను గౌరవాధ్యక్షుడిగా ఉండి సంఘం చీలికను నిలువరించలేకపోయానని బాధను వ్యక్తం చేసిన అంజయ్య మాస్టార్ కమ్మవారిలో కొందరికి శత్రువుగా ఉండదలుచుకోక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అంతా ఐక్యంగా ఉండాలని కోరుకునే వారు తన నిర్ణయాన్ని సమర్థిస్తారని ఆశి స్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శాశ్వత కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు శాశ్వత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో కోరారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ స్కూళ్లలోకి సర్దుబాటు చేయాలన్నారు. కంభం శ్రీసత్యనారాయణ శ్రీనివాస ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి పెండింగ్ జీతాల సమస్యను పరిష్కరించాలని, కొమరోలు మండలం గోపానుపల్లి ఏబీఎం ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుడు ఆంజనేయులుకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. చెరుకూరు ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయుల 15 నెలల జీతాల సమస్యను పరిష్కరించాలన్నారు.

రేపు గార్లపాడు గంగమ్మ తిరుణాళ్ల

మద్దిపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ముంపు గ్రామమైన గార్లపాడులో ఈనెల 12వ తేదీన గంగమ్మ తల్లి వార్షిక తిరుణాళ్లను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. వైభవంగా ఈ తిరుణాళ్లను నిర్వహించేందుకు గ్రామస్థుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తున్న ఈ తిరుణాళ్లకు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

పేస్ కళాశాలలో సెమినార్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి- సుంకం ఆర్థిక అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.జయరాజు ప్రసంగించారు. విద్యుత్ ఉత్పత్తి, ఆర్థిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కోర్ రంగంపై అవగాహన పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ డీవీ.సుబ్బారావు, కాలేజీ మేనేజ్‌మెంట్ మద్దిశెట్టి కళ్యాణ్, విభాగాధిపతి నాగరాజు, కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల బకాయిలను చెల్లించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మోప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు రెండు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని మోప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు కల్పన కోరారు. గురువారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి పనిభారాన్ని తగ్గించాలన్నారు. ఆర్పీలకు సంబంధం లేని పనులను కూడా చేయిస్తున్నారని తెలిపారు. యూనిఫాంతో పాటు సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు ఇవ్వాలన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆర్పీలకు ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు మెడికల్ లీవులు, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో రాహేలమ్మ, విజయలక్ష్మి, పద్మ, సుజాత, రమణ, భాగ్యం పాల్గొన్నారు.

పరిశ్రమల సందర్శన

ఒంగోలు విద్య, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వమహిళా కళాశాల విద్యార్థినులు వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో గురువారం మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలోని రెయిన్‌బో గ్రానైట్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో జరుగుతున్న గ్రానైట్ ఉత్పత్తి ప్రక్రియ, నిర్వహణ పద్ధతులు, మానవ వనరుల వినియోగం, మార్కెటింగ్ విధానాలు అంశాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి విద్యార్థినులకు ఆయా అంశాలను వివరించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగ ఇన్‌చార్జి పి.కుసుమకుమారి, అధ్యాపకులు కెరాణి, ఎం.పద్మ పాల్గొన్నారు.

నేడు పూలే కాంస్య విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న మంత్రులు

సింగరాయకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు యాదవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టూరిజం, మారిటైం బోర్డుల చైర్మన్లు బాలాజీ, దామచర్ల సత్య హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

గుర్తింపు సంఖ్య ద్వారా రాయితీలు

మద్దిపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య ఇస్తున్నామని సీతారాంపురం రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్ వేల్పుస్వామి తెలిపారు. గురువారం నందిపాడులో రైతులకు యూనిక్ నెంబర్‌పై అవగాహన నిర్వహించారు. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీలు, యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీలు, పంట రుణాల పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందవచ్చని రైతులకు సూచించారు.

13న పామూరులో జేవీవీ శిక్షణ తరగతులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పామూరులో ఈనెల 13న జరిగే జన విజ్ఞాన వేదిక జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జరుగుతాయని జిల్లా గౌరవ సలహాదారులు ఏవీ.పుల్లారావు తెలిపారు. గురువారం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఈమేరకు కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. నగర అధ్యక్షుడు ఎస్వీరంగారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావుతో పాటు పలువురు ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధానకార్యదర్శి సీహెచ్.జయప్రకాష్, నాయకులు చంద్రశేఖర్, టీవీఆర్.సుబ్బారావు, బి.ఆంజనేయులు, జి.హరిబాబు, జి.ఉమామహేశ్వరి, ఎస్వీశ్రీనివాసరావు, ఎన్.నాగేశ్వరరావు, కేఎఫ్.బాబు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు సినీనటుడు కృష్ణ పుస్తకం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కళాకారులు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సూపర్ స్టార్ కృష్ణ జీవిత శతక రత్న వరాలు పుస్తక ఆవిష్కరణ ఈ నెల 12వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని పుస్తక రచయిత గన్నెపూడి యోబు అన్నారు. సూపర్ స్టార్ కృష్ణ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని గురువారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో పలువురు కళాకారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరుగుతుందని, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. కనుక కృష్ణ అభిమానులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కుర్రా ప్రసాద్‌బాబు, పి.పేరయ్య, ఐనంపూడి నరసింహారావు, డీవీ.సుబ్బారావు, వెన్నూరి నాగేశ్వరరావు, పుప్పాళ్ల రాంబాబు, చైతన్య ప్రసాద్, శాంతారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ రేపు

సంతనూతలపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి పనులపై ఈనెల 12న సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో డి.సురేష్‌బాబు గురువారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరుకావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా



చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

కొండపి, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ నిధులు అందజేయడం ద్వారా పేదలకు సీఎం చంద్రబాబు నాయుడు భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం తూర్పు నాయుడుపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పలువురు బాధితులకు ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

శ్రీచైతన్య విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఐఎన్‌టీఎస్‌వోలో బహుమతులను సాధించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక స్కూలులో బహుమతులు సాధించిన అంకిశెట్టి మోక్షసాయి, లక్ష్మి, భూమిడి సూర్యజనార్దన్, హన్సుజ, ఎస్.పూజిత, సీహెచ్.అరాధ్య, కావ్య, దీక్షితలకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు, టాబ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీచైతన్య కార్యక్రమాలు, సిలబస్ కారణంగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ తంబి, హర్ష, శేషయ్య, అపర్ణ, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఆర్ఐ అనిల్‌కుమార్, డీన్‌లు బాలసుబ్రహ్మణ్యం, శివ, సాయిరాం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీరప్పకుంటలో చెత్తను తొలగించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని వీరప్పకుంటలో వేసిన చెత్తాచెదారం తొలగించి పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో వీరప్పకుంట వర్షానికి నీరు చేరి చుట్టుపక్కల 100 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకునేవారు. గత వైసీపీ హయాంలో మద్దిపాడు గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని ఆ కుంటలో వేసి పూడ్చి వేశారు. దీంతో ఆ కుంట అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని ఉప సర్పంచ్ గుంటూరు కాశీరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది రైతులకు ఉపయోగపడిన కుంట కొంతమంది స్వార్థంతో చెత్తాచెదారం వేసి దాదాపు 7 ఎకరాల చెరువుని అధ్వానంగా తయారు చేశారని, చెరువును వినియోగంలో పెడితే రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీరప్పకుంటను పరిశీలించి పునరుద్ధరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం'



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సూర్యకళ్యాణచక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా గురువారం ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సూర్యకళ్యాణ్‌చక్రవర్తి పర్యటించారు. ముందుగా పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని ఆలయాలను, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆలయ ప్రాంగణం, రోడ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ, పంచాయతీ కార్యాలయాలను సందర్శించి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పుచ్చకాయల సుబ్బారావు, మక్కెన శ్రీనివాసులు, మక్కెన వెంకట్రావు, పుచ్చకాయల శ్రీనివాసులు, ముప్పా సుధాకర్‌రావు, మందపల్లి వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు అదనపు సాయం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ సత్యన్నారాయణ

జరుగుమల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం అందిస్తోందని, లబ్ధిదారులు త్వరగా ఇళ్లను పూర్తి చేసుకోవాలని కొండపి సెక్షన్ హౌసింగ్ డీఈ సత్యనారాయణ లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని వావిలేటిపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు.

50 శాతం వడ్డీ రాయితీ గడువు పెంపు

- కమిషనరు వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను చెల్లింపులకు ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీ గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు నగర కమిషనరు కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పన్ను చెల్లించని బకాయిదారులు ఏకమొత్తంలో చెల్లించడానికి 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఘనంగా గుమ్మళంపాడు తిరునాళ్ల





పూజల్లో పాల్గొన్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే బీఎన్, టీడీపీ ప్రభ వద్ద జనం

- హాజరైన ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడులో బుధవారం రాత్రి శ్రీప్రసన్నాంజనేయ స్వామి వార్షిక తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభపై బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో సంక్షేమానికి ఎటువంటి ఢోకా లేదన్నారు. సూపర్-6 పథకాలు కొంచెం ఆలస్యమైన అర్హులందరికీ అందుతాయని చెప్పారు. తొలుత ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ స్వాములు, మండల అధ్యక్షుడు హరిబాబులను సత్కరించారు. కాగా ప్రభలపై ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. వైసీపీ ప్రభపై దర్శి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్పీచైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఇన్‌చార్జ్ చుండూరి రవి ప్రసంగించారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ వి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



సినీ పాటలకు డాన్స్‌లు చేస్తున్న కళాకారులు

అవినీతికి పాల్పడిన వారి నుంచి రికవరీ చేయాలి

- పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశం



సభలో పాల్గొన్న పీడీ జోసఫ్‌కుమార్, ఇతర అధికారులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారి నుంచి అందుకు సంబంధించిన నగదు రికవరీ చేయాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల్లో ఎవెన్యూప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు ఎక్కడా కనుచూపుమేరలో కనిపించటం లేదని చెప్పారు. గురువారం ఒంగోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ జరిగింది. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం మాట్లాడుతూ యరజర్ల ఒక్క గ్రామ పంచాయతీలో రూ.30 వేలు రికవరీ చేయాలన్నారు. కొంతమందికి అదనంగా వేతనాలు చెల్లించారని గుర్తించినట్లు చెప్పారు. ఎవెన్యూప్లాంటేషన్‌లో భాగంగా యరజర్ల, చేజర్ల, పాతపాడు, మండవవారిపాలెం, కరవది, గుండాయపాలెం, వలేటివారిపాలెం, ఉలిచి గ్రామాల్లో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లనే మొక్కలు తుడిచి పెట్టుకుపోయాయని చెప్పారు. మరలా మొక్కలను నాటాలని కోరారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు ద్వారా ప్రజలు ఉపాధి పొందాలన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా క్షేత్ర సహాయకులు బాధ్యతగా పనులు చేయించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఏపీవో పి.వెంకటరావు, ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి, ఎస్ఆర్పీ నందిని క్షేత్రసహాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన పోలేరమ్మ తల్లి విగ్రహం

ఒంగోలు(రూరల్), ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం నర్సాపురంఅగ్రహారం గ్రామంలో గురువారం గ్రామదేవతలు పోలేరమ్మతల్లి, అంకమ్మతల్లి, గణపతి, పోతురాజుస్వామి విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాలును వైభవంగా నిర్వహించారు. ముందుగా వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాకులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





పోతురాజుస్వామి, మహాగణపతి విగ్రహాలకు భక్తులకు ప్రత్యేక పూజలు

చిన్నారులకు పోషకాహారం అందించాలి

- ఎంపీడీవో రాజశేఖరరావు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికామారం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.రాజశేఖరరావు కోరారు. ఒంగోలు మండలం యరజర్లలో గురువారం పోషణ్‌పక్వాడ్‌లో ఆయన మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత రాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. పోషక పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: చిన్నారులకు తప్పకుండా పోషకాహారం అందించాలని మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినీలాచౌదరి పేర్కొన్నారు. గురువారం నందిపాడు, బసవన్నపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమం ఘనంగా జరిగింది. సీడీపీవో ఇవాంజెలిన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వినీలచౌదరి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వటం శ్రేష్ఠమని చెప్పారు. సీడీపీవో ఇవాంజెలిన్ మాట్లాడుతూ బాలింతలు పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ జయలక్ష్మి, జి.పద్మావతి, శివనాగరాజు, బి.రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎం.వేములపాడులో

సంతనూతలపాడు: ఎం.వేములపాడులో గురువారం పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతి బాయి, సర్పంచ్ విజయలక్ష్మి, వేములపాడు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులోని దిన్నెమీద అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు ఉషారాణి, శ్రీదేవి అవగాహన కల్పించారు.

పీడీ సమీక్ష

కొండపి, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): డీఆర్డీఏ, వెలుగు కార్యక్రమాల ద్వారా జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలపై పీడీ టి.నారాయణ గురువారం కొండపిలోని వెలుగు కార్యాలయంలో అధికారులుతో సమీక్ష నిర్వహించారు. ఎఫ్‌సీ, ఎల్‌హెచ్ కార్యాచరణ పథకంపై సీసీలతో క్లస్టర్‌లు వారీగా రివ్యూ నిర్వహించారు.

సింహవాహనంపై శ్రీరఘునాయకస్వామి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ చదలవాడలోని శ్రీరగునాయకస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు గురువారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన చివుకుల శ్రీరామశర్మ, రంజిత్‌కుమార్, చీర్వానుప్పలపాడుకు చెందిన ఓరుగంటి దత్తాత్రేయ, శ్రీశాస్త్రి, మురళీ, మట్టుపల్లి కామిశెట్టి వారి సంతతి ఉభయదాతలుగా వ్యవహరించారు. రాత్రి స్వామి వార్లను ప్రత్యేక అలంకరణలో సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గవండ్లపాలెం వారి కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది. ఒంగోలు మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆయా కార్యక్రమాలను ఈవో అనిల్ పర్యవేక్షించారు.

రేపు ఉపాధి పనులపై ప్రజా వేదిక

మద్దిపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలంలో 2023-24 వరకు జరిగిన పనులపై ఈ నెల 11న మద్దిపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు అంబుడ్స్‌మెన్ కూడా హాజరవుతారన్నారు. గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవకతవకలు గురించి ఫిర్యాదు చేయవచ్చని ఆయన చెప్పారు.

నేడు నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకం ద్వారా మండలంలోని గ్రామాల్ల చేపట్టిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఏపీవో రవిబాబు తెలిపారు. సామాజిక తనిఖీ బృందాలు పనులను తనిఖీ చేసి ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అవి.. ఇవి

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

త్రిపురాంతకం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని విత్తన దుకాణంలో వ్యవసాయశాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించారు. శ్రీలక్ష్మీబాలాజీ సీడ్స్ ఫెస్టిసైడ్స్‌లో తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా పలు కంపెనీల పత్తి విత్తనాల నమూనాలను నాణ్యతా ప్రమాణాల పరీక్షలైనటువంటి హెర్బిసైడ్ టోలరెన్స్ పరీక్షలు చేశారు. పరీక్షలలో అన్ని నాణ్యతా ప్రమాణాలకు అణుగుణంగా ఉన్నట్లు గుర్తించారు. ఈసందర్భంగా గుంటూరు కమిషనర్ కార్యాలయ ఏడీ బాలభాస్కర్ మాట్లాడుతూ ఎవరైనా విత్తన డీలర్లు కల్తీ విత్తనాలు అమ్మినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సులు కూడా రద్దు చేస్తామన్నారు. ఈతనిఖీలలో ఏవోలు జీ.మోహన్, కె.నీరజ, ఒంగోలు టెక్నికల్ ఏవో వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ పత్తి విత్తనాల దుకాణాల తనిఖీ

కంభం : మండలంలోని ఐదు పత్తి విత్తనాల దుకాణాలను రాష్ట్ర బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ తనిఖీలో ఏడీఏ డాక్టర్ బాలభాస్కర్, వ్యవసాయాధికారి జి.మోహన్ విత్తనాల తనిఖీ నిర్వహించారు. మొత్తం 5 దుకాణాలలో 14బీటీ పత్తి రకాలపై పరీక్షలు నిర్వహించగా వీటిలో నెగిటివ్ రిజల్ట్ వచ్చినట్లు తెలిపారు. హెచ్‌టీ ట్రేడ్ టెస్టులు నిర్వహించారు. ఈ తనిఖీలో ఏడీఏ బాలాజీనాయక్, కంభం ఏవో స్వరూపా, వ్యవసాయ విస్తరణాధికారి, శివగంగ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న నీటివాల్ పూడ్చివేత


నీటి వాల్‌ను పూడ్చిన అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతందో అని ప్రజలు భయపడుతూ తిరాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని ఎర్రగొండపాలెం నుంచి వీరభద్రాపురం, ఇజ్రాయిల్‌పేట, పొస్టాపీసు వెళ్లే రహదారి లోని నాలుగు కూడలి కలిగిన రహదారి మధ్యలో నీటి వాల్ ప్రమాదకరంగా ఉందని ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు స్పందించారు. పంచాయితీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి ఆదేశాలతో ప్రమాదకరంగా ఉన్న నీటి వాల్‌ను పూడ్చి మట్టి వేయించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలతో పాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంచి నడవడికను అలవరచుకోవాలి


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్సై

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలతో పాటు పట్టణంలోని రౌడీషీటర్లు పలువురు ముద్దాయిల నివాసాలను మంగళవారం అర్ధరాత్రి ఎర్రగొండ పాలెం సీఐ సీహెచ్ ప్రభకరరావు, ఎస్సై పి.చౌడయ్యలు తన సిబ్బందితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి రౌడీషీటర్లు, పలువురు ముద్దాయిల కదలికలపై నిఘా ఉంచి ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెలిసి తెలియక చేసిన తప్పులను పక్కన పెట్టి మంచి నడవడికతో ఉండాలని వారికి సూచించారు. ఏప్పుడైన, ఎక్కడైన చెడు ఆలోచన రాకుండా ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు వారిపై నిఘా ఉంటుందన్నారు. తప్పుడు ఆలోచన రాకుండా చూసుకోవాలని వారిని హెచ్చరించినట్లు తెలిపారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సారా తయారీకి బెల్లం ఇవ్వవద్దు


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ జయరావు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేసే వారికి బెల్లం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు వ్యాపారులను హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో బెల్లం హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో సీఐ జయరావు సమావేశం నిర్వహించారు. నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు మీ సహకారం కావాలని కోరారు. నాటుసారా తయారీదారులకు ఎట్టి పరిస్థితిలో బెల్లం సరఫరా చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా మార్చి నెలలో తమకు వచ్చిన బెల్లం ఎవరికి ఎంత విక్రయించిన వివరాలను వ్యాపారులు సీఐకి అందించి నాటుసారా వారికి బెల్లం విక్రయించడం లేదని, ఇకపై కూడా జరుగదని హామీ ఇచ్చారు.

అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధమైన ఘటన పట్టణ శివారులోని కొంగళవీడు రోడ్డులో గురువారం చోటుచేసుకొంది. ఈఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొంగళవీడు రోడ్డులో నివాసం ఉంటున్న కె.జగన్నాథం పూరిటిల్లో షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో ఇళ్లు మొత్తం మంటలు అంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో అందరూ ఆరు బయటే పడుకుని ఉండడంతో ఎవరికీ ఏ ప్రమాదం జరుగలేదు. కూలీ పనులు చేసుకుని జీవించే జగన్నాథం తన కుమార్తె వివాహం కోసం రూ. 2లక్షల విలువైన నగదు, బంగారు దాచి ఉంచగా అగ్నికి ఆ సొత్తు ఆహుతైంది. దీంతో ఆ కుటుంబం అంతులేని ఆవేదనకు గురైంది. ఫైర్ ఆఫీసర్ హరిబాబు ఆధ్వర్యంలో మంటలను వెంటనే అదుపు చేశారు.

నార్కోటిక్ మందుల అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి

- డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ డీవీ ఉషారాణి

మార్కాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నార్కోటిక్ మందుల అమ్మకాలు, కొనుగోళ్లలో నిబంధనలు తప్పకుండా పాటించాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ డీవీ ఉషారాణి పేర్కొన్నారు. స్థానిక మెడికల్ అసోసియేషన్ హాలులో గురువారం మెడికల్ షాపుల యజమానులకు నార్కోటిక్ (ఎన్‌డీపీఎస్) మందుల అమ్మకాలు, కొనుగోళ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఉషారాణి మాట్లాడుతూ నిర్దేశాలను ఉల్లంఘించి నార్కోటిక్ మందుల అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదన్నారు. ఉల్లంగిస్తే డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ ప్రకారం కఠినచర్యలు ఉంటాయన్నారు. చట్టపరిధికి లోబడి వ్యాపారం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముప్పసాని సాయిప్రణీత్, మాజీ అధ్యక్షులు యక్కలి బాలు, పట్టణ అధ్యక్ష, కోశాధికారులు శ్రీనివాసరావు, ప్రసాద్, మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

రాములోరికి వైభవంగా రథోత్సవం

- ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు
- రంగనాయకస్వామి, చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


రథం లాగుతున్న భక్తులు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం, ఐనముక్కల గ్రామాల్లో గురువారం రాములవారి రథోత్సవం వైభోపేతంగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా ఆయా గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామయ్యస్వామి, కాకర్ల లక్ష్మీప్రసాద్ శర్మ పర్యవేక్షణలో శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమంతులకు ప్రత్యేక అలంకరణలు పూజలు చేశారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల ప్రజలతో పాటు పరిసర గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం వడపప్పు, పానకం పంపిణీ చేశారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన రథంపై సీతారామలక్ష్మణ సహిత హనుమంతుల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బొగ్గరపు రమేష్, పెరుమాళ్ల సుబ్బారావు, దొడ్డా వెంకటేశ్వర్లు, డి.వెంకటసుబ్బయ్య, మిరియాల నారాయణ, మండ్ల వెంకటసుబ్బయ్య, రాములు, చిట్యాల రామకృష్ణారెడ్డి, జంగిలి పిచ్చయ్య, యక్కంటి లింగారెడ్డి, గొల్మారు శేఖర్‌రెడ్డి, పీ రామిరెడ్డి, మల్లారెడ్డి, ఆదినారాయణ, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న సీఐ రామకోటయ్య ఎస్ఐ కోటేశ్వరరావులు

రేపటి నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు

గిద్దలూరు: మండలంలోని సంజీవరాయునిపేట గ్రామంలో నిర్మించిన గణపతి, సుబ్రమణ్య, నవగ్రహ, ధ్వజసహిత కాశీవిశాలాక్షి సమేత మరకతలింగ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త సూరె చిన్నపీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 12న ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 13న విగ్రహాల గ్రామోత్సవం, రుద్రాభిషేకం, 14న హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం శాంతికళ్యాణ మహోత్సవం, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తున్నా మన్నారు. ప్రతిష్ఠ జరిగే మూడు రోజులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం

మార్కాపురం : శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఏర్పాట్ల పై అన్ని శాఖల అధికారులతో శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గొల మారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొంటారన్నారు.

బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

- 200 మంది పోలీసులతో ప్రత్యేక ఏర్పాట్లు

రాచర్ల (గిద్దలూరు) : రాచర్ల మండలం జేపీ.చెరువు సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు రూరల్ సీఐ రామకోటయ్య, ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. రాచర్ల పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా 200 మందికి పైగా పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో కల్యాణం తరువాత అక్షితల కోసం భక్తులు ఎగబడి న సందర్భాలను పురస్కరించు కుని ఇక మీదట అలా జరుగ కుండా బారికేట్లు ఏర్పాటు చేసి క్యూ పద్దతిలో అక్షింతలు అంద చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొ న్నారు. నీటిగుండంలో స్నానం ఆచరించే విషయంలో కూడా నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాచర్ల మీదుగా, అంబవరం మీదుగా బ్రహ్మోత్సవాలకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. అక్కడి నుండి దేవస్థానం వరకు వెళ్లేందుకు వీలుగా భక్తులందరికీ ఉచిత ఆటో సౌకర్యం కల్పించామన్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తున ఆటోలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు భక్తులు సహకరించాలని రూరల్ సీఐ రామకోటయ్య, ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించండి

- తీగలేరును చిన్న కండ్లేరు వరకు పొడిగించాలి
- సీఎంకు పోస్టు కార్డు పంపిన రైతుసంఘం నాయకులు


సీఎంకు పోస్టుకార్డులు పంపుతున్న రైతులు

పుల్లలచెరువు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశంలో శాశ్వతంగా కరువును నివారించడానికి పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం పుల్లలచెరువులో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులపై వెలిగొండ పూర్తి చేయాలని రాసి రాష్ట్ర సీఎం చంద్రబాబుకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే వెనుకబడిన పుల్లలచెరువు మండలంలో తాగునీటి కోసం 1000 అడుగులు బోర్లు తవ్వించిన నీరు పడడం లేదన్నారు. శాశ్వతంగా కరువు పోవాలంటే, వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు-5 కాలువను పుల్లలచెరువులోని చిన్న కండ్లేరు రిజర్వాయరు వరకు పొడిగించాలన్నారు. పుల్లలచెరువు మండలంలో అధికారంలో వున్న పార్టీలు పట్టించుకోవడం లేదని సాగు, తాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తీగలేరు-5 కాలువ ఎర్రగొండ పాలెం మండలం వరకే ప్రస్తు తం ఉందని కాలువ పనులు వెంటనే ప్రారంభించి పుల్లలచెరువు చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని అన్నారు. 2016 అప్పటి ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు ప్రస్తుత సీఎం, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి తీగలేరు అనుసంధానానికి అవసరమైన సర్వేకు నిధులు మంజూరు చేయించారని అన్నారు.గత 5 సంవత్సరాల వైసీపీ పాలనలో ఈ అంశం పట్టించుకున్న నాథుడే కరువయ్యార న్నారు. వైపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ కూడా వెలిగొండకు అవసరమైన నిధులను సేకరించి ప్రాజెక్టు పూర్తి అయ్యేందుకు కృషి చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో సాగు చేసిన బత్తాయి బొప్పాయి, నిమ్మ, అరటి, వాణిజ్య పంటలకు నీరు అందక తోటలు ఎండిపోతున్నాయని అన్నారు. వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు ప్యాకేజీ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ మండల కార్యదర్శి జీవీ. గురునాథం, టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు, వైసీపీ నాయకులు జానకీ రఘు, ఎంపీటీసీ సభ్యుడు రాధాకృష్ణ, సర్పంచి ఓబులు, శ్రీనివాసచారి రైతులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

కంభం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చిన్నకంభం గ్రామబస్టాండ్‌లో ప్రజల దాహార్తి తీర్చేందుకు జనసేన నాయకులు గ్రందె శ్రీనివాసులు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో కంభం మండల అధ్యక్షులు టి.ప్రసాద్, బేస్తవారపేట మండల అధ్యక్షులు మధు, బాలేశ్వరరావు, ఎస్.ఆంజనేయులు, డి.నవీన్, ఎస్.చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర నిల్వకేంద్రాల పరిశీలన


కంభం గురుకుల పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో

కంభం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర నిలువ కేంద్రాలను ఎంఈవోలు మాల్యాద్రి, శ్రీనివాసులు పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లోని గదుల వెలుతురు, వైశాల్యం, రక్షణ, తదితర సౌకర్యాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్య, వ్రాత పుస్తకాలు, నిఘంటువులు, యూనిఫామ్స్, బెల్టులు తదితర విద్యా ఉపకరణాలను ఈ కేంద్రంలో నిలువ చేస్తామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి వాటికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారం పక్వాడ

కంభం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి కేంద్రాల ద్వారా గర్భిణులకు కిశోర బాలికలకు రెండు సంవత్సరాల వరకు అదనపు ఆహారంతోపాటు తల్లిపాలు కూడా ఇవ్వనున్నట్లు అంగన్‌వాడి కార్యకర్త శ్రీదేవి తెలిపారు. గురువారం కంభం అర్బన్‌కాలనీలో ఈ నెల 2 నుంచి 23వ తేది వరకు జరుగుతున్న పోషణ పక్వాడ కార్యక్రమంలో తల్లులు, గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన ఆహార జాగ్రత్తలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సోని, మేల్ అసిస్టెంట్ రంగస్వామి, అంగన్‌వాడి కార్యకర్తలు శ్రీదేవి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుశీలాదేవి అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషన్ పక్వాడా పేరుతో పౌష్టికాహార పక్షోత్సవం గురువారం నిర్వహించారు. పిల్లలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 16వ వార్డులో కౌన్సిలర్ హర్షితా బాబీ పాల్గొని మాట్లాడుతూ.. గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వై.రవికుమారి, బుజ్జిబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి తీవ్రగాయాలు

నలుగురికి తీవ్రగాయాలు


ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పొదిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రెండు వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరొకరికి స్వల్పగాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన అన్నారామ్, విద్యారామ్‌లు బూదవాడలోకి ఓ ఫ్యాక్టరీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు పొదిలి నుంచి బూదవాడకు వస్తున్నారు. స్థానికులైన మహేంద్ర, సిద్దార్థారెడ్డిలు వారి బైకుపై ఎదురుగా వస్తున్నారు. ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకొంది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షత గాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్య శాలకు తరలించి చికిత్స అందజే స్తున్నారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం ఒంగోలు తర లించా రు. అదేవిధంగా పొదిలి దర్శి రోడ్డు లో బైక్‌పై ప్రయాణిస్తున్న కరేటి మణికుమార్‌ను ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యారు. మణికుమార్ కాలు విరిగింది. మణికుమార్ మర్రిపూడి మండలం కూచిపూడి గ్రామం నుంచి దర్శి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకొంది. ప్రమాదానికి గురైన మణికుమార్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేశారు.

డాక్టర్ మోహన్‌రెడ్డికి డాక్టరేట్


డాక్టరేట్ పత్రంతో మోహన్‌రెడ్డి

గిద్దలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరుకు చెందిన నేత్రవైద్య నిపుణులు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి సైకాలజి విభాగంలో డాక్టరేట్ అవార్డును పొందారు. చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.దొరస్వామి నుంచి మోహన్‌రెడ్డి డాక్టరేట్ అవార్డును పొందారు. వెంకటేశ్వర యూనివర్సిటికి చెందిన సైకాలజి ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వి.రమణరెడ్డి పర్యవేక్షణలో 'పర్సనాలిటి ఫ్యాక్టర్స్ అడ్జెస్ట్‌మెంట్ అండ్ లోకసాఫ్ట్ కంట్రోల్ ఎమాంగ్ ది విజువల్లి ఇంపైల్డ్ చిల్డ్రన్' అనే అంశంపై డాక్టర్ మోహన్‌రెడ్డి చేసిన పరిశోధనకు డాక్టరేట్ అవార్డు లభించింది. సమాజంలో అంధత్వ నిర్మూలన కోసం కృషి చేయా లని మోహన్‌రెడ్డికి వైస్‌చాన్స్‌లర్ దొరస్వామి సూచించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఎక్కువగా సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ వంటివి ఉపయోగించడం వలన, రసాయనిక పదార్థాలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం వలన కంటిజబ్బులు, దృష్టి లోపాలు ఏర్పడుతున్నాయన్నారు. సరైన వ్యాయామం లేక బీపీ, షుగర్, ఊబకాయం వంటి సమస్యలు వెంటాడుతున్నాయని డాక్టర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సమతుల్య ఆహారం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు తీసుకోవాలని సూచించారు.

రసవత్తరంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు


బండలాగుతున్న ఎడ్లజత

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి). మండలంలోని నికరంపల్లి గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవస్థాన తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో భాగంగా గురువారం ఆరుపళ్ల సైజు విభాగంలో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో మొత్తం 11 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. వీటిలో బేస్తవారపేట మండలం ఖాజీపురానికి చెందిన వేగినాటి ఓసూరారెడ్డి ఎడ్లజత మొదటి బహుమతి రూ.50 వేలు, రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన సూరా పూజితారెడ్డి ఎడ్ల జత రెండవ బహుమతి రూ.40 వేలు, కంభం మండలం ఎల్‌కోట గ్రామానికి చెందిన ఉలవల హరికృష్ణారెడ్డి ఎడ్లజత మూడవ బహుమతి రూ.30 వేలు గెలుచుకున్నాయి. పోటీలను రైతులు ఆసక్తిగా తిలకించారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి


పొదిలి ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పొదిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. ఆ మేరకు పొదిలి డిపో ఎదురు గేట్‌మీట్ ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమం డిపోవర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండీ ఇచ్చిన మెమోరాండంలోని సమస్యలను పరిష్కరించి, ఉద్యోగుల భద్రతా సర్క్యులర్‌లోని 1-2019ని వెంటనే అమలు చేయాలన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్, అనారోగ్య సెలవులకు పూర్తి జీతం అందించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. జీవో 114లో పొందుపరిచిన నైట్‌అవుట్ అలవెన్స్‌ను 150 నుండి 400లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో డిపో సీసీఎస్ డెలిగేట్ ఎస్ సాల్మాన్, జాయింట్ సెక్రెటరి ఎస్‌కె సత్తార్, ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగుంట్లలో 'పల్లెకు పోదాం'


నల్లగట్లలో గ్రామస్థులతో బీజేపీ నాయకులు

గిద్దలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగట్ల గ్రామంలో బీజేపీ నాయకులు పల్లెకుపోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు గ్రామస్థులను కలిసి ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన, జలజీవన్, ఉచితరేషన్ పంపిణీ, గ్రామీణ రహదారుల అభివృద్ధి, తదితర కేంద్ర పథకాల గురించి వివరించారు. ప్రాథమిక, అంగన్‌వాడీ పాఠశాలలను సందర్శించి వారికి అందుతున్న చదువు, ఆహార పదార్థాల గురించి ఆరా తీశారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం గురించి ప్రజలతో చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు, బీజేపీ నాయకులు కొప్పరపు నాగేశ్వరరావు, రాచర్ల కాసులు, మునగనూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన గుడిమెట్ట కాశీంవలి(40) ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే కాశీంవలికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసకావడంతో తరచూ భార్యాభర్తలి రువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాశీంవలి బుధవారం రాత్రి అందరూ నిద్రపోయిన తరువాత తన ఇంటి పక్కన ఉన్న వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాశీంవలి తల్లి ఓబులమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నూతన విద్యావిధానంపై అవగాహన

మార్కాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, నూతన విధానాలను, నైపుణ్యాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని ఒంగోలు రిమ్స్ వైద్యశాల ఫార్మసీ విభాగానికి చెందిన వైద్యులు కె.చంద్రకళ అన్నారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని శామ్యూల్‌జార్జి ఫార్మసీ కళాశాలలో గురువారం 'ఫార్మకోవిజిలెన్స్-ఫార్మసీ గ్రాడ్యుయేట్స్‌కు కెరీర్ మార్గం' అనే రెండు వారాల సర్టిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిమ్స్ ఫార్మసీ విభాగ బృందం గురువారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించింది. ప్రధానంగా 'ఫార్మకో విజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా అమలు విధానం, హీమో విజిలెన్స్, మెటీరియో విజిలెన్స్' అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజాజయరావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ వై.సునీత, డాక్టర్ అశోక్, ముజీబ్, విద్యార్థులు పాల్గొన్నారు

ఫ్యాక్టరీలను మూపించాలి

గిద్దలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ కవర్లు తయారు చేస్తున్న ఫ్యాక్టరీలను మూపించాలని వినియోగదారుల పరిరక్షణ సేవామండలి అధ్యక్షులు వి.వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వ రరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు వినియోగించడం ద్వారా ఆరోగ్యానికి హానికరమన్నారు.

16న అమరజీవి 125వ జయంతి

మార్కాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 16న అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లిఖార్జున్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక, సంక్షమశాఖమంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితోపాటు జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు.

అభివృద్ధి పనుల్లో 'రాజకీయం'

- కొర్రపాటివారిపాలెంలో రెండు పార్టీల మధ్య రగడ
- ఉన్నతాధికారులకు పరస్పర ఫిర్యాదులు
- సర్పంచ్ ఫిర్యాదుతో వైసీపీ కార్యకర్తలపై కేసులు
- ఎస్ఐ సమక్షంలో టీడీపీ శ్రేణులపై దూషణలు


ఎంపీ నిధులతో సాగర్ కాలువ కట్టపై నిర్మించిన సీసీ రోడ్డు

తాళ్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో రాజకీయం చోటుచేసుకుంది. ఇరుపార్టీలు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నాయి. ఎస్ఐ సమక్షంలోనే వైసీపీ శ్రేణులు దుర్భాషలాడగా ఎస్ఐ మందలించారు. వివరాల్లోకి వెళితే.. తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెం గ్రామానికి గత వైసీపీ ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ కింద మంచినీటి పథకం నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. సబ్ కాంట్రాక్టర్‌గా గ్రామ వైసీపీ నేతలు పనులు చేపట్టి కొంతభాగం పూర్తి చేశారు. తదనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో మిగిలిన పనులు అధికార పార్టీ నేతలు చేపట్టేలా చూడాలని టీడీపీ శ్రేణులు అధినేతల వద్ద పట్టుబట్టారు. దీంతో గ్రామంలో జలజీవన్ మిషన్ మిగిలిన పనులు నిలిచి పోయాయి.

గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు ఎంపీ మాగుంట సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరుచేయించారు. వెల్లంపల్లి రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే సాగర్ కాలువకట్ట రోడ్డు అధ్వానంగా ఉండటంతో, ఈనిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. జలజీవన్ పనులను అధికార పార్టీ శ్రేణులు అడ్డుకున్నారన్న ఆగ్రహంతో సాగర్ కాలువ కట్టపై సీసీ రోడ్డును నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, తగుచర్యలు తీసుకోవాలని ఆశాఖ అధికారులకు వైసీపీ శ్రేణులు ఫిర్యాదులు చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈక్రమంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 6న ఆయనను గ్రామానికి పిలిపించి వేడుకలు జరిపారు. ఈసందర్భంగా టీడీపీ సర్పంచ్ కె.శ్రీదేవి రామయ్య ఇంటిపై కొందరు ఆకతాయి వైసీపీ శ్రేణులు మద్యం ఖాళీ బాటిళ్లు, తాగిన పడేసిన గ్లాసులు విసిరివెళ్లారు. గతంలో పలుమార్లు ఇలాగు జరగటం, టీడీపీ శ్రేణులను కవ్వించే రీతిగా వైసీపీ కార్యకర్తలు వ్యవహరిస్తుండటంతో సర్పంచ్ పోలీస్ స్టేషన్‌లో లిఖిత ఫిర్యాదు చేశారు.

ఈనేపథ్యంలో ఎస్ఐ మల్లికార్జునరావు బుధవారం సాయంత్రం ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి గ్రామంలో జరుగుతున్న ఘటనలపై విచారించారు. గ్రామంలో జరిగిన పరిణామాలపై సర్పంచ్ భర్త రామయ్య ఎస్ఐకి వివరిస్తున్న సమయంలో వైసీపీ నాయకుడు కె.విష్ణు దుర్భాషలాడుతుండగా ఎస్ఐ వారించి బయటకు పంపించాడు. ఆతర్వాత ఎస్‌తో మాట్లాడి స్టేషన్ ఆవరణలో వచ్చిన టీడీపీ నాయకులు వేణు, రామయ్యతో వైసీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఇద్దరు వైసీపీ నాయకులను ఎస్ఐ మందలించాడు. ఇరువురిని రాత్రి 10.30 గంటల వరకు స్టేషన్‌లో ఉంచి పంపించాడు. అయితే, తమకు తీవ్రగాయాలయ్యాయని వైసీపీ నేత విష్ణు రాత్రికి రాత్రే ఒంగోలు రిమ్స్‌కు చేరుకున్నాడు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కార్యకర్తలను పరామర్శించి జరిగిన ఘటనపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. మహిళా సర్పంచ్ శ్రీదేవి ఫిర్యాదు మేరకు విష్ణు, మరో నలుగురిపై ఎస్ఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కొర్రపాటిపాలెంలో నిర్మించిన మంచినీటి ట్యాంక్

విద్యామిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేయనున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర సామగ్రిని నిల్వ చేసేందుకు సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్‌ను డిప్యూటీ ఈవో చంద్రమౌలీశ్వర్ గురువారం సందర్శించారు. గత ప్రభుత్వం అప్పటి సీఎం జగన్ ఫొటోలతో విద్యార్థులకు పాఠశాల సామగ్రిని అందజేసింది. ప్రభుత్వ విద్యాలయాల్లో రాజకీయాలు చొప్పించకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం నూతన ప్రణాళికతో విద్యా సామగ్రిని తయారుచేసి రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. అందులోభాగంగా సీఎస్‌పురం స్టాక్ పాయింట్‌ను గుర్తించారు. కార్యక్రమంలో సీఎంవో సోనిరూత్, ఎంఈవో జె.ప్రసాదరావు, ఎంఐఎస్ దీప్తి, సీఆర్ఎంటీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత

పీసీపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థిని చదువుకునేందుకు దాతలు ఆర్థికసాయం చేశారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన జి.లావణ్య గత సంవత్సరం 570మార్కులతో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించింది. గత వేసవిలో ఆమె నివాసం ఉంటున్న ఇల్లు అగ్నిప్రమాదానికి గురైంది. ఈప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. దీంతో .అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ రైల్వేగార్డ్ చంద్రయ్య తన స్నేహితుల ద్వారా లావణ్య కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం చేశారు.

కనిగిరిలోని ఎంఎస్ఎం కళాశాల యాజమాన్యం ఎటువంటి ఫీజు తీసుకోకుండా ఇంటర్‌లో అడ్మిషన్ ఇచ్చి ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారు. ఈక్రమంలో మెస్ చార్జీలు చెల్లించేందుకు లావణ్య ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించిన వజ్జా చంద్రయ్య తన స్నేహితులైన ప్రసాద్‌బాబు, శశికాంత్, శ్రీధర్‌ల దృష్టికి తీసుకెళ్లి కొంత నగదును సేకరించారు. విద్యార్థిని మెస్ ఫీజు కోసం సేకరించిన రూ.18వేల నగదును గురువారం లావణ్యకు అందజేశారు. కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, నేరేడుపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్కేపీఎం గౌస్, అమరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుడిపాడులో గ్రామోత్సవం

దొనకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగుడిపాడు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకస్వామి నంద్యాల నరసింహచా ర్యులు పర్యవేక్షణలో వాసుదేవ పుణ్యావాహచనం, పంచామృత అభిషేకం, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణాన్ని జరిపించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి దేవాలయానికి విచ్చేసిన భక్తులకు, ప్రజలకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త శ్రీ గోపాలుని రాధాకృష్ణమూర్తి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా అన్నీ ఏర్పాట్లుచేశారు. దాతలు పరుచూరి రామలింగయ్య, పరుచూరి సత్యనారాయణ, పరుచూరి బ్రదర్స్ నూతనంగా చేయించిన గరుడ వాహనంపై స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలంలోని శీలంవారిపల్లిలో పాఠశాలప్లస్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగినేని తిరుపతయ్య తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సౌకర్యాల గురించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

అంగన్‌వాడీలు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

కనిగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అంగన్‌వాడీ పోస్టులకు ఎంపికైన మహిళలకు గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ భవిష్యత్తు తరాల పిల్లలు ఆరోగ్యంగా ఎదగటంలో అంగన్‌వాడీ కేంద్రాలు ఇచ్చే పౌష్టికాహారం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. బాధ్యతగా మెలుగుతూ విధి నిర్వహణలో మరింత వన్నె తేవాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని, సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ఘనంగా విజయాంజనేయస్వామి తిరునాళ్ల

దొనకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక అడ్డరోడ్డులోని శ్రీవిజయాంజనేయ స్వామి దేవాలయంలో ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి నేతృత్వంలో విజయాంజనేయస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి వార్ల 18వ వార్షికోత్సవ తిరునాళ్ల వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు దేవాలయం సన్నిధిలో పొంగళ్లు వండి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. దేవాలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా ధర్మకర్త బాలిరెడ్డి అన్నీఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఎస్ఐ కమలాకర్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు

ముండ్లమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కె.కమలాకర్‌ను గురువారం టీడీపీ నాయకులు సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వేముల పద్మ జానకిరామ్, శంకరాపురం సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, మాజీ జడ్పీటీసీలు కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి, తాతపూడి తెల్లయ్య, సుంకర రాఘవరెడ్డి, డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, తదితరులు సన్మానించారు.



టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వాలి

- సీపీఐ నేత యాసిన్ డిమాండ్

కనిగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు కేటాయించిన టిడ్కో గృహాలను వెంటనే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు యాసిన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరుతూ జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులతో ఈఎంఐలు కట్టించుకుని ఇళ్ళు కేటాయించకుండా మోసం చేసిందని ఆరోపించారు. 2024 ఎన్నికలకు ముందు ప్రచారంలో చంద్రబాబునాయుడు తమ హయాంలో నిర్మించి కేటాయించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రమేష్‌బాబు మాట్లాడుతూ అక్రమంగా వెలుస్తున్న వెంచర్లకు అనుమతులు నిరాకరించాలని డిమాండ్ చేశారు. ఈదరవాగు నిర్వాసితులకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీలను పునరుద్ధరించి భూమి లేని పేదలకు మూడు ఎకరాలు చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ళు, భూమి కేటాయించే వరకూ పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మౌలాలి, జీపీ రామారావు, పి.మోహన్, గుజ్జుల బాలిరెడ్డి, పెదమస్తాన్, కోటేశ్వరరావు, కాశిం పీరా, షేక్ యాసిన్, సుబ్బారావు, అంజమ్మ, తిరుపాలు, రమణయ్య, షరీఫ్, అంకమ్మ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు యాసిన్

వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి

పామూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో సక్రమంగా వైద్య సేవలు అందేలా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. పామూరు ప్రభుత్వ సామాజిక వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన ఎస్.సాంబయ్య, షేక్ ముబినా మౌలాలిలను గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా పువ్వాడి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మీపై ఎంతో నమ్మకంతో డైరెక్టర్లుగా నియమించారన్నారు వైద్యశాలను తనిఖీచేస్తూ తగు సూచనలు చేస్తుండాలన్నారు. కార్యక్రమంలో ఏ.ప్రభాకర్ చౌదరి, ఎస్డీ అమీర్‌బాబు, జి.శ్రీను, మన్నం రమణయ్య, మార్నేని రామకృష్ణ, షేక్ హజగౌస్, మన్నేపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో మోస్తరు వర్షం

పీసీపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో గత కొద్దిరోజులుగా ఎండతీవ్రత, వడగాల్పులు, ఉక్కపోతకు గురైన ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. పగలంతా ఎండ మండిపోగా సాయంత్రం వర్షంతో పాటు తీవ్రమైన గాలి వీచింది. అకాల వర్షానికి మర్రికుంటపల్లి, పీసీపల్లి, వరిమడుగు విద్యుత్ ఫీడర్లు బ్రేక్‌డౌన్ అయ్యాయి. ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు సాయంత్రం కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మురుగుమ్మి, జంగాలపల్లి, నేరేడుపల్లి గ్రామాల పరిధిలో పదును వర్షం కురిసింది. తలకొండపాడు గ్రామంలో వర్షం పడుతున్న సమయంలో వడగండ్లు పడ్డాయి. ఒక్కసారిగా వర్షం కురవడంతో కల్లాలో ఉన్న మిర్చి తడవకుండా పట్టాలు కప్పేందుకు రైతులు పరుగులు తీశారు.

కారు డ్రైవర్ దారుణ హత్య

సినీఫక్కీలో మృతదేహం పూడ్చాలని ప్రయత్నం ● మృతుడు పామూరువాసిగా గుర్తింపు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్‌ను దారుణంగా హత్య చేశారు. సినిమా ఫక్కీలో మృతదేహాన్ని చెరువులో పూడ్చిపెట్టి మాయం చేయాలని ప్రయత్నించినా కుదరకపోవడంతో చెత్తకుప్పలో పడేసి పరారయ్యారు. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగలదిన్నెకు చెందిన మాధవ్, జ్యోతి దంపతులు. సుమారు 11 ఏళ్ల కిందట ఉపాధి నిమిత్తం నెల్లూరు నగరానికి వలస వచ్చారు. వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ప్రగతినగర్ ఏబ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. వారికి వాసు(23), వాసవిలు సంతానం. వాసు కారుడ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో పలువురితో గొడవలు ఏర్పడ్డాయి. ఈనేపథ్యంలో ఈనెల 9న వాసు పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 7 గంటలకు తండ్రికి ఫోన్ చేసి ఇంటికి ఆలస్యంగా వస్తానని చెప్పాడు. అదే రోజు రాత్రి పొదలకూరు రోడ్డు సారాయంగడి సెంటర్‌లో పాత గొడవల నేపథ్యంలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేశాడు.

దాడికి గురైన యువకుడు గతంలో వాసు వల్ల ఇబ్బందులకు గురైన వినయ్, మణికంఠ, లోకేష్ అలియాస్ ఛత్రపతి, తేజ, సంతోష్‌లతోపాటు ఓ రౌడీషీటర్‌కి, మరికొంత మందికి తెలియజేశాడు. అందరూ కలిసి వాసు కోసం గాలించి ఆర్టీసీ బస్టాండు వద్ద పట్టుకొని ప్రగతినగర్ ఏ బ్లాక్ 10వ వీధిలోని దర్గా సమీపానికి తీసుకువచ్చారు. దర్గా ఎదురుగా ఉన్న రోడ్డుపై అతనిని తీవ్రంగా కొట్టి తమ వద్ద ఉన్న కత్తులతో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశారు. మృతదేహాన్ని బైక్‌పై పెట్టుకుని వెంగళరావునగర్ సమీపంలోని చెరువులో పూడ్చిపెట్టేందుకు యత్నించారు. ఆ సమయంలో అక్కడ జనసంచారం ఉండటంతో ప్రగతినగర్ 10వ వీధి చెరువు సమీపంలోని చెత్తకుప్పల్లో పడేశారు. మృతదేహం ఎవరికీ కన్పించకుండా ఉండేందుకు పెద్ద చెత్తమూటను పైన వేసి పరారయ్యారు. గురువారం ఉదయం స్థానికులు చెత్త కుప్పలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు.

ఈక్రమంలో మృతుడి స్నేహితులు లోకేష్, బదుల్లాలు ఈ విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు తెలియజేశారు. నగర డీఎస్పీ పి.సింధుప్రియ, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు తండ్రి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి వారిలో కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

పామూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఖాళీగాఉన్న అంగన్‌వాడీ పోస్టుల్లో అర్హులైన కార్యకర్తలు, ఆయాలను నియమించినట్లు పామూరు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గొళ్ల పద్మజ, సీఎస్‌పురం సూపర్‌వైజర్ దేవా కృపావరం తెలిపారు. పామూరు మండలంలోని నుచ్చుపొద గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తగా పిడుగు రాఘచంద్రికను నియమించారు. సీఎస్‌పురం మండలంలోని మునగలవారిపల్లిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా షేక్ హసీనా, ఆరికేపల్లి అంగన్‌వాడీ సహాయకురాలిగా బెజవాడ ప్రభావతిని నియమించినట్లు తెలిపారు. కనిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపికైన కార్యకర్తలు ఉగ్రనరసింహారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఉగ్ర సూచించారు.



పౌష్టికాహారంతో ఎంతో ప్రయోజనం

కనిగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వెయ్యి రోజులు పౌష్టికాహారంతో చిన్నారులు, బాలింతలకు ఎంతో ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ అన్నారు. మండలంలోని జమ్మలమడక గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఆహార పదార్థాల తయారీపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ తమ బిడ్డకు ఆధార్‌కార్డు తీయించుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసే పోషకాహారంపై అవగాహనకల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్‌రెడ్డి, ఆశా వర్కర్ సుశీల, కార్యకర్తలు పి.భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, మల్లేశ్వరి, వెంకటలక్ష్మి, కోటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

తాళ్లూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల బారినపడి నష్టపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసిందని టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి అన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ నాఫెడ్ ద్వారా సొసైటీల ఆధ్వర్యంలో మన్నేపల్లి, బొద్దికూరపాడు గ్రామాల్లో కందుల కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ కంది రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతులు కందుల కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరకు అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో మన్నేపల్లి సమర, వి.సుబయ్యా, శాగం కొండారెడ్డి, రమేష్‌బాబు, పెదకాలేషావలి, ఎం.వెంకటేశ్వరరెడ్డి, పి.రమణారెడ్డి, సుబ్బారెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, రాచకొండ వెంకట్రావు, సొసైటీల సీఈవోలు అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

పొన్నెకల్లుకు 14న సీఎం చంద్రబాబు

- అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు
- అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు

తాడికొండ(పొన్నెకల్లు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ జయంతి వేడుకలకు తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామం వేదికగా ఎంపిక చేశారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవతేజ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పొన్నెకల్లులో రాష్ట్ర స్థాయిలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని అధికారులం దరు సమన్వయంతో విజయంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీపీవో శేషశ్రీ, డీఆర్‌డీఏ డ్వామా పీడీ విజయలక్ష్మి, శంకర్, డీపీవో నాగసాయి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ,తాహసీల్దార్లు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేషన్ మాఫియా.. బరితెగింపు

- సివిల్ సప్లయిస్ గోతాల్లోనే తరలింపు
- కీలక నేతలకు భారీగా ముడుపులు
- అధికారం అండతో రెచ్చిపోతున్న మాఫియా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుట్టుమట్టూ లేదు.. భయం అంతకన్నా లేదు.. అడిగే వారు లేరు.. అడ్డుతగిలే వారూ లేరు.. కీలక నేతలకు భారీ ముడుపులు ముట్టచెబుతున్నాం.. ప్రత్యేకంగా గోతాలు ఖర్చు ఎందుకు దండగా... ఇదీ చీరాల నియోజకవర్గంలో రేషన్ మాఫియా తీరు. చీరాలలో రేషన్ మాఫియా బరితెగించింది. చీరాల నుంచి పర్చూరు వైపు అక్రమంగా తరలిస్తున్న 200 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ బియ్యం మొత్తం సివిల్ సప్లయిస్ గోతాల్లోనే ఉండడం విస్తుగొలిపే అంశం. లబ్ధిదారులకు ఎంతోకొంత ముట్ట చెప్పి రేషన్ బియ్యాన్ని సేకరించేవారు. లేదంటే డీలర్ నుంచి సేకరించేవారు. కాకపోతే వాటిని ప్రభుత్వ గోతాల నుంచి వేరే సంచుల్లోకి మార్చే జాగ్రత్తలను గతంలో మాఫియా తీసుకునేది. ఇన్ని సార్లు గోతాలు మార్చడం ఎందుకు అనుకున్నారో ఏమో కానీ నేరుగా పౌరసరఫరాల శాఖ గోతాముల్లోనే బియ్యాన్ని అక్రమంగా తరలించే సాహసానికి అక్రమార్కులు పూనుకున్నారు. ఇలా దొరకడాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాల్సిన వ్యవస్థలు పట్టుకున్నాం కేసు పెట్టాం అనే రీతిన మమ అనిపించడం విస్మయ పరుస్తోంది. ఆ బస్తాలు ఏ డీలర్ పాయింట్ నుంచి రవాణా అవుతున్నాయో తెలుసుకుని తీగలాగుదామన్న నిబద్ధత వ్యవస్థలకు లేదు.

నెల వారీ పాట పాడుకుని..

చీరాల నియోజకవర్గంలో నిన్నమొన్నటి వరకు ఓ వ్యక్తి చేతిలో రేషన్ మాఫియా నడిచేది. సదరు నేతకు అక్కడ నుంచి వస్తున్న వాటా సరిపోకపోవడంతో ఒంగోలు కేంద్రంగా దందా నిర్వహించే ఓ వ్యక్తికి చీరాల రేషన్ దందా బాధ్యతలు అప్పజెప్పారు. గతంలో ఇస్తున్న ముడుపులు కంటే భారీగా నెలానెలా అందించేలా ఒప్పందం కుదిరింది. నియోజకవర్గం మొత్తం గంపగుత్తగా రేషన్ బియ్యం దందా నడుపుకోవడానికి ఏకంగా అనధికారిక పాట పెట్టి మరీ ఓ రేటు ఫిక్స్ చేశారు. ఏకంగా నెలకు రూ.25 లక్షలు రేషన్ మాఫియా నుంచి కీలక నేతకు అందుతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి ముగ్గురిపై పీడీ యాక్టు నమోదుకు అప్పటి జేసీ శ్రీనివాసులు రిఫర్ చేసిన సంగతి తెలిసిందే. ఆ ముగ్గురిలో ఇద్దరు చీరాలకు చెందిన వారే కావడం గమనార్హం. రాజకీయ పరమైన ఒత్తిళ్లతో ఆ దస్త్రాన్ని అప్పటి వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిన సంగతి తెలిసిందే.







కుంభకోణంపై.. కనికరమా?

చెయ్యి మార్చగా రూ.6.8 కోట్లు మిగులు

గోలీల డొంక రోడ్డులో కొత్తపాలెం సమీపంలో కొన్న భూముల్లో మాత్రం వైసీపీ ముఖ్య నేతకు దగ్గరి అనుచరుడు, అర్థిక లావాదేవీలన్నీ దగ్గరుండి చూసుకున్న వ్యక్తి భూములు చేతులు మార్చి రోజుల వ్యధిలోనే రూ.6.8 కోట్లు వెనకేశారనేది ఆరోపణ. ఈయన తన బంధువుల పేరుపై 13 ఎకరాలను రూ.40 లక్షలు చొప్పున కొనుగోలు చేశాడు. ఆ తర్వాత వారానికే ఆ భూములను ప్రభుత్వానికి అమ్మేసి రూ.6.8 కోట్లు జేబులో వేసుకున్నాడని సమాచారం.

- విజిలెన్స్ విచారణపై అనుమానాలు
- జగనన్న కాలనీల పేరిట భూ కొనుగోల్‌మాల్
- తెనాలిలోనే రూ.100 కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలు
- నాడు వైసీపీ నేతలకు మేలు చేసిన కొందరు అధికారులు
- వారిని కాపాడేందుకే విచారణలో తాత్సారమన్న ఆరోపణలు

నాడు పేదలకు సొంతిల్లని జగనన్న కాలనీల పేరిట భూ కుంభకోణానికి పాల్పడిన వైసీపీ పెద్దల గుట్టురట్టు చేయాల్సిన అధికారులు కనికరం చూపుతున్నారు. ఒక్క తెనాలిలోనే రూ.100 కోట్లు కొట్టేసిన భూ కుంభ కోణం అంతుతేల్చేందుకు కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశిం చింది. అయితే ఈ విచారణ జరుగుతున్న తీరు చూస్తే నాడు భూమాయలో భాగ స్వాములను కాపాడేటట్లుగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్విడ్‌ప్రోకో పద్ధతిలో అప్పటి ప్రభుత్వంలోని పెద్దలు భారీగానే ప్రజా ధనాన్ని దోచేశారని నాడు విమర్శలు వెల్లువెత్తాయి. అయితే నాటి ప్రభుత్వంలో అటు పాలకులు, ఇటు అధికా రులు దీని గురించి పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా దోపిడీ జరిగినా, భారీ మొత్తం చేతులు మారింది మాత్రం తెనాలిలోనే అని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. తెనాలిలో జరిగిన ఈ భూమాయ గుట్టును విజిలెన్స్ అధికారులు బహిర్గతం చేస్తే రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాల్లో జరిగిన కుంభకోణాల్ని బట్టబయలు చేసేందుకు ఒక ఉదాహరణగా మారనుంది. అయితే ఇంతటి ప్రాధాన్యం ఉన్న కుంభకోణంపై విచారణ నెల నుంచి కొనసా...గుతూనే ఉంది. అధికారులు సంబంధిత రైతులను అడుగుతున్న ప్రశ్నలు, వారు చెబుతున్న సమాధానాలు చూస్తుం టే అసలు ఈ కుంభకోణం గుట్టు వీడుతుందా? దీని వెనకున్న పెద్దలకు శిక్షలు వేసి.. దోచుకున్న ప్రజాధనాన్ని కక్కిస్తారా అంటే అనుమానమే అని అర్థమవుతోంది.

ఎకరాకు.. రూ.52.51 లక్షలు స్వాహా

జగనన్న లేఅవుట్లు ఎక్కడనేది తెలుసుకున్న వైసీపీ నాయకులు కొందరు ముందుగానే రైతుల నుంచి ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించి పొలాలు కొనుగోలు చేశారు. బినామీ పేర్లతో వాటిని ప్రభుత్వానికి రూ.92.51 లక్షలు అమ్మారు. వారం రోజుల్లోనే వీరికి ఎకరాకు రూ.52.51 లక్షలు అప్పనంగా వచ్చి చేరింది. భూమిని నమ్ముకుని ఉన్న రైతుకు రూ.40 లక్షలే అందితే, వారంలో చేతులు మార్చిన వైసీపీ దళారులకు ఎకరాకు రూ.52 లక్షలు దక్కింది.

తెనాలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేస్తామంటూ కోట్లకు కోట్లు వైసీపీ పెద్దలు దోచేశారు. కాలనీలు కాదు.. ఊళ్ళు నిర్మిస్తున్నామని జేబులు నింపుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంతగొప్ప కార్యక్రమం చేసిన ప్రభుత్వమే లేదని భూమాయ చేశారు. ఇది ఒక్క గుంటూరు జిల్లానే కాదు. రాష్ట్రం మొత్తం మీద (మిగతా 8వ పేజీలో)



నేలపాడులో ఆగిపోయిన పేదల ఇళ్లు

ముఖ్య నేత పేరుతో వసూళ్లు..

బుర్రిపాలెం, నేలపాడు, అంగలకుదురు, గుడివాడ, కొలకలూరులలో కొన్న భూములకు ఎకరాకు రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు వాటాల కింద వసూలు చేశారు. అదేమంటే ఈ డబ్బు ముఖ్య నేతకు ఇవ్వాలంటూ నిలబెట్టి వసూలు చేశారని రైతులు చెప్తున్నారు. ఒక ప్రవచన కర్త ఇంటిపేరుతో ఉన్న రైతు 6.5 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చినందుకు అందిన మొత్తంలో నేతలకు వాటా రూపంలో ఇచ్చిన మొత్తమే రూ.1.8 కోట్లు అంటే, ఎంతటి స్థాయిలో డబ్బు చేతులు మారిందనేది అర్థమవుతుంది. ఓ లేఅవుట్‌లో 12 మంది 36 ఎకరాల భూమిని ఇచ్చినందుకు నేతలకు ఇచ్చిన వాటా రూ.8 కోట్లని సమాచారం. ఇలా మొత్తం 526 ఎకరాల్లో అందిన మొత్తం లెక్కిస్తే కళ్లు తిరగాల్సిందే.



జిన్నింగ్.. దివాలా

నష్టాల ఊబిలో పరిశ్రమ

- 400 మిల్లుల్లో పనిచేస్తున్నవి 120 మాత్రమే
- రూ.30 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఎదురుచూపు
- పన్నుల భారం తగ్గించాలని యజమానుల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కళకళాడిన జిన్నింగ్ పరిశ్రమ దివా లా దిశగా సాగుతోంది. ఉత్పత్తి వ్యయం పెరిగిపోవడం.. పత్తి విస్తీర్ణం పూర్తిగా పడిపోవడం.. పన్నులు మోత.. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహ కాలు లేకపోవడం.. తదితరాల నేపథ్యంలో పరి శ్రమను నష్టాల ఊబిలో పడేస్తోంది. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 400 వరకు ఉన్న జిన్నింగ్ మిల్లులు ప్రస్తుతం కేవలం 120 మా త్రమే ఉనికిలో ఉన్నాయి. గుంటూరు రీజియన్‌లో 60 మిల్లులు, రాయలసీమ రీజియన్‌లో 60 మిల్లులు ఉండగా ప్రభుత్వం నుంచి సుమారు రూ.30 కోట్ల వరకు ప్రోత్సాహకాలు రావాల్సి ఉంది. గడిచిన ఐదేళ్ల కాలంలో వాటి విడుదల కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని యజమానులను అసంతృప్తి చెందుతున్నారు. 2014 తర్వాత విభజిత రాష్ట్రంలో పత్తి విస్తీర్ణం పూర్తిగా పడిపోవడం పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 10 లక్షల బేళ్లకు సరిపడా మాత్రమే పత్తి దిగుబడి వస్తుండగా, ఉనికిలో ఉన్న జిన్నింగ్ మిల్లులు 30 లక్షల బేళ్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే మిల్లులు ఆడే పరిస్థితి నెలకొంది. మిగిలిన సంవత్సరమంతా మూతపడి ఉంటున్నా విద్యుత్ చార్జీలు, ఇతర పన్నుల భారం మాత్రం తప్పడం లేదు. మిగిలిన రాష్ట్రాల్లో పత్తి ఆధారిత పరిశ్రమలకు విద్యుత్ రాయితీలు పుష్కలంగా ఇస్తున్నా ఇక్కడ ఆ విధానం లేదు. హై టెన్షన్‌లో జిన్నింగ్ పరిశ్రమలను చూపడంతో కనీస డిమాండ్ చార్జీలు ఎక్కువగా పడుతున్నట్లు యజమాను లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ము గిసిన తర్వాత కొందరు జిన్నర్స్ ఇతర రాష్ట్రాల నుంచి పత్తిని కొనుగోలు చేయడం వల్ల రెండు రాష్ట్రాల్లో మార్కెటింగ్ సెస్సు చెల్లించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఏపీ టీఎంసీ కన్సార్టియం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివ ప్రసాద్, సీనియర్ నాయకుడు మన్నవ హరి గుంటూరులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయించాలని, బ్యాంకు వడ్డీ రేట్లలో కొంత వరకు తగ్గించాలని, జీఎస్టీ రాయితీ కల్పించాలని, మార్కె టింగ్ సెస్సు పూర్తిగా తగ్గించాలని, పత్తి విస్తీర్ణం పెంచేందుకు తెగుళ్లను తట్టుకునే మంచి వంగడాలను రైతులకు సరఫరా చేయాలని, రాష్ట్రంలో సీసీఐ పత్తి కొనుగోళ్లు పెంచాలని కోరారు.

మంగళగిరిలో.. అత్యాధునికంగా ఆస్పత్రి

- దేశానికి రోల్‌మోడల్‌గా వంద పడకలతో నిర్మాణం
- 13న శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య సదుపాయాలతో.. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా.. దేశానికే రోల్ మోడల్‌గా మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రి నిర్మించనున్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజల మూడు దశాబ్దాల కలకి ఈ నెల 13న మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. వంద పడకల ఆస్పత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. గతేడాది అక్టోబరు 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రి లోకేశ్ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. దీంతో 1986లో ఏర్పాటు చేసిన ఆస్పత్రి భవనం శిథిలం కావడంతో వైద్యశాలను చినకాకాని వద్దకు మార్చి, కేన్సర్ ఆస్పత్రి స్థలాన్ని వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించారు. 7.35 ఎకరాల్లో లక్షా 15 వేల చదరపు అడుగుల్లో సువిశాలంగా ఆస్పత్రి భవనాన్ని రూ.52.20 కోట్లతో నిర్మించనున్నారు. ఆస్పత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాలు, మూడు ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటరు, తలసేమియా వార్డు, డీ అడిక్షన్ ఓపీ సెంటరు అందుబాటులోకి తేనున్నారు.




వంద పడకల ఆస్పత్రి తాలూకూ నమూనా చిత్రం

పాలిసెట్.. పాట్లు

- ఫీజు చెల్లింపులో సాంకేతిక సమస్యలు
- ఉండీ ఉపయోగం లేని హెల్ప్‌లైన్ సెంటర్
- విద్యార్థుల ఇబ్బందులపై స్పందించని సిబ్బంది


గుంటూరు(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ గడువు సమీపిస్తోంది. పరీక్షకు ఫీజు చెల్లించేందుకు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా ఫీజు చెల్లింపులో అవాంతరాలు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మంగళగిరిలోని సాంకేతిక శాఖ ప్రధాన కార్యాలయంలో సిబ్బంది విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంలేదు. ఇక హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినా దానివల్ల ఫలితం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా పాలిసెట్‌కు దాదాపు 20 వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతుంటారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడు పాలిసెట్‌కు ఈ నెల 15వ తేదీ చివరి తేదీగా గడువు ఇచ్చింది. గత నెల చివర్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు భారీ సంఖ్యలో పాలిసెట్ రాసేందుకు సన్నద్ధమయ్యారు. పదో తరగతి హాల్‌టికెట్ నంబర్ ద్వారా పాలిసెట్‌కు దరఖాస్తుకు సాంకేతికశాఖ అవకాశం ఇచ్చింది. అయితే హాల్‌టికెట్లోని వివరాలతో పాటు అదనపు సమాచారం నింపి పరీక్ష ఫీజు చెల్లింపు కోసం విద్యార్థులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. అనేకమంది విద్యార్థులు డెబిట్ కార్డును ఉపయోగించి ఫీజు చెల్లిస్తున్నారు. అయితే ఫీజు చెల్లింపు స్టేటస్‌లో ఫీజు చెల్లించలేదని లేదని ఆన్‌లైన్ ప్రత్యక్షమవుతుంది. మొత్తం ప్రక్రియ పూర్తి చేసి నగదు కట్ అయినా ఫీజులు జమ కాలేదంటూ సాంకేతిక విద్యా శాఖ నుంచి ఫోన్లకు వస్తున్న సమాచారంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



ఓ విద్యార్థి రెండుసార్లుగా చెల్లించిన పరీక్ష ఫీజు బ్యాంకు రశీదులు

స్పందించని హెల్ప్‌లైన్ సెంటర్లు

పాలిసెట్ విద్యార్థుల సమస్యలకు పరిష్కారం కోసం మంగళగిరిలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఇందులో డేటా ఎనాలసిస్ట్, సాంకేతిక విద్యాశాఖ సెక్రటరి కార్యాలయ సిబ్బంది, మరో రెండు హెల్ప్‌లైన్ సెంటర్ నెంబర్లు పొందుపరిచారు. అయితే ఈ నెంబర్లకు ఫోన్ చేసినా అక్కడి నుంచి స్పందన రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలను కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలన్నా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్‌లైన్ నెంబర్ కూడా పనిచేయడం లేదని ఫలితంగా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదంటున్నారు. చివరకు మెయిల్ చేస్తే మీ డబ్బు 15 రోజుల్లో తిరిగి మీ ఖాతాకే వస్తుందన్న సమాచారం పంపి చేతులు దులుపుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.



మంగళగిరిలోని హెల్ప్‌లైన్ సెంటర్ ఫోన్ నెంబర్లు



నక్కబొక్కలపాడులో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

ముందస్తుగా గంగమ్మ తిరునాళ్ల

● నక్కబొక్కలపాడులో టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వీర్ల గంగమ్మ తిరునాళ్ల శనివారం జరగనుంది. తిరునాళ్ల ముందస్తు ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాట కచేరిని ఏర్పాటు చేయడంతో పలు గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి వీక్షించారు. టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో తిరునాళ్ల రోజు ఇదే గ్రామం నుంచి రెండు విద్యుత్ ప్రభలను తిరునాళ్లలో ఏర్పాటు చేయనున్నారు.

రోడ్డుపై పొంచిఉన్న ప్రమాదం

● కూలే స్థితిలో ఎండిపోయిన వృక్షం

మేదరమెట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల నుంచి అద్దంకి వెళ్లే రోడ్డులో ఓ వేప చెట్టు ఎండిపోయింది. రోడ్డు పక్కనే ఉండడం వల్ల ఎండిన చెట్టు ఎప్పుడు మీద పడుతుందోనని పాదచారులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. మేదరమెట్ల సెంటరు నుంచి నార్కెట్‌పల్లి రహదారి కలిసే ఫ్లైఓవర్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు. నాలుగు వరుసల సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వందేళ్ల నాటి వేపచెట్లను తొలగించారు. అప్పుడు మిగిలిపోయిన ఈ వేపచెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డంగా ఉందని, రహదారిపైకి వస్తున్నాయని తరచూ కొట్టివేస్తున్నారు. దీంతో వేపచెట్టు ఎండుముఖం పట్టింది. రోడ్డుపైకి వంగి ఉండడంతో ఎప్పుడైనా మీద పడుతుందోనని ఈ రహదారిన వెళ్లే పాదచారులు, వాహనాలపై వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి ఎండిన చెట్టును తొలగించాల్సిందిగా గ్రామస్థులు కోరుతున్నారు.



మేదరమెట్లలో కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్టు



దివ్యాంగులకు శ్రీనిధి రుణం అందజేస్తున్న ఏపీఎం, సీసీలు

దివ్యాంగులకు వడ్డీ లేని రుణం అందించాలి

చినగంజాం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు వడ్డీ లేని రుణాలు అందజేయాలని మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు మార్పు విశ్రాంతమ్మ అన్నారు. స్త్రీ శక్తి భవన్‌లో మండల దివ్యాంగుల సమాఖ్య సమావేశం గురువారం జరిగింది. విశ్రాంతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీఎం గద్దె పెదసుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సమావేశంలో దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చే విధంగా మండల సమాఖ్య పనిచేస్తుందని తెలిపారు. రాజుబంగారుపాలెం గ్రామానికి చెందిన సాయి దివ్యాంగుల గ్రూపునకు రూ.లక్ష శ్రీనిధి రుణం, ఎస్‌కే బాషాకు వాకర్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు కె.వెంకటస్వామి, లక్ష్మి, మాధవి, అకౌంటెంట్ పద్మావతి, పి.పార్థసారధి, వి.వేణు, హనుమంతరావు, అంకిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, డీఎస్పీ మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్, గ్రామస్థులు

గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండాలి

● గవినివారిపాలెంలో ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసుపై పీస్ కమిటీ సభ్యులు

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గవినివారిపాలెం గ్రామం ప్రశాంత వాతావరణం ఉండేలా గ్రామస్థులు ప్రవర్తించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. గురువారం రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో గ్రామస్థులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో స్థల వివాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై పలువురు హత్యాయత్నానికి పాల్పడిన విషయంపై చర్చించారు. గ్రామాల్లో సమస్యలు నెలకొన్నప్పుడు పెద్దలు లేదా పోలీసులను ఆశ్రయించి పరిష్కారం పొందాలని సూచించారు. క్షణికావేశంలో దాడులకు పాల్పడి జైలుపాలు కావద్దని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కుమారుడి కోసం పూజలు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కొత్తపేట శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గూడూరు శివరామ ప్రసాద్, కిరణ్, కిషోర్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మీ, భాగ్యలక్ష్మి, శిరీష, అరుణ, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆక్రమణలో జగనన్న కాలనీ స్థలాలు

గతంలో పనికిరాని చోట కేటాయింపు

ఇంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో కన్నేసిన ఆక్రమణదారులు

మరోచోట ఇవ్వాలంటూ ముక్తేశ్వరం పేదల విజ్ఞప్తి



ముక్తేశ్వరంలో నిరుపేదలకు ఇచ్చిన నివేశన స్థలాలను ఆక్రమించి వేసిన గడ్డి వాములు

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకులు చేసిన తప్పిదాల వలన నిరుపేదలకు కేటాయించిన నివేశన స్థలాలు ఇప్పుడు ఆక్రమణదారుల చెరలోకి వెళ్లాయి. దీంతో తమకు ఇంటి స్థలం ఇచ్చి ఎలాంటి ఉపయోగం లేదని నిరుపేదలు గగ్గోలు పెడుతున్నారు. బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామంలో రెండేళ్ల కిందట జగనన్న కాలనీ పేరిట సుమారు 20 మందికి ఒక సెంటు చొప్పున ఇంటి స్థలాలను ఇచ్చారు. గ్రామానికి పడమర వైపున ఉన్న కొండ ప్రాంతంలో స్థలాలు కేటాయించారు. అక్కడ ఇంటి నిర్మాణాలకు ఉపయోగం లేదని లబ్ధిదారులు అధికారులకు తెలియజేశారు. అయినా వారు పట్టించుకోకుండా తమ పని తాము చేసి పట్టాలు చేతిలోపెట్టారు. కొందరు తమకు స్థలాలు వద్దని తీసుకోలేదు. తీసుకున్న వారు ఇంత వరకు ఒక్క ఇంటి నిర్మాణం చేపట్టలేదు. దీనిని అలుసుగా చేసుకొని గ్రామానికి చెందిన కొందరు జగనన్న కాలనీలో ఇంటి స్థలాలను ఆక్రమించుకొని వరి గడ్డి వాములను, పశువుల పాకలను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. తమకు ఇంటి స్థలాలు ఇచ్చి కూడా లాభం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలందరికీ ఇంటిని కట్టించి ఇస్తానని జగన్‌రెడ్డి మోసం చేశారని, ఇప్పుడు ఇల్లూ లేదు, ఇంటి స్థలం లేకుండా పోయిందని అంటున్నారు. ఇదిలావుండగా జగనన్న ఇంటి స్థలాల మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం తమకు అనువైన చోట ఇంటి స్థలాలు కేటాయించి నిర్మించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఆక్రమణలో ఉన్న స్థలాలను కాపాడాలని వారు కోరుతున్నారు.

అటవీ, రెవెన్యూ శాఖల ఉమ్మడి సర్వే

● హద్దురాళ్ల గుర్తింపు కోసం వెతుకులాట

కురిచేడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామం సర్వే నంబర్లు 88, 90లలో 799.40 ఎకరాల భూమిని రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్‌కు కేటాయించారు. ఈక్రమంలో భారీ యంత్రాలతో చిల్లచెట్లు తొలగించే పనులు చేపట్టారు. అయితే, అటవీ శాఖ అధికారులు సదరు భూమి తమదంటూ అడ్డం తిరిగారు. గత మూడు రోజులుగా ఈ విషయమై అటవీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు తర్జన భర్జనలు పడ్డారు. ఎవరి రికార్డులు వారు తెచ్చి మాదంటే మాదని వాదులాడుకున్నారు. చివరికి ఉన్నతాధికారులు ప్రవేశించి రెండు శాఖలు ఉమ్మడి సర్వే చేయాలని సూచించారు. గురువారం రెండు శాఖలకు చెందిన సర్వేయర్లు ఉమ్మడి సర్వే చేపట్టారు.

కురిచేడు మండలంలో రైతులకు, నిరుద్యోగులకు ఉపాధి చూపేందుకు కూటమి ప్రభుత్వం రూ.130 కోట్లతో గంగదొనకొండలో ప్రాజెక్టుకు ఏర్పాట్లుచేసింది. దీని వలన ప్రత్యక్షంగా రైతులు, నిరుద్యోగులకు పరోక్షంగా పరిసర గ్రామాల వారికి ఉపయోగం ఉంటుంది. ఇటువంటి పెద్ద ప్రాజక్టు అటవీ శాఖ కొర్రీలతో నీలినీడలు కమ్ముకున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేయాలని సూచించారు. గత మూడు రోజులుగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు వారి రికార్డులు సరిచూసుకున్నారు. ఒకరి రికార్డులు మరొకరు అందించుకుని సరి చూసుకున్నారు. గురువారం ఉమ్మడి సర్వేకు పూనుకున్నారు.

అటవీ శాఖకు చెందిన జిల్లా అధికారి శ్రీనివాసరావు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డిలు తమ శాఖల అధికారులతో కలసి గంగదొనకొండ పక్కనే ఉన్న నాయుడుపాలెం రిజర్వ్ ఫారెస్ట్‌లో 3 కి.మీ నుంచి 5 కి.మీ మేర నడచి హద్దురాళ్లను గుర్తించారు. అక్కడ నుంచి సర్వే చేయాలని అనుకున్నా సాంకేతి సమస్యతో కుదరలేదు. మరలా దొనకొండ మండల చందవరం వద్ద ఉన్న అడవిలో హద్దురాయిని గుర్తించారు. అలాగే నాయుడు పాలెం రిజర్వ్ ఫారెస్ట్‌కు మూల స్తంభంలాంటి హద్దురాయిని దొనకొండ మండలం పోలేపల్లి వద్ద ఉందని అక్కడకు వెళ్ళి అక్కడ హద్దురాయిని గుర్తించారు. అక్కడ నుంచి జియోలాజికల్, ల్యాట్ ల్యాండ్ సర్వే చేశారు.

తదనంతరం దొనకొండ తహసీల్దార్ కార్యాలయానికి ఇరు శాఖల అధికారులు వెళ్లి రికార్డులు పరిశీలించి చర్చలు జరిపారు. ఉన్నతాధికారులకు సర్వే రిపోర్టులు పంపి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సీబీజీ ప్లాంటు వద్ద పనులు యథావిధిగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందిన కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, అసిస్టెంట్ డీఎఫ్‌వో పి.శ్రీనివాసరావు, ఎఫ్ఆర్‌వో నరసింహారావు, డిప్యూటీ ఆర్‌వో బి.నాయక్, ఎఫ్‌బీవో ధనలక్ష్మి, తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో హనుమంతరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.



హద్దురాయి వద్ద అటవీ, రెవెన్యూ శాఖాధికారులు



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాసేవతో ఆనందం

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం నియోజకవర్గంలో ప్రజా సేవల్లో ఉండడంతో ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. గురువారం 216 జాతీయ రహదారి మన్నం అపార్ట్‌మెంట్ సమీపంలోని అక్కయ్యపాలెం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వేసవి దాహార్తికి ఒంగోలు వైపు వెళ్లే వారికి, రామాపురం వెళ్లే పర్యాటకులకు చలివేంద్రం ఎంతగానో దోహద పడుతుందని వివరించారు. అలాగే కొత్తపేటలోని గోపాల్‌నగర్ శ్రీసీతారామ మందిరం వద్ద నిర్వహించిన సమారాధనలో పాల్గొన్నారు. ఆయా ప్రాంత ప్రతినిధులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.



మోదేపల్లిలో రక్షిత మంచినీటి పథకం పంపింగ్ స్కీంను పరిశీలిస్తున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు

మోదేపల్లికి నిరంతర విద్యుత్ సరఫరా

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరంతరాయంగా నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని మోదేపల్లిలో ఇటీవల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన సమయంలో వచ్చిన అర్జీల పరిష్కారంలో భాగంగా చేపట్టిన పనులను ఈఈ నల్లూరి మస్తాన్‌రావు గురువారం పరిశీలించారు. నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు మూడు, 53 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాత విద్యుత్ స్తంభాలను మార్చు చేయడం జరిగిందన్నారు. మోదేపల్లి వాటర్ స్కీంకు 24 గంటల విద్యుత్ సరఫరా కోసం 11 కేవీ విద్యుత్ లైన్‌ను రెండు కి. మీ. దూరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.46లక్షల వ్యయంతో విద్యుత్ శాఖకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేశామన్నారు. డీఈఈ ముప్పాళ్ల దామోదరం, రూరల్ ఏఈఈ శివ ప్రసాద్, టీడీపీ నేతలు భీమని శ్రీనివాసరావు, ప్రసాద్, నర్రా వీరయ్య పాల్గొన్నారు.

కుంభకోణంపై.. కనికరం

(5వ పేజీ తరువాయి)

ఇదే తీరు. జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ స్థలం కొనుగోలు నుంచి ఇల్లు కట్టించి ఇచ్చే వరకు అంతటా అక్రమాలే. ఇందులో లబ్ధిదారులకు ఎటువంటి మేలు జరగకపోగా అటు అధికారులు, ఇటు నేతల మధ్య భారీగానే పంపకాలు జరిగాయి. పేదలకు ఇళ్ల స్థలాల కోసమని ప్రభుత్వం భూ సేకరణకు ప్రకటన చేయగా రైతులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ క్రమంలో పెదరావూరులో టీడీపీ నాయకులతోనే సిఫార్సులు చేయించుకుని కొంత భూమిని కొని మార్కెట్ రేటుకు మించి అదనంగా రెండున్న రెట్లు డబ్బు చెల్లించారు. దీంతో మిగిలిన ప్రాంతాల్లో రైతులు ముందుకొచ్చారు. ఆ తర్వాత వైసీపీ నేతలు రంగంలోకి దిగి భూమాయ చేశారు. ఒక్క తెనాలిలోనే వైసీప దళారులు రంగప్రవేశం చేసి రైతుల వద్ద భూమిని తక్కువకు కొని రెండున్నర రెట్లకు ప్రభుత్వానికి ఇచ్చి భారీగా లబ్ధి పొందారు. పెదరావూరులో ప్రభుత్వం ఇచ్చిన నగదులో వాటాగా ఇవ్వమని నేతలు ఒత్తిడి చేయగా భూములను వెనక్కు తీసుకుంటామని రైతులు హెచ్చరించడంతో వదిలేశారని సమాచారం. మిగిలిన లేఅవుట్లలో అదనంగా డబ్బు వచ్చేలా చేసినందుకు ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నేతలకు మామూళ్ల కింద వసూలు చేశారు. 2019లో తెనాలి ఐతానగర్‌కు సమీపంలో ఉన్న భూములను ఎకరా రూ.38 లక్షలకు భూములు ఇచ్చేందుకు ప్రభుత్వంతో రైతులు ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ హయాంలో పట్టణానికి 4 నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని భూములకు రూ.92 లక్షలకు పైగా ముట్టచెప్పడం భూ కుంభకోణానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇలా ఒక్క తెనాలిలో రూ.393.51 కోట్లు ఖర్చుపెట్టి 526.36 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఒక్క తెనాలిలో మాత్రమే రూ.100 కోట్లకు పైగా చేతులు మారితే, రాష్ట్రం మొత్తంలో ఏ మేర భూ కుంభకోణం జరిగిందనేది ఊహకే అందని విషయం. ఎకరాకు రూ.10 లక్షలు, రూ.17.5 లక్షల చొప్పున వాటాలిచ్చినందుకు తమకు ఇబ్బందేమీ లేదని, తమకు మార్కెట్ రేటుపై పెద్ద లాభమే జరిగిందని, ఆ విశ్వాసంతో కుంభకోణం జరిగినట్లు చెప్పడానికి రైతులు ముందుకు రావడంలేదని సమాచారం.

ఖాతాలు శోధిస్తే గుట్టురట్టు

రైతుల ఖాతాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన నగదును డ్రా చేసి అదే రోజు కొన్ని ఖాతాల్లో జమ చేసినట్లు తెలిసింది. కేవలం వీటికోసమే కొన్ని కొత్త పరం ఖాతాలు తెరిచారని, మరికొన్ని వ్యాపార సంస్థల కరెంట్ ఖాతాలు కూడా వీటికోసం వాడుకున్నారు. పిండికొట్ల బజార్‌లోని కెనరాబ్యాంక్, ఐతానగర్‌లోని సిండికేట్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్, కోస్టల్ బ్యాంక్, బుర్రిపాలెం రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా, మరికొన్ని బ్యాంక్‌లలో ముందే మాట్లాడుకుని బ్యాంక్ సిబ్బందితో ఒప్పం దం చేసుకున్నాకే లావాదేవీలు ఏ ఆటంకం లేకుం డా చేసుకున్నారని చెబుతున్నారు. ఈ ఖాతాలు పట్టుకుంటే గుట్టంతా బయటకు వస్తుందని చెబుతున్నారు. అయితే ఆయా బ్యాంక్‌లలో అప్పట్లో ఉన్న మేనేజర్‌లు, ఇతర సిబ్బంది సహకారం పుష్కలంగా ఉండటంవల్లే ఇవన్నీ సాధ్యం అయ్యా యని, వారిని కూడా విచారిస్తే తేలికగా బండారం బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు..

తెనాలిలో జరిగిన భూ కుంభకోణంపై తొలి నుంచి ఆలపాటి విచారణకు పట్టుబడుతూ వచ్చారు. అప్పట్లో వైసీపీ సర్కారు పట్టించుకోకపోతే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. భూ కొనుగోళ్లు జరిపిన బుర్రిపాలెం, నేలపాడు, పెదరావూరు, కొలకలూరు, అంగలకుదురు, గుడివాడ, సంగంజాగర్లమూడి గ్రామాల్లోని నాడు భూములు విక్రయించిన రైతులను విజిలెన్స్ అధికారులు నెల నుంచి విచారిస్తున్నారు. ఆ మొత్తాలు బ్యాంక్ ఖాతాల ద్వారా కాకుండా నేరుగా డబ్బే తీసుకోవడంతో, రైతులు చెప్పే ఆధారాలు మినహా రికార్డు పరంగా ఏ ఆధారాలు లేకపోవడంతో వారు తమపైకి ఏదీ రాదనే ధీమాతో ఉన్నట్లు సమాచారం. అయితే అప్పటి వీఆర్‌వోకు ఓ రైతు తన 2 ఎకరాలకు వచ్చిన డబ్బులో రూ.1.5 లక్షలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ బ్యాంక్ ఖాతాలు పట్టుకోగలిగితే గుట్టు వీడుతుంది. అయితే విచారణ సాగుతున్న తీరు చూస్తే కుంభకోణం గుట్టురట్టు చేసేలా కాకుండా అక్రమార్కులను కాపాడేలా ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

అధికారులకూ భారీగానే..

పేదల ఇళ్లకోసం కొన్న భూముల్లో నేతలకు మేళ్లు చేసి పెట్టినందుకు అధికారులకూ భారీ గానే ముడుపులు అందినట్లు సమాచారం. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. గోలీల డొంక లేఅవుట్‌లో ఎకరాకు రూ.2 లక్షల చొప్పు న 60 ఎకరాల్లో రూ.12 కోట్లు వసూలు చేసి రెవెన్యూ అధికారులు పంచుకున్నట్లు సమాచారం. మిగిలిన లేఅవుట్లలో వచ్చిన వాటాలు కలిపితే రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు అధికారులకు దక్కి ఉంటుందనేది అంచనా.

నేడు సీతారాముల కల్యాణం

మార్టూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈశాన్య రామాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదవితరణ జరుగుతుందని, సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం న్విహిస్తామన్నారు. కార్యక్రమానికి భక్తులు విశేషంగా తరలిరావాలని వారు కోరారు.

నేడు మార్టూరులో ఉరుసు వేడుకలు

షేక్ హజరత్ కరిముల్లాషావలి ఉరుసువేడుక శుక్రవారం జరుగనుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం జెయింట్ వీల్, రంగులరాట్నాలు వచ్చి చేరాయి. స్థానికంగా కొణిదెన రోడ్‌లో దర్గా వద్ద శుక్రవారం ఉదయం వేడుకలను కమిటీ సభ్యులు ప్రారంభిస్తారు.

14న కోనంకిలో క్రికెట్ టోర్నమెంట్

మండలంలోని కోనంకి గ్రామంలో ఈ నెల 14న సోమవారం జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 9390485540 సెల్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్‌కు వీఆర్‌ఏల వినతి

సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ గురువారం యద్దనపూడిలో తహసీల్దార్ కే రవికుమార్‌కు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం వారు వినతిపత్రం అందచేశారు. వారు తమ వినతి పత్రంలో తెలంగాణ మాదిరిగా పే స్కేలును అమలు చేయాలని,నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని, అర్హతలు ఉన్న వారికి ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు.

పీహెచ్‌సీకి పరికరాల అందజేత

ఇంకొల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏపీ గ్రానైట్ మిడ్వెస్టు ప్రైవేటు లిమిటెడ్ చీమకుర్తి వారు కార్పొరేటు సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం కింద మెడికల్ పరికరాలు, ఫర్నిచర్ అందజేసారు. బేబీ వార్మర్, బీపీ ఆపరేటర్, కంప్యూటర్, వేయింగ మిషన్, నెబులైజర్, సక్షన్ ఆపరేటర్, మెడికల్ ఆఫీసర్ కుర్చీతో పాటు ఫర్నిచర్‌ను గురువారం అందజేయగా వైద్యాధికారి అంజలీ దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటు సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం ప్రతినిధి ఏ.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, జయరామిరెడ్డి, దుర్గారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే

శ్రీహర్షిణి వార్షికోత్సవంలో చైర్మన్ గోరంట్ల

మార్టూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను బడికి పంపించడంతో తమ బాధ్యత తీరిందని అనుకోకుండా వారిలో నైతికవిలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అన్నారు. గురువారం రాత్రి మార్టూరు లో శ్రీహర్షిణి విద్యా సంస్థల వార్షిక వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు మంచి మార్కులను సాధించడం అందరికీ ఆనందంగానే ఉంటుందన్నారు. అయితే ప్రస్తుత సమాజంలో విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరడానికి మంచి దారులు ఉన్నట్లే, తప్పుడు మార్గం వైపు పయనించడానికీ దారులున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పిల్లల నడవడిక, ప్రవర్తనలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ఉపాధ్యాయుల సమక్షంలో వేదికపై బహుమతులను అందజేశారు.



పోటీల్లో ప్రశంసాపత్రాలను పొందిన చిన్నారులతో చైర్మన్ గోరంట్ల, ఉపాధ్యాయులు



మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంపత్, సెక్రటరీ సురేష్ నుంచి అవార్డును అందుకుంటున్న కమిషనర్ రవీంద్ర

ఇంటి పన్ను వసూలులో అద్దంకికి రెండవ స్థానం

● అవార్డు అందుకున్న కమిషనర్

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలులో అద్దంకి మున్సిపాలిటీ రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో గురువారం విజయవాడలో జరిగిన వర్క్‌షాప్‌లో అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంపత్, సెక్రటరీ సురేష్ నుంచి అవార్డు అందుకున్నారు. నగదు అవార్డుతో పాటు మెమెంటో, సర్టిఫికెట్ అందుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రకు పలువురు అభినందనలు తెలిపారు.

కేఆర్‌కేలో ఎన్‌సీసీ రైజింగ్ డే

అద్దంకిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల నుంచి ఎటువంటి ఆర్థిక లావాదేవీలతో సంబంధం లేకుండా విద్యార్థులను రిపబ్లిక్ డే క్యాంప్, థల్ సేవా క్యాంప్, ఎన్‌సీసీ క్యాంప్‌లకు ఉచితంగా తీసుకెళ్తామని లెఫ్టినెంట్ కల్నల్ ఎన్ఎస్ పరమార్ అన్నారు. గురువారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ రైజింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి లెఫ్టినెంట్ కల్నల్ ఎన్ఎస్ పరమార్ హాజరై ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించారు. కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్‌ను కేటాయించారు.

చెత్త సంపద తయారీపై దృష్టి సారించండి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని సాక్ (రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్) ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్, జూనియర్ మేనేజర్ జానీ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో రాజేష్ ఆధ్వర్యంలో పరిశీలించారు.

అందని హైవే పరిహారం

- ఏళ్లుగా భూములు కోల్పోయిన రైతుల నిరీక్షణ
- జిల్లాలో జోరుగు సాగుతున్న 167ఏ జాతీయ రహదారి నిర్మాణ పనులు
- ఈ ఏడాది ఆఖరుకు పనులు పూర్తయ్యే అవకాశం

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నూతనంగా నిర్మాణం జరుగుతున్న 167ఏ జాతీయ రహదారి నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రూ.667 కోట్లు నిధులతో వాడరేవు నుంచి కారంచేడు, పర్చూరు, చిలకలూరి పేట, నరసరావుపేట మీదుగా పిడుగురాళ్ల వద్ద నకరికల్లు అడ్డరోడ్డు వరకు నిర్మాణాలుగు జరుగుతున్నాయి. ఈక్రమంలో బాపట్ల జిల్లాలో సుమారు 45 కిలో మీటర్లు వరకు రహదారి ఉండనుంది. ఈక్రమంలో ప్రారంభమైన జాతీయ రహదారితో తెలంగాణకు సైతం అతి తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఉంది. తద్వారా వివిధ రకాల వ్యాపారాలు సైతం కొనసాగేందుకు సులువైన మార్గం కా నుంది. అంతేకాకుండా రహదారి నిర్మాణంతో చీరాల తీర ప్రాంతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య రెట్టింపయ్యే అవకాశం కూడా ఉంది.



వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రాంతంలో నిర్మిస్తున్న హైవే



ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పిల్లర్స్

పరిహారం కోసం పాట్లు

ఇదిలావుంటే జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ జరిగిన సమయంలో అధిక సంఖ్యలో రైతులు వారు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూములను తప్పని పరిస్థితులలో నిర్మాణానికి అప్పచెప్పాల్సి వచ్చింది. అదే క్రమంలో సంబంధిత అధికారులు సైతం నష్ట పరిహారం అందించేందుకు ఆయా యజమానుల వద్ద అన్ని రకాల పత్రాలను అందుకుని ఆన్‌లైన్ చేశారు. ఈక్రమంలో రెండేళ్ల గడిచిన అనంతరం పరిహారం కొందరికి మాత్రమే అందినట్లు రైతులు చెప్తున్నారు. ఇంకా అందని వారు మాత్రం ఆందోళన చెందుతున్నారు. మరోపక్క పనులు జరుగుతుండడంతో తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. అధికారులు వెంటనే పరిశీలన చేసి పరిహారం అందించాలని భూ యజమానులు కోరుతున్నారు.

సుమారు ఎకరన్నర భూమి కోల్పోయాం



జాతీయ రహదారి నిర్మాణంలో నా అన్నది, నాది సుమారు ఎకరన్నర భూమి కోల్పోయాం. సాగు చేసి జీవించే భూమి కోల్పోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రభుత్వం నష్ట పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చింది. నేటికీ అందలేదు. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

- డీ చిన్న మోషే, భూ యజమాని

పరిహారం నోటీసులకే పరిమితం

భూ సేకరణలో భాగంగా 43 సెంట్లు కోల్పోయాను. ఆ సమయంలో అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. పరిహారం మాత్రం అందలేదు. రెండేళ్లు గడుస్తున్నా మా గోడు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలి.

- ఏసోబు, భూ యజమాని

మూడు దఫాలుగా పరిహారం అందజేశాం



భూ సేకరణ జరగగానే యజమానులకు పరిహారానికి సంబంధించి నోటీసులు అందజేశాం. గతంలో పరిహారం ఆలస్యమైనది వాస్తవమే. కానీ కొంతకాలంగా యజమానుల ఖాతాల్లో నగదు జమ జరుగుతుంది. ఇప్పటికే మూడు దఫాల్లో పరిహారం అందజేశాం. కోర్టు వివాదాలు, అగ్రిమెంట్‌ల పరిశీలన జరుగుతున్నాయి. తప్పకుండా నిర్వాసుతు లందరికీ పరిహారం అందజేస్తాం

- గోపీకృష్ణ, తహసీల్దార్, చీరాల మండలం



మైక్రో ఫైనాన్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్

ఖాతాదారులపై బెదిరింపులకు పాల్పడితే చర్యలు

డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రికవరీలకు వెళ్లిన ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు ఖాతాదారులపై బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. గురువారం వన్‌టౌన్‌లో చీరాల పరిధిలోని ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంతమంది రికవరీ ప్రతినిధులు ఖాతాదారుల ఇళ్ల వద్ద హల్‌చల్ చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ క్రమంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున పరిధి దాటి ప్రవర్తించరాదని హెచ్చరించారు. బాకీ చెల్లింపుల్లో జాప్యం ఉంటే సున్నితంగా వ్యవహరించాలని, అదీ లేకుంటే లీగల్‌గా ప్రొసీడ్ అవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై రాజ్యలక్ష్మీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ తిరునాళ్లకు బందోబస్తు

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వీర్ల గంగమ్మ తిరునాళ్ల శనివారం ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు తెలిపారు. గురువారం వీర్ల గంగమ్మ దేవాలయాన్ని సీఐ, వెంకట్రావు, ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. ఈసందర్భంగా వారు ప్రభలు ఏర్పాటు స్థలం వద్ద ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రజలు కూడా తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతంగా తిరునాళ్లకు వచ్చి వెళ్లాలని వారు కోరారు. అలానే రద్దీ ఎక్కువగా ఉంటే నలువైపులా వాహనాల పార్కింగ్‌కు ఎర్పాటు చేస్తామని వారు తెలిపారు.

కోలాహలంగా బార్ అసోసియేషన్ నామినేషన్

ఇప్పటికే ఇద్దరు ఏకగ్రీవం

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బార్ అసోసియేషన్ నామినేషన్ ప్రక్రియ గురువారం కోలాహలంగా ముగిసింది. బార్‌లో ప్రస్తుతం 201 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. మొత్తం ఎనిమిది విభాగాలకు సంబంధించి గురువారం నామినేషన్‌లు స్వీకరించారు. 12వ తేదీన విత్ డ్రాలకు అవకాశం. 15వ తేదీన ఎన్నికలు, అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నారు. ఈక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఇప్పటికే రెండు సార్లు కొనసాగిన రమేష్‌బాబు, సీనియర్ న్యాయవాది కొమ్మనబోయిన నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, తారక రామారావు, సెక్రటరీకి అశోక్ కుమార్, రవికుమార్ పోటీ పడ్డారు. అలాగే ట్రెజరీగా రామకోటేశ్వరరావు, రామకృష్ణ నామినేషన్ వేశారు. లైబ్రరీగా కామేశ్వరరావు, కల్పన, కల్చరర్ సెక్రటరీగా రాజా సాల్మన్, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ మస్తాన్‌వలి వేయడంతో రెండు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మహిళా ప్రతినిధిగా స్నేహ, కల్పన నామినేషన్ వేశారు. వీటికి సంబంధించి ఎన్నికలు ఈ నెల 15వ తేదీన జరుగనుండగా, అదేరోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

మార్క్‌ఫెడ్ జిల్లా డీఎం కరుణ

అడుసుమల్లి (పర్చూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా డీఎం కరుణ అన్నారు. గురువారం మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో పీఏసీఎస్ బ్యాంక్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని డీఎం ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేందుకే ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మినుము, శనగ, పెసలు వంటి అపరాలను ఈ-కేంద్రాల ద్వారా విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అడుసుమల్లి పీఏసీఎస్ సీఇవో రమాదేవి, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అపరాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం కరణ, సిబ్బంది, రైతులు

కొండమంజులూరు పాఠశాలలో భోజనశాల

- రూ.15లక్షలతో ఏర్పాటు
- ప్రారంభించిన సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు, నేతలు

పంగులూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ఇంటరైజ్ సంస్థ సంయుక్తంగా రూ.15లక్షల వ్యయం తో భోజనశాలను నిర్మించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ పథకంలో భాగంగా పాఠశాల బాల, బాలికలు భోజనం చేసేందుకు అత్యాధునిక వసతులతో నిర్మించబడిన ఈ నూతన భోజనశాలను గురువారం హైవే ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్, ఆపరేషన్స్ మేనేజర్ ఆనంద్‌సింగ్, రౌండ్‌టేబుల్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి వెంకటేష్ స్థానిక ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఐ.అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ఆపరేషన్స్ మేనేజర్ ఆనంద్‌సింగ్‌ను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గోలి సంధ్యారాణి, నేతలు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు ఘనంగా సత్కరించారు. 450 మంది విద్యార్థులు చదువుతున్న కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో రూ.15లక్షలతో నూతన భోజనశాల నిర్మించి విద్యార్థులు కూర్చొని భోజనం చేసేందుకు స్టీలు బెంచీలను సమకూర్చిన సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే సీనియర్ మేనేజర్ కోటేశ్వరరావు, బొల్లాపల్లి టోల్‌ప్లాజా ప్రతినిధి నరసింహారావు, స్టాఫ్ సెక్రటరీ బత్తుల రాంగోపాల రెడ్డి, చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, మాజీ సర్పంచ్ సత్యవర్ధన్ రావు, కోటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భోజనశాలలో విందును ఆరగిస్తున్న పాఠశాల బాలబాలికలు



భోజనశాలను ప్రారంభిస్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు, నేతలు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

చినగంజాం, ఏప్రిల్ 10 : డీఎస్సీ రిక్రూట్‌మెంట్-2025 పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ కోసం అర్హులైన జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలియజేసినట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి కార్యాలయం, బాపట్ల జిల్లా వారికి చేసుకోవాలని సూచించారు. ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులని, అభ్యర్థుల ఎంపిక విధానం టీటీసీ మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటాతో పాటు టెన్త్, టీటీసీ మార్కులిస్ట్, టెట్ మార్కులిస్ట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం(తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,00,000లోపు మాత్రమే), ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, రెండు పాస్ పోర్టు సైజ్‌ఫొటోలు జతపరిచి వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి. జిల్లా కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9963633578, 6309335544 సెల్ నెంబర్లను సంప్రందించాలని తెలిపారు.

అద్దంకిటౌన్ : డీఎస్సీ రిక్రూట్‌మెంట్-2025 పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ కోసం అర్హులైన జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన శింగయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం టెట్ క్వాలీఫై అయిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు వరాలకు 9963633578, 6309335544ను సంప్రదించాలని తెలిపారు.

13న ఉచిత నేత్ర శిబిరం

పర్చూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 13న శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని, చిన్నయ మిషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పాబోలు ఉదయ్ భాస్కర్ గురువారం ప్రకటనలో తెలిపారు. విద్యాదాత పాబోలు రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం అందుబాటులో ఉం టుందన్నారు. రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చేసుకోవాలని కోరారు.

డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభం

పంగులూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భగవాన్‌రాజుపాలెం వద్ద జాతీయ రహదారి పక్కన డ్రైన్ నిర్మాణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నెల ఒకటవ తేదీన మంత్రి గొట్టిపాటి రవికుమార్ బీఆర్‌పాలెం ఎస్సీ కాలనీలో పింఛన్‌ల పంపిణీ చేస్తున్న సందర్భంలో రోడ్డుపై మురుగు పేరుకుపోవడం చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు గురువారం కాలనీలో మురుగు ముందుకు పోయేలా ఫ్లైవోవర్ పక్కన అప్రోచ్ రోడ్డు వైపు డ్రైన్ ఏర్పాటుకు తహసీల్దార్ సింగారావు, ఎస్ఐ వినోద్‌బాబు పంచాయతీ, హైవే సిబ్బందితో కలసి చర్యలు చేపట్టారు. మురుగు కాలువలలో ఉన్న పూడికను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శి రవూఫ్‌ఖాన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో హైవే, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు 400 మంది విద్యార్థుల హాజరు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జ్యోతీరావుపూలే, అండేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు పూలే, అంబేడ్కర్ వ్యాసరచన, వక్తృత్వ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలను హెచ్‌ఎంలు కేవీ శ్రీనివాసరావు, గోపతోటి శ్యాంసన్ ప్రారంభించారు. ఈ పరీక్షలకు వివిధ పాఠశాలల నుంచి 400 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, కిరణ్‌కుమార్, ఆంజనేయులు, శ్రీకృష్ణ, రాజశేఖర్, అంకమ్మరావు నాగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బరాజు, సిబ్బంది

ట్రాఫిక్ నిబంధనలు తెలియాలి

విద్యార్థి దశ నుంచే అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణ

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు అన్నారు. పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు గురువారం స్థానిక భవానీ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలపై సీఐ సుబ్బరాజు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరాజు మాట్లాడుతూ వాహనచోదకులు, పాదచారులు పట్టణాలలో ప్రయాణించేటప్పుడు కచ్చితంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను బట్టి ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అనుచరించటం, ట్రాఫిక్ నిబంధనలు పాటించటం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయన్నారు. హెల్మెట్ వాడాల్సిన అవసరాన్ని వివరించారు. తల్లిదండ్రులు కచ్చితంగా హెల్మెట్ వినియోగించేలా విద్యార్థులు పట్టుబట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ఎలా రక్షణ కవచంగా ఉంటుందో ఇళ్లల్లో తల్లిదండ్రులకు వివరించాలన్నారు. మైనర్లు మోటార్ సైకిళ్లను నడపరాదని సుబ్బరాజు సూచించారు.

నేడు వసతి గదులకు భూమి పూజ

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ సంతమాగులూరు మండలాల్లో శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కేజీబీవీ విద్యాలయంలో వసతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. సుమారు రూ.3 కోట్ల ప్రభుత్వ నిధులతో ఏల్చూరు, బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో వసతి గదుల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేయనున్నారని టీడీపీ నాయకుడు మలినేని గోవిందరావు తెలిపారు. రెండు విద్యాలయాలలో శిలా ఫలకాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 9.30కు ఏల్చూరు, 10.30కి బల్లికురవ గ్రామాలలో మంత్రి పర్యటనతోపాటు 11 గంటలకు ఏంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో భాగంగా ఆయన అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిప వేస్తున్నట్లు ఏఈ గోరంట్ల అనిల్‌కుమార్ తెలిపారు. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని

విద్యుత్ పోల్‌ను ఢీకొన్న టిప్పర్

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ పోల్‌ను టిప్పర్ లారీ ఢీకొన్న ఘటన కారంచేడు - ఆదిపూడి మధ్య గురువారం జరిగింది. కారంచేడు నుంచి ఆదిపూడి వెళ్తున్న టిప్పర్ అతివేగంగా ప్రయాణిస్తూ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు, సిబ్బందితో కలసి హుటాహుటీన చేరుకొని పరిశీలించారు. పడిపోయిన స్తంభాన్ని తొలగించినట్లు ఏఈ తెలిపారు. ఈవిషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మొక్కజొన్న పైర్ల ప్రదర్శన

చెరుకూరు(పర్చూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో జీఎల్ -135 మొక్కజొన్న రకం పంటపై గురువారం రైతులతో కలసి క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాలలో ముగ్గురికి గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రెండు వేర్వేరు ప్రమాదాలలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలో ఇటుక బట్టీల వద్ద గురువారం వేకువజామున మార్టూరు మండలం కోలలపూడి నుంచి ముండ్లమూరుకు పొట్టు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్, దర్శి నుంచి ఇంకొల్లు వెళ్తున్న మినీ లారీ ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మినీ లారీ డ్రైవర్ గోపిచంద్‌కు గాయాలు కావడంతో అద్దంకి వైద్యశాలకు తరలించారు. పొట్టు ట్రాక్టర్ ట్రాలీ రోడ్డుపై పడిపోయింది. అద్దంకి పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్ పై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. అద్దంకి మండలం కొంగపాడుకు చెందిన కరి నాగేశ్వరరావు, కరి సాంబశివరావు గురువారం మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై అద్దంకి వస్తుండగా వెనుక వైపు మేదరమెట్ల వైపు నుంచి అద్దంకి పట్టణంలోకి వస్తూ మార్కెట్ యార్డు పక్క నుంచి వేలమూరిపాడు రోడ్డులోకి వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, సాంబశివరావుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన వైద్యానికి ఒంగోలు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఇంకొల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం గ్రామ సమీపంలో వ్యక్తి చింతచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం గ్రామానికి చెందిన పోలూరి మహేష్ (27) రెండురోజుల కిందట చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య సమస్యలతోనే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అతని తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మహేష్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పీటీడీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కారించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గ్యారేజీ వద్ద గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ డిపో చైర్మన్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్‌లు, రిమూవల్స్‌ను ఆపాలన్నారు. ప్రమోషన్‌లను వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి అనపర్తి వందనం బాబు, ట్రెజరర్ అంజి, బాపట్ల జిల్లా వైస్ ప్రెసిడెంట్ రహ్మతుల్లా పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

ఇంకొల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. స్థానిక స్థూపం సెంటర్‌లో గురువారం రైతులు పొగాకును తగలపెట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి రామారావు, నాయకులు రామకోటేశ్వరరావు, ఆదెయ్య, కోటేశ్వరరావు, సాంబయ్య పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో వేటపాలెం మండలం మంకెనవారిపల్లికి చెందిన పిచ్చుక మల్లికార్జున (45) ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. అతను స్థానిక పెట్రోల్‌బంక్‌లో పనిచేసి మానేశారు. ఏం జరిగిందోగాని శుక్రవారం అర్ధరాత్రిధాటాక 3 లీటర్ల పెట్రోల్ కొనుక్కొని అతని ఇంటి సమీపంలో ఒంటిపై పోసుకొని అంటించుకున్నాడు. అనంతరం కేకలు వేయడంతో స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, వివరాలు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉష్ణోగ్రత వివరాలు


కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.4	27.2
కావలి	36	27
ఆత్మకూరు	38	27
ఉదయగిరి	38	26
కందుకూరు	36	27

'పబ్లిక్' వద్దు.. 'ప్రైవేటు' ముద్దు !

- ప్రభుత్వ బ్యాంకులు కాదని ప్రైవేటు బ్యాంకుల వైపు మొగ్గు
- ప్రైవేటు బ్యాంకుల్లో నడుస్తున్న కీలక అకౌంట్లు
- రూ.కోట్ల నిధుల జమ
- వివాదాస్పదంగా కొందరు ఉన్నతాధికారుల నిర్ణయం
- సీఎం ఆదేశించినా, సర్క్యులర్ ఇచ్చినా డోంట్‌కేర్!

రూపాయి, రెండు రూపాయలు కాదు.. రూ.కోట్ల నగదు. అంతా ప్రభుత్వ సొమ్ము. ఇంతటి విలువైన ప్రభుత్వధనాన్ని బాధ్యత కలిగిన ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే దాచిపెట్టాలి. కానీ జిల్లాలో కొన్ని కీలక విభాగాలకు చెందిన ఖాతాలు ప్రభుత్వ బ్యాంకులను కాదని ప్రైవేటు బ్యాంకుల్లోనే కొనసాగుతున్నాయి. ఈ ఖాతాలలో కొన్ని రూ.కోట్ల నిధులు ఉన్నాయి. పదుల సంఖ్యలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉంటే వాటిని కాదని ప్రైవేటు బ్యాంకుల్లోనే లావాదేవీలు జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? అంటే అధికారులెవరూ సమాధానం ఇవ్వడం లేదు.

నెల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులు అంటే ఒక నమ్మకం. బ్యాంకింగ్ రంగంలో వీటి పాత్రే ఎక్కువగానే ఉంటుంది. గ్రామస్థాయిలో ప్రజలకు సేవలందించేది కూడా ఈ బ్యాంకులే. రైతులకు రుణాలు ఇవ్వాలన్నా, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సాయం అందించాలన్నా ప్రభుత్వ రంగ బ్యాంకుల లక్ష్యాలే ఎక్కువగా ఉంటాయి. అలాంటిది ప్రభుత్వ శాఖలకు మాత్రం ఈ బ్యాంకులు అక్కరకురావడం లేదు. చాలా శాఖలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే తమ లావాదేవీలను కొనసాగిస్తున్నా కొన్ని కీలకమైన ఖాతాలు మాత్రం ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్నాయి. కలెక్టరేట్‌కు అనుబంధంగా ఉండే భూసేకరణ, పునరావాసం విభాగాలకు చెందిన ఖాతాలు ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్నాయి. తెలుగుగంగ ప్రాజెక్టు భూసేకరణ విభాగం ఖాతాలు కూడా ఓ ప్రైవేటు బ్యాంకులో తెరిచారు. చివరకు రామాయపట్నం పోర్టు, దాని అనుబంధ పరిశ్రమలకు జరుగుతున్న భూసేకరణకు సంబంధించిన భూసేకరణ, ఆర్‌అండ్ ఆర్ ఖాతాలను కూడా ప్రైవేటు బ్యాంకు లోనే కొనసాగుతుండటం గమనార్హం. ఒక ప్రాజెక్టుకు భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి లావాదేవీలు రూ.వందల కోట్లలోనే జరుగుతుంటాయి. అంతమొత్తం నిధులను ప్రభుత్వ బ్యాంకుల్లో కాకుండా ప్రైవేటు బ్యాంకుల్లో ఉంచడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



సాధారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నగదు ఉంచితే వడ్డీ వస్తుందని, ప్రైవేటు బ్యాంకుల్లో ఆ పరిస్థితి ఉండడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక కొన్ని శాఖలు ఫిక్స్‌డ్ డిపాజిట్లను కూడా ప్రైవేటు బ్యాంకుల్లో ఉంచుతున్నాయి. ఇక్కడ వడ్డీ రేటు తక్కువైనా ఎందుకు అక్కడ డిపాజిట్ చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎక్కువ వడ్డీ రేటు ఇస్తామంటున్నా వారి వైపు ఆసక్తి చూపడం లేదని చెప్పుకుంటున్నారు.

సీఎం ఆదేశించినా..!

నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా)కు చెందిన సుమారు రూ.4 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు గతంలో ఓ ప్రైవేటు బ్యాంకులో ఉంచారు. అతి తక్కువ వడ్డీ అయినా అక్కడ ఎందుకు పెట్టారో తెలియదు. రెండేళ్ల క్రితం ఓ ప్రభుత్వ రంగ గ్రామీణ బ్యాంకు నుడా అధికారులను సంప్రదించి ఎక్కువ వడ్డీ ఇస్తామని, ఈ నిధులతో రైతులు, సామాన్యులకు రుణాలు ఇస్తామని చెప్పడంతో ప్రైవేటు బ్యాంకులోని ఫిక్స్‌డ్ డిపాజిట్లను సదరు గ్రామీణ బ్యాంకులోకి మార్చారు. అయితే ఈ మార్పుపై సదరు ప్రైవేటు బ్యాంకు సిబ్బంది తీవ్రస్థాయిలో నుడా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అంటే ప్రైవేటు బ్యాంకుల ప్రతినిధులు ఏ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేటు బ్యాంకుల నుంచి జిల్లా యంత్రాంగానికి సహకారం కూడా అంతంత మాత్రంగానే ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా పోలవరం ముంపు బాధితులకు ఇచ్చే పరిహారాన్ని ప్రభుత్వం జనవరిలో విడుదల చేయగా ఇప్పటికీ ఆ నిధులు బాధితులకు అందలేదు. ఎందుకిలా అని ఆరా తీస్తే.. సదరు అకౌంట్ ఓ ప్రైవేటు బ్యాంకులో ఉండగా, ఆ బ్యాంకు నుంచి జమకావడం లేదని తేలింది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ విధంగా జిల్లాలోనూ అనేక ముఖ్యమైన ఖాతాలు ప్రైవేటు బ్యాంకుల్లో కొనసాగుతున్నాయి. రెండు నెలల క్రితం రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించినప్పుడు ప్రభుత్వ శాఖలకు చెందిన సొమ్మును ఎక్కడా ప్రైవేటు బ్యాంకుల్లో పెట్టవద్దని ఆదేశించారు. ఆ మేరకు సీఎంవో నుంచి ప్రత్యేక సర్క్యులర్ కూడా జారీ అయ్యింది. కానీ ఆ ఆదేశాలను జిల్లాలో పట్టించుకోవడం లేదు. ఇంకా ప్రైవేటు బ్యాంకుల నుంచి ఖాతాలను ప్రభుత్వ బ్యాంకుల్లోకి మార్చడం లేదు.



ఆదిశేషుడిపై విహరిస్తున్న సీతా,లక్షణ సమేత శ్రీరామచంద్రుడు

శేషవాహనంపై అలరించిన శ్రీరాముడు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి శ్రీరామచంద్రమూర్తి శేషవాహనంపై నగరోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ధ్వజారోహణం, హోమం, అర్చన, హారతి, తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. సాయంత్రం హోమం, బలిహరణ, అనంతరం ప్రదర్శించిన బాలత్రిపురసుందరి నృత్యకేతన్, సాయిలలిత నృత్యనికేతన్ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కాగా రాత్రికి స్వామివారిని శేషవాహనంపై ఆసీనులను చేసి, మంగళవాయిద్యాలు, విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా వేడుకల మధ్య నయనానందకరంగా నగరోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా పీవీ.ప్రసన్నరెడ్డి, స్వర్ణలత వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, రాజు, రామ్‌నగర్ భక్తబృందం పర్యవేక్షించారు.



పెంచలకోనలోని నృసింహుడి ఆలయం

కోన పాలకవర్గం కొలువు దీరేదెన్నడో...?

- వచ్చేనెల 8 నుంచి బ్రహ్మోత్సవాలు
- ఆలయ చైర్మన్‌పై దృష్టి సారించని ప్రభుత్వం
- ఎమ్మెల్యేకి కత్తిమీద సాములా ఎంపిక
- పర్యాటక కేంద్రం హామీ నెరవేరేనా..?

రాపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన ఆలయ పాలకవర్గం కొలువుదీరేదెన్నడోనని భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దాదాపు రెండేళ్లుగా పాలకమండలి లేకపోవడంతో ఆలయ అభివృద్ధి కుంటుపడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన పాలకవర్గం గడువు 2023 సెప్టెంబరు 10కి ముగిసింది. దీంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం పాలకవర్గంపై దృష్టి సారించలేదు. అంతలోనే ఎన్నికల కోడ్‌అమలులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్నా, ఇప్పటికీ పాలకవర్గాన్ని నియమించలేదు. ఇకపోతే ఆలయానికి ఇన్‌చార్జిగా కూడా స్థానిక ఎమ్మెల్యే ఎవరిని నియమించలేదు. దీంతో ఆలయ అధికారులు, సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో అతి పెద్ద ఆలయం అయిన పెంచలకోనపై ఎమ్మెల్యే కురుగొండ్ల దృష్టి సారించకపోవడంతో అభివృద్ధి పనులు ఆగాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

8 నుంచి బ్రహ్మోత్సవాలు

మే 8 నుంచి కోనలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల పనులపై ఎమ్మెల్యేకు ఒక మాటైనా చెప్పకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే కురుగొండ్ల నెలకు ఒక్కసారైనా కోనలో పర్యటించి ఆలయం అభివృద్ధిపై సమావేశం ఏర్పాటు చేసి, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కత్తిమీద సాములా చైర్మన్ ఎంపిక

కోన ఆలయ వార్షిక ఆదాయం రూ. 12 కోట్లకు పైగానే ఉంది. అంతేకాక రోజు రోజుకు అభివృద్ధి చెందే ఆలయం కావడంతో పాలకమండలి చైర్మన్ పదవిపై అందరి దృష్టి పడింది. టీడీపీని నమ్ముకున్న పలువురు నాయకులు చైర్మన్ పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. అంతేకాక ఈసారి పాలకవర్గంలో డైరెక్టర్ల సంఖ్య పెంపు కారణంగా నోటిఫికేషన్ విడుదలలో ఆలస్యం అయిందని సమాచారం. ట్రస్ట్ బోర్డులో ఎవరిని నియమించాలనేది ఎమ్మెల్యేకి కత్తి మీద సాములా మారింది. మాకంటే..మాకు.. అని కొందరు నాయకులు అంటుండడంతో ఎమ్మెల్యే సైతం డైలామాలో పడ్డారు. గతంలో ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబు కోన ఆలయాన్ని సందర్శించినప్పుడు ఆలయ అభివృద్ధికి నిధులు విడుదల చేసి, పెంచల కోనను పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఆయన మాట నిలబెట్టుకుంటారా..? అనేది వేచి చూడాలి. ఈ నేపథ్యంలో చైర్మన్ గిరి ఎవరిని వరిస్తుందో చూడాలి.

పెంచిన ధరలు తగ్గించాలి

- దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలోనే గ్యాస్, పెట్రో ధరల పెచ్చు
- నగరంలో సీపీఎం నిరసన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు ఎక్కువగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంతో పోల్చుకుంటే కర్ణాటకలో పెట్రోల్ ధరలు రూ. 10 తక్కువగా ఉన్నాయన్నారు. తమిళనాడులో కూడా రూ. 5 తగ్గాయని, కేరళలో మరింతగా తక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఇదిలా ఉంటే విద్యుత్ చార్జీలతో అదనపు భారాలు మోపుతున్నారని విమర్శించారు. నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌ను అన్ని రాష్ట్రాల కంటే తక్కువ ధరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, పార్టీ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, షాక్ మస్తాన్‌బీ, కొండా ప్రసాద్, నాగేశ్వరరావు, పెంచలనర్సయ్య, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కందుకూరులో కూడా సీపీఎం, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.



పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఎస్పీకి అస్వస్థత

డీహైడ్రేషన్‌తోనే ఇబ్బందులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ జీ. కృష్ణకాంత్ ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వేసవి తీవ్రతతో ఆయన డీహైడ్రేషన్‌కు లోనై అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం విధులు నిర్వహిస్తుండగా ఆయన సొమ్మసిల్లారు. గమనించిన కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు నగరంలోని కిమ్స్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి, డీహైడ్రేషన్‌కు లోనై అస్వస్థతకు గురయ్యారని, ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. ఎస్పీ ఆరోగ్య పరిస్థితిపై హోంమంత్రి వీ. అనిత ఆరాతీశారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎస్పీని పలువురు పోలీసు అధికారులు పరామర్శించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన జేసీ కార్తీక్

ప్రభుత్వం దృష్టికి రెవెన్యూ సమస్యలు

కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న రెవెన్యూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జేసీ కే.కార్తీక్, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజిత, డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీవోలతో కలిసి రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న రెవెన్యూ సమస్యలపై కూలంకషంగా చర్చించారు. పలు పరిశ్రమలు, విద్యా సంస్థల ఏర్పాటుకు భూముల కేటాయింపు, ప్రైవేటు పట్టా భూములను నిషేధిత 22ఏ నుంచి తొలగించుట, రీ సర్వే సమస్యలు, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ, వెబ్‌ల్యాండ్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, అసైన్‌మెంట్ భూముల కేటాయింపు, మ్యూటేషన్లు, పీవోటీ, ఇనాం యాక్ట్‌ల వర్తింపు, భూముల రిజిస్ట్రేషన్‌లో తలెత్తుతున్న సమస్యలు, చట్టపరంగా భూసమస్యల పరిష్కారంలో ఎదురవుతున్న అంశాలను తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ అధికారులు సూచించిన ప్రతి సమస్యపై కలెక్టర్, జేసీ సుదీర్ఘంగా చర్చించి పరిష్కారానికి తగిన సూచనలిచ్చారు. చట్టపరంగా, సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సదస్సులో జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల ఏడీ నాగశేఖర్, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు అనూష, వంశీకృష్ణ, పావని, తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగవాన్ మహావీర్ జయంతి



భగవాన్ మహావీర్ ఉత్సవమూర్తికి నిర్వహిస్తున్న నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో భగవాన్ మహావీర్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీజైన్ శ్వేతాంబర్‌మూర్తి పూజక సంఘ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జైన్ మత గురువులు పన్యాస్ సమర్పణప్రభ, మునిరాజ్ ధాన్యప్రభ, దేవోదయప్రభ మార్గదర్శకత్వంలో ఊరేగింపు చేపట్టారు. ఉదయం శ్రేయాన్సాథ్ ఆలయంలో భగవాన్ మహావీర్ విగ్రహానికి శక్రస్తవ అభిషేకం నిర్వహించారు. జియాన్ ఆరాధనభావంలో భగవాన్ మహావీర్ జయంతిని నిర్వహించి, అనంతరం మహావీర్ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ ఊరేగింపు మండపాల వీధిలోని జైన ఆలయం నుంచి ప్రారంభమై చిన్నబజారు, పెద్దబజారు, ఆచారివీధి, కాపువీధుల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ ఊరేగింపులో సుమతి శ్రేయాన్స్ జైన్ ఢోల్ బృందం సంగీత ప్రదర్శన అలరించింది. సంస్కార్ విద్యాలయ పిల్లలు వివిధ వేషధారణలతో మన సంస్కృతిని చాటారు. ఈ కార్యక్రమంలో కిషోర్‌కుమార్ లుంకడ్ స్వరంలో ఆలపించిన గీతాలు అందరినీ ఆకర్షించాయి. సాయంత్రం భగవాన్ మహావీర్ విగ్రహాన్ని సుమతి శ్రామిక గ్రూపు ఆధ్వర్యంలో అద్భుతంగా అలంకరించారు.

కొత్తపేటలో పులి సంచారం ?

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామ సమీపాన గల వాగు ప్రాంతంలో పులి సంచరించడాన్ని ఓ వ్యక్తి గుర్తించాడు. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరసింహారావు గురువారం వాగు వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ పులి కనిపించడంతో భయంతో గ్రామంలోకి పరుగులు తీశాడు. దీంతో గ్రామస్థులు జిల్లా అటవీశాఖాధికారి మహబూబ్‌బాషాకు సమాచారం అందించారు. ఆయన ఉదయగిరి రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాను, సిబ్బందిని పంపి పరిశీలించాలని ఆదేశించారు. దీంతో డీఆర్వో మురళి, ఎఫ్‌బీవో ప్రసాద్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని వాగు ప్రాంతంలో పులి పాదముద్రల కోసం గాలింపు చేపట్టగా ఏమీ కనిపించలేదు. గడ్డి బాగా పెరిగి ఉండడంతో పాదముద్రలు కనిపించలేదని, గ్రామస్థుడు చెప్పే ఆనవాళ్ల ప్రకారం అడవిపిల్లిగా అనుమానిస్తున్నట్లు అటవీ అధికారులు పేర్కొన్నారు. గ్రామస్థులు జాగ్రత్తగా ఉండడంతోపాటు ఎప్పటికప్పుడు తమకు సమాచారాన్ని ఇవ్వాలని వారు సూచించారు.



పులి పాదముద్రల కోసం అడవిలో గాలింపు చేపడుతున్న అటవీ అధికారులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 420



మరుగుదొడ్లకు తలుపుల స్థానంలో విరిగిపోయిన చెక్కలు

సమస్యల హైస్కూల్

- శిథిలావస్థలో నలదలపూరు పాఠశాల తరగతి గదులు
- విరిగిన తలుపులు.. కిటికీలు
- తలుపులు లేని టాయిలెట్లు
- ఊసే లేని ఆర్వో ప్లాంట్
- పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వా లు చేస్తున్న ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదు. మండలంలోని నలదలపూరు హైస్కూల్‌లో హైస్కూల్‌లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకూ 109 మంది విద్యార్థులు ఉన్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారు.



నలదలపూరు హైస్కూల్‌లో కిటికీలు లేని తరగతి గదులు

చెదలు పట్టి.. విరిగిపోయిన తలుపులు, కిటికీలు

తరగతి గదుల తులుపులు, కిటికీలు చదులుపట్టి విరిగిపోవడంతో వాటిని తీసి పక్కన పడేశారు. తరగతి గదులకు తలుపులు లేకపోవడంతో ఆకతాయిలు అందులో చేరి అపరిశుభ్రంగా మారుస్తున్నారు. అంతేగాకుండా హైస్కూల్ ఊరికి దూరంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలు అడ్డగా మారింది. కొన్ని గదులు ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అలాగే మరుగుదొడ్లకు తలుపులు లేవు. ప్రత్యామ్నాయంగా విరిగిన రేకులు, చెక్కలు అడ్డుపెట్టారు. ఈ సమస్యతో మలమూత్ర విసర్జనకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మినరల్ వాటర్ కొనుగోలు

నీటిశుద్ధి జల కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్న సమయంలో టీచర్లు క్యాన్ రూ.5పెట్టి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు.

కూలిన ప్రహరీ

పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ కొంత భాగం కూలిపో యినా ఇప్పటివరకు దాని నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో హైస్కూల్ ప్రాంగణలోకి మూగజీవాలు వచ్చి అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.



తులుపులు లేని తరగతి గదులు

రహదారి పక్కనే మల, మూత్ర విసర్జన

గ్రామంలో నుండి హైస్కూల్‌కు వెళ్లేందుకు రెండు ఫర్లాంగులు దూరం ఉంది. హైస్కూల్‌కు వెళ్లే రహదారి మరీ అధ్వానంగా ఉంది. మట్టి రోడ్డు కావడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము లేస్తుంది. అంతేగాకుండా రహదారికి రెండు వైపులా కొంతమంది గ్రామస్థులు మల,మూత్ర విసర్జన చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు దుర్వాసన భరించలేకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిరుపయోగంగా పాలవెల్లువ కేంద్రం

లింగసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. అనాలోచిత నిర్ణయాలతో గ్రామాలకు దూరంగా నిర్మించిన పలు శాఖలకు చెందిన భవనాలు నేడు ఉపయోగానికి నోచుకోవడం లేదు. గామాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నా ఆక్రమణలకు గురవడంతో అధికారులు గ్రామాలకు దూరంగా కొన్ని శాఖల భవనాలను నిర్మించారు. అందులో భాగంగా తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి అర కిలోమీటరు దూరంలో పాలవెల్లువ కేంద్రం, దానికి సంబంధించిన మరుగుదొడ్డిని లక్షలాది రూపాలయలతో ఐదేళ్ల కిందట నిర్మించారు.



తిమ్మారెడ్డిపాలెంలోని పాలవెల్లువ కేంద్రం

కానీ ఈ పాలవెల్లువ కేంద్రాలకు పాలు సేరకించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు ఈ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం దీని పరిసరాల్లో చిల్లచెట్లు కమ్ముకున్నాయి.

వైభవంగా సీతారాముల కల్యాణం

బిట్రగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీం పేటలోని రైల్వే లోకో రామ మందిరంలో గురువారం సీతాతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పసుపులేటి చెంచయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రైల్వే కార్మికులతో పాటు రైల్వే విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేపట్టారు.

న్యూస్ బాక్స్

గ్రామసభలకు 18 వినతులు

కొండాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నోషనల్ ఖాతా నెంబర్లు రెగ్యులరైజ్ చేసేందుకు రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న గ్రామసభలకు గురువారం 18వినతులు అందినట్లు తహసీల్దార్ ఎమ్.కోటేశ్వరరావు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జరిగిన గ్రామసభల్లో కొమ్మిలో 6, మర్రిగుంటలో 12 వినతులను రైతులు అందజేశారు. వీటిని పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు వీఆర్‌వో మహేష్ పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిత

- ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ
- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కావలి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయవచ్చని తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయ రీజనల్ జాయింట్ డైరక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియ తెలిపారు. మండలంలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దటంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పాలిసెట్ దరఖాస్తు స్వీకరణకు ఏప్రిల్ 15 చివరితేదీ అని, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యా ర్థులకు రూ.100ఫీజు చెల్లించాలన్నారు. విశ్వోదయ బాలికల పాఠశాల, రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం పాలిసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. విశ్వోదయ బాలికల పాఠశాలలో 2025 ప్రవేశ పరీక్షకు అవసరమగు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేస్తామని ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్‌ప్రియ తెలిపారు.

త్వరలో గిరిజనులకు ఆధార్ శిబిరం

కావలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులు లేకుండా ఇబ్బందులు పడుతున్న మండలంలోని గిరిజనుల కోసం త్వరలో ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. గడపగడకు ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 35వ వార్డులో ఇద్దరు గిరిజనులు (యానాదులు) తమకు ఆధార్ కార్డులేదని చెప్పడంతో ఆయన ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పెదపవని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ నీలాంబరి, తదితరులు

లింగసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ పెదపవని సెక్టార్ సూపర్‌వైజర్ నీలాంబరి సూచించారు. గురువారం మండలంలోని పెదపవనిలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నీలాం బరి, అంగన్వాడీ కార్యకర్తలు పోషణ పక్వాడా కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో పాటు పాలు, గుడ్లు, ఆకుకూరలు సమపాళ్లలో తీసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు వురు అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయిను లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా

ఉలవపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు, ఉలవపాడు ఐసీడీఎస్ సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. మొదటి ఆరు నెలలు తల్లిపాలతో శిశువుకి లభించే పోషకాలు గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించినట్లు సూపర్‌వైజర్లు అంజమ్మ, నాగలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్ వాడీ పోషకాహార లబ్ధిదారులు పాల్గొన్నారు.



పోషణ్ పక్వాడాలో పాల్గొన్న గర్భిణులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- కావలిలో గడప గడపకు ఎమ్మెల్యే కార్యక్రమం

కావలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి 10నెలలు అవుతున్న సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే అధికారులతో కలిసి గడపగడపకు ఎమ్మెల్యే కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని వైకుంఠపురం 35వ వార్డులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



దెబ్బతిన్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఈ సందర్భంగా ప్రజలు వారి వ్యక్తిగత సమస్యలతో పాటు స్థానిక సమస్యలకు ఏకరువు పెట్టారు. ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు రాలేదని కొందరు.. మంచినీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, లైట్ల సమస్యను వివరించారు. వెంటనే ఆయాశాఖల అధికారులు సమస్యను నోట్ చేసుకుని అవకాశం ఉన్నంతవరకు వెంటనే పరిష్కారించాలని ఆదేశించారు. ప్రతివార్డుకు రూ.10లక్షలు మంజూరు చేసి చిన్న సమస్యలన్నింటినీ నెలరోజుల్లో పరిష్కరిస్తామన్నారు. వైకుంఠపురంలోని ప్రతి ఇంటికి కొళాయిలతో నీరు అందించేందుకు ఇప్పటికే రూ.23లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ డీఈ సాయిరాం, టీడీపీ పట్టణాధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, అనుబంధ సంఘాలైన సీఐటీయూ, ఐద్వా ఆధ్వ ర్యంలో గురువారం స్థానిక సుందరయ్య భవన్ నుంచి ఆర్టీసీ డిపో వరకు ప్రదర్శన చేసి అక్కడ నిరసన కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు ఎస్‌ఏ గౌస్, ఎస్కే. మున్వర్ సుల్తానా, ఎస్కే. మల్లిక, ఎం. పద్మ, ఎస్. పవన్‌కుమార్, బీ. శ్రీను, డీఎం రాయుడు, రమణ పేతురు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరం

కావలి,ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకునేందుకు లక్ష్మీమెడికల్ కాలేజీఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు గురువారం రోటరీక్లబ్‌ఆఫ్ ఆధ్వర్యంలో పాతూరు కళాశాలలో రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ, కరస్పాండెంట్ మాధవరెడ్డి మాట్లాడారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న తలసేమియా డే కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న చిన్నారుల కు వ్యాధితీవ్రతను బట్టి 15లేదా 21రోజులకోసారి ఉచితంగా రక్తం ఎక్కించటంతో పాటు మందులు, పౌష్టికాహారం అందజే స్తామన్నారు. తలసేమియా డేకేర్ సెంటర్ నిర్వహణకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీక్లబ్‌లు సహకారం అందించారని తెలిపారు. శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు 31 మంది రక్తదానం చేశారు. 43వ సారి రక్తదానం చేసిన మాధవరెడ్డిని రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్ హరినారపరెడ్డి, కోశాధికారి మధుసూధనరావు, రోటరీక్లబ్ కావలి కార్యదర్శి మొగల్ సలీంబేగ్‌లు అభినందించారు.

కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఔదార్యం

అల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పట్టణంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. మూడురోజులుగా ప్రతిరోజూ పలు ప్రాంతాలకు ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తూ ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఆర్‌డీఆర్ కాలనీ, క్రిస్టియన్‌పేట, ఇస్కపల్లి రోడ్డు ప్రాంతాల ప్రజలకు తాగునీటిని సరఫరా చేశారు. నగర పంచాయతీ అధికారులు చేతులెత్తేయడంతో దిక్కుతోచని ప్రజలకు కెఎస్‌ఆర్ ఫౌండేషన్ సంస్థ ప్రజలను ఆదుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు.



కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఉపాధి హామీ పనుల్లో రూ.1,53,386 అవినీతి

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారుల వెల్లడి

ఉలవపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.1,53,386 అవినీతి జరిగిందని గురువారం జరిగిన మండల బహిరంగ సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ గంగాభవాని వెల్లడించారు. పెద్దపట్టపుపాలెం గ్రామంలో ఉపాధి పనుల్లో రూ.35,512, చాకిచర్లలో రూ. 38,918, కరేడులో రూ.21,917, ఉలవపాడులో రూ.17,206, ఆత్మకూరులో రూ. 11,351, భీమవరంలో రూ.9,150 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తేల్చారు. ఆయాగ్రామాల ఫిల్డ్ అసిస్టెంట్లు, టీఏల నుంచి ఈ మొత్తం సొమ్మును జమ చేయించాల్సిందిగా డ్వామా పీడీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక్కరు కూడా ప్రజావేదిక కార్యక్రమానికి హాజరు కాకపోవడం విశేషం. కాగా, ఉలవపాడు, చాకిచర్ల గ్రామాల్లో ఉపాధి పనుల్లో మస్టర్లు వేశారు కానీ కూలీల నుంచి సంతకాలు, వేలిముద్రలు సేకరించలేదు. దీంతో ఎంపీడీవో విజయ, ఏపీడీ బాబురావులను ఆయా గ్రామాల్లో కూలీలతో గ్రామసభ నిర్వహించి విచారించి తగిన నివేదిక 15 రోజుల్లో సమర్పించాలని డ్వామా పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ, ఎస్‌ఆర్పీ బుజ్జి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఏ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ టీఏలను ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

బీజేపీ నియోజకవర్గ క్రియాశీల సభ్యుల సమావేశం

కావలి టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నియోజకవర్గ క్రియాశీలసభ్యుల సమావేశం గురువారం క్లాత్ మర్చంట్స్ కల్యాణ మండపంలో నిర్వహించారు. పార్టీ ఒకటో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మాజీ జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా 10ఏళ్లుగా ప్రజారంజక పాలన అందిస్తుందన్నారు. ప్రధాని మోదీ వివసిత్ భారత్, సంకల్ప భారత్ వైపు అడుగులు వేస్తూ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సీనియర్ నాయకులు సీవీసీ సత్యం వేదికపై ఆసీనులు కాకుండా వేదిక ముందు కూర్చోవడం పార్టీలో చర్చనీయంశంగా మారింది. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బెల్లంకొండ మాల్యాద్రి, మారెళ్ళ బ్రహ్మారెడ్డి, బ్రహ్మానందం, కమల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత్‌కుమార్

ఉపాధి హామీ పనుల పరిశీలన

కలిగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిర్రావారిపాలెం, వీరనకొల్లు, నాగసముద్రంలో గురువారం ఎంపీడీఓ ప్రత్యూష మహాత్మాగాంధి జాతీయ ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పనులు చేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడారు. పనుల్లో రోజువారి కూలీ ఎంత వస్తుందో అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా పనుల వద్ద మంచినీరు, మజ్జిగ సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అని ఏపీఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మినీగోకులం షెడ్లను పరిశీలించి ఉపాధి హామీపథకం కింద నాటిన మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.



మహిళాకూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పేదలు, యాచకులకు నీళ్ల సీసాలు, మజ్జిగ పంపిణీ

కందుకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాచకులు, నిరుపేదలకు శ్రీరా మ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వాటర్‌బాటిల్స్, మజ్జిగ పంపిణీచేశారు. కార్యక్రమంలో మురారిశెట్టి వెంక టసుబ్బారావు, రవ్వా శ్రీనివాసులు, కొత్తూరి వెంకటసుధాకర రావు, గుర్రంచిన అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద చిన్నారులకు నీళ్లసీసాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉపాధి పనుల విచారణలో వెలుగు చూసిన అక్రమాలు

- రాష్ట్ర అధికారులకు నివేదిక అందజేత

లింగసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.11.50 కోట్ల ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గత నెల 18 నుంచి 31వ తేదీ వరకు సామాజిక తనిఖీ అధికారుల విచారణలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో మండలంలో మొత్తం 7,824 జాబ్‌కార్డులున్నాయని, వీటిలో 5,909 జాబ్‌కార్డు దారులను కలిసి వివరాలు సేకరించారు. కానీ 1,915 మంది జాబ్‌కార్డుదారులు విచారణలో అందుబాటులో లేకుండా పోయారని వెల్లడించారు. అయితే తాము చేసిన విచారణలో రూ. 91.46 లక్షలు అక్రమాలు వెలుగు చూశాయని నిగ్గుతేల్చినప్పటికీ, డ్వామా అధికారులు సిబ్బందిపై కేవలం రూ.1,18,450 రికవరీకి ఆదేశించడంపై వారు విస్మయం వ్యక్తం చేశారు. అయితే ఈ విచారణ నివేదికను, ప్రజావేది కలో తేల్చిన అంశాలను మంగళగిరిలోని రాష్ట్ర సామాజిక తనిఖీ ప్రధాన కార్యాల యం ఉన్నతాధికారికి తగిన చర్యల కోసం అందజేస్తామని ఎస్‌ఆర్‌పి బుజ్జి తెలిపారు.

అంకితభావంతో పనిచేయండి

- రైల్వే ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు.

బిట్రగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అంకితభావంతో పని చేయాలని విజయవాడ రైల్వే డివిజనల్ సహాయక మేనేజర్ కొండా శ్రీనివాసరావు రైల్వే కార్మికులకు సూచించారు. గురువారం ఆయన ప్రత్యేక రైల్లో బిట్రగుంటకు చేరుకుని బిట్రగుంట రైల్వేస్టేషన్, కార్యాలయల తనిఖీ చేశారు. అనంతరం డ్రైవర్లు, గార్డులతో సమావేశమై ఉద్యోగ పరమైన సమస్యలపై చర్చించారు. అనంతరం డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనాన్ని తనిఖీ చేసి రిక్డాలను పరిశీలించారు. ఆయన వెంకట డివిజనల్ సీనియర్ అధికారులు, స్థానిక క్రూ కంట్రోల్ అధికారి, ఐవోడబ్ల్యూ రాజేష్ ఎస్ఎస్ మురళీధర్ సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఎన్‌ఎంయూ ధర్నా

కావలి టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ ఉద్యోగులు కావలి డిపో వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి రఘునందన రెడ్డి మాట్లాడారు. ఉద్యోగుల అనేక డిమాండ్లపై ఎన్‌ఎంయూ రాష్ట్ర నాయకులు ఆర్టీసీ ఎండీని కలిసి వినతిపత్రం అందజేసినా సమస్యల పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్తంగా గురు, శుక్రవారాలు డిపోల వద్ద గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలన్న పిలుపుతో ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ జిల్లా నాయకులు మీరామొహిద్దీన్, గ్యారేజ్ కార్యదర్శి కలామ్, యూనియన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కావలి ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాలనీవాసులు, విద్యార్థులు

డిప్యూటీ సీఎం సార్... రోడ్డు వేయించండి!

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సార్.. మా ఊరికి రోడ్డు వేయించండి.. అంటూ కలువాయి మండలం రాజుపాళెం గిరిజన కాలనీ వాసులు గురువారం రోడ్డెక్కారు. జనసేన పార్టీ జెండాలు, ప్లకార్డులు చేత పట్టుకుని ఊరికి రోడ్డు వేయించాలని ర్యాలీ నిర్వహించారు. గతంలో రోడ్డు దుస్థితిపై నివేదికతో పాటు రూ.55లక్షలతో సిమెంటురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాతాధికారులు పంపారు. కానీ ఇంకా రోడ్డు పనులు మంజూరు కాకపోవడంతో మరోసారి డిప్యూటీ సీఎం స్పందించాలంటూ విజ్ఞప్తి చేస్తూ రోడ్డెక్కారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)

ఇంటర్‌లో సంస్కరణలపై అవగాహన పెంచాలి

- ఆర్‌ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్‌లో నూతన విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్న వివిధ రకాల సంస్కరణలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరం సబ్జెక్ట్‌లలో కొత్త సిలబస్ ప్రవేశపెట్టారని, ద్వితీయ సంవత్సరం సిలబస్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి మార్చనున్నారన్నారు. ప్రథమ, ద్వితీయ భాషలతో పాటు ప్రస్తుతం ఉన్న 4 సబ్జెక్ట్‌లు సైన్స్, 5 సబ్జెక్ట్‌ల ఆర్ట్స్ విభాగాల వ్యవస్థను ప్రక్షాళన చేసి నూతనంగా ఎంబైపీసీ కాంబినేషన్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఇంటర్‌లో ప్రవేశపెట్టిన నూతన సంస్కరణలకు అనుగుణంగా కళాశాలలు, తరగతులు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ విద్యావిధానం, జాతీయ పాఠ్య ప్రణాళికా చట్టాలను అనుసంధానం చేస్తూ ప్రజా స్పందనలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అభ్యసనా సామర్థ్యాలను పెంచడంతో పాటు జాతీయస్థాయి ప్రమాణాలతో ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకే



మాట్లాడుతున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

ఈ సంస్కరణలు రూపొందించారన్నారు. దీనిపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం నూతన విద్యాసంవత్సరంలో అడ్మిషన్ షెడ్యూల్, అకడమిక్ క్యాలెండర్, ప్రథమ సంవత్సరం సబ్జెక్ట్‌ల సిలబస్ మార్పు, కొత్త సబ్జెక్ట్‌ల కాంబినేషన్లు, మార్కుల పంపిణీ, ప్రశ్నాపత్రాల డిజైన్ మార్పు, పని గంటల పెంపు వంటి అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీవీఈవో మధుబాబు, సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, రీసోర్స్ పర్సన్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామన్నారు. 10.30 గంటకు కలెక్టరేట్ తిక్కన భవనంలో జరిగే జయంతి వేడుకల్లో కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, బీసీ కుల సంఘ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

డీటీసీ డీఎస్పీ బదిలీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ గురువారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న పలువురు డీఎస్పీలకు పోస్టింగ్‌లు కేటాయించడంతో పాటు పలు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేశారు. అందులో భాగంగా నెల్లూరు డీటీసీ డీఎస్పీ ఎం గిరి ధరరావును ఏసీబీకి బదిలీ చేశారు.

14న టీ-20 అండర్-23 క్రికెట్ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని జిల్లా క్రికెట్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 14వ తేదీన టీ-20 అండర్-23 క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డీ.నిఖిలేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు వైట్ డ్రస్ కోడ్‌తో, తమ సొంత క్రికెట్ కిట్‌లు, ఆధార్ కార్డులతో హాజరు కావాలని పేర్కొన్నారు.

రేపు ఆశా వర్కర్ల సదస్సు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా కార్యాలయంలో ఈనెల 12వ తేదీన ఆశా వర్కర్ల సదస్సు జరుగుతుందని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఆశాలకు అనుబంధంగా ఉన్న నేషనల్ హెల్త్ మిషన్ ఏర్పడి 20 ఏళ్ల అవుతున్న సందర్భంగా ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. ఇందులో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఆశా వర్కర్లు తరలి రావాలని తెలిపారు.

అరవై దాటితే అగచాట్లే...!

- పార్కిన్‌సన్స్ వ్యాధితో పొంచి ఉన్న ప్రమాదం
- జిల్లాలో 100 మందికిపైగా బాధితులు
- వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే..
- నేడు ప్రపంచ వణుకుడు వ్యాధి నివారణ దినం

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి అరవైఏళ్ల దాటాక ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. డోపమైన్ అనే న్యూరోట్రాన్సిటర్ కణం మెదడుకంతా సంకేతాలను ప్రసరింపచేస్తుంది. సాధారణ పరిస్థితిలో మృదువైన సమతుల్యత కండరాలు సమన్వయాన్ని డోపమైన్ కణంతో సాధించవచ్చు. అయితే ఈ కండరం పనితీరు తగ్గటం వల్ల పార్కిన్‌సన్స్ (వణుకుడు) వ్యాధి వస్తుంది. దీంతో చేతులు, కాళ్ల, దవడలు వంటి భాగాల్లో వణుకు వస్తుంది. చూపుడు వేలు, బొటన వేలులో కూడా వచ్చే అవకాశం ఉంది. కొన్ని జన్యు కారణాల వల్ల, పర్యావరణ పరిస్థితుల వల్ల, ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలో ఐదు లక్షల మంది వరకు వృద్ధులు ఉండగా, వీరిలో 100 మందికి పైగా ఈ వ్యాధి బాధితులు తెలుస్తోంది. వీరిలో తీవ్రత ఎక్కువగా ఉన్న వారు 20 మంది ఉన్నట్లు వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. ఏప్రిల్ 11న (నేడు) ప్రపంచ పార్కిన్‌సన్స్ నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జిల్లాలో ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు పలు ఆసుపత్రుల్లో నిర్వహించనున్నారు.

● చికిత్సలో ఆధునిక విధానాలు

పార్కిన్‌సన్స్ వ్యాధి నివారణకు ప్రస్తుతం ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధిని పూర్తిగా నయం చేయలేక పోయినా తాత్కాలిక ఉపశమనం కలిగించవచ్చు. సిటీస్కాన్, ఎమ్మారై వంటి స్కానింగ్‌ల వల్ల మెదడు పరిస్థితిని తెలుసు కోవచ్చు. డొపమైన్ లోపాన్ని నివారించేందుకు వివిధ రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారికి చిన్నపాటి డీ బ్రెయిన్ స్టిమ్యూలేషన్ వంటి శస్త్రచికిత్స కూడా చేస్తారు.ఈ శస్త్రచికిత్స కూడా వ్యాధిని కొంత వరకు కంట్రోల్ చేయగలదని నిరూపణ అయింది. అంతేకాక లివోడోపా అనే మందు కనుక్కోబడి మంచి ఫలితాలు ఇస్తుంది. ఐదేళ్ల నుంచి ఏడేళ్ల వరకు ఈ మందు వాడకం వల్ల వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

● వ్యాధికి గురికాకుండా...

ఈ వ్యాధికి గురికాకుండా ఉండాలంటే మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండాలి. వాకింగ్, స్విమ్మింగ్ వంటి వ్యాయామాలు చేయాలి. అనవసరమైన ఆలోచనలు మానుకోవాలి. తగినంత నిద్ర పోవాలి. బ్రెయిన్‌కు ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. అలాగే యోగా, ధ్యానం వంటివి చేయాలి. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించటం ఎంతో మంచిది. దీంతోపాటు వంటల్లో వాడే నూనెను పదేపదే వాడరాదని వైద్యులు చెబుతున్నారు. పసుపులో యాంటి సెప్టిక్, కర్కుమిన్ అనే పోషకాలు ఎక్కువగా ఉంటాయి దీన్ని దృష్టిలో ఉంచుకుని వంటల్లో పసుపును విరివిగా వాడాల్సి ఉంటుంది.





నేడు ఎన్నో రకాల వైద్య చికిత్సలు

పార్కిన్‌సన్స్ వ్యాధి నివారణకు నేడు ఎన్నో రకాల ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా వ్యాధిని నియంత్రించ వచ్చు. అయితే వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే డీ బ్రెయిన్ స్టిమ్యూ లేషన్ వంటి శస్త్రచికిత్స ద్వారా వ్యాధిని నియంత్రిం చవచ్చు. వ్యాధి నియంత్రణకు దీర్ఘకాలం పాటు మందులు వాడాల్సి ఉంటుంది. అసలు వ్యాధి రాకుండా ముందస్తుగా మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలన్న మరచిపోకూడదు.

- డాక్టర్ ఫణికుమార్, జీజీహెచ్ న్యూరో ఫిజిషియన్

వ్యాధి లక్షణాలు

- ముందుగా ఏదో ఒక చేతిలో వణుకుడు ప్రారంభమవుతుంది. అనంతరం రెండో చేతికి వస్తుంది.
- ఒక చోట నిలబడలేరు. నడక వేగం తగ్గుతుంది.
- చిన్న వస్తువు కాళ్లకు తగిలినా పడిపోతారు.
- కనురెప్పలు ఆడడం తగ్గుతుంది.
- శరీరంలో కండరాల కదలికలు తగ్గిపోతాయి.
- కండరాలు బిగుసుకు పోవటం, వాసన కోల్పోవటం
- శరీరం చెమట పట్టకపోవడం, నిద్రలేమి సమస్య
- యూరిన్ కంట్రోల్ చేసుకోలేకపోవడం, దుస్తులు తడుపుకోవడం.
- మతిమరుపు వస్తాయి.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

- ఈనెల 13న ప్రవేశపరీక్ష
- ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థినులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్ టీ పద్మజ పేర్కొన్నారు.ఈ గురుకులాల్లో ప్రవేశానికి ఈనెల 13న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నామని ఆమె వివరించారు.



? : గురుకులాల్లో విద్యా విధానం ఎలా.

! : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందుబాటులో ఉంది.

? : జిల్లాలో ఎన్ని గురుకులాలు ఉన్నాయి.

! : జిల్లాలో ముత్తుకూరు, రాపూరు, టీపీగూడూరు, సంగం, బుచ్చి, చేజర్ల, బోగోలు, పెద్దపావనిలో గురుకులాలు ఉన్నాయి.

? : ప్రవేశ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు

! : గురుకులాల్లో ప్రవేశాలకు ఈనెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఐదు నుంచి సీనియర్ ఇంటర్ వరకు విద్య ఉంది. ఐదో తరగతిలో ప్రవేశానికి ఈనెల 13న ఉదయం 10 నుంచి 12గంటల వరకు, ఇంటర్‌లో ప్రవేశానికి అదేరోజు మధ్యాహ్నం 2నుంచి 4.30గంటల వరకు పరీక్ష ఉంటుంది. వచ్చే మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

? : గురుకులాల్లో ఎంతమంది చదువుతున్నారు.

! : జిల్లాలోని గురుకులాల్లో మొత్తం 4761 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను 642 మంది రాశారు. జూనియర్ ఇంటర్‌లో 427 మంది, సీనియర్ ఇంటర్‌లో 472 మంది పరీక్షలు రాశారు.

? : ఉపాధ్యాయులు, అధ్యాపకుల కొరత ఉందా.

! : ఎక్కడా కొరత లేదు. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్లు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు.

? : మెనూ సరిగా ఉంటుందా.

! : ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మెనూ సక్రమంగా అమలు జరుగుతుంది. విద్యార్థినులకు సక్రమమైన ఆహారాన్ని అందించి, ఆరోగ్యంగా చదువుకునేలా అన్ని చర్యలు చేపట్టాం.

నివేశన స్థలాల ఆక్రమణపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు కలువాయి వాసుల వినతి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వ ఇచ్చిన నివేశన స్థలాలను ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని తమ స్థలాలు తమకు ఇప్పించాలని జిల్లాలోని కలువాయి మండలం కలువాయికి చెందిన 18 మంది బాధితులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఢిల్లీ రమాదేవి, సత్తు విజయమ్మ, పామూరు అనూషలు మాట్లాడుతూ 2019లో కలువాయిలోని 930-1 సర్వే నెంబరులో ఒక్కొక్కరికి 2.5 సెంట్లు (15 అంకణాలు) చొప్పున 18 మందికి నివేశన స్థలాలు మంజూరు చేశారని, అందుకు సంబంధించిన పట్టాలను అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అందజేశారని చెప్పారు. ఆ స్థలాలను కలువాయికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని మమ్మల్ని అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. బోగస్ సంతకాలతో తప్పుడు డాక్యుమెంట్ సృష్టించడం అతనికి అలవాటేనని ఆరోపించారు. అధికారులను బెదించడం, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం, ఫోర్జరీ సంతకాలతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడం, ప్రశ్నించిన వారిపై అక్రమంగా అట్రాసిటీ కేసులు పెట్టడం ఇతనికి పరిపాటిగా మారిందని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని కోరారు.



కలెక్టర్ ఆనంద్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న కలువాయి వాసులు



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

జగన్‌కు బెయిల్ రద్దు చేయండి

- అల్లర్లు సృష్టించేందుకే పోలీసులపై అనుచిత వాఖ్యలు
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు అనుచిత వాఖ్యలు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బయట తిరగకుండా వెంటనే బెయిల్‌ను రద్దు చెయ్యాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 నెలలు జైలులో ఉండి 11 ఏళ్లుగా బెయిల్‌పై తిరుగుతూ రాజకీయ లబ్ధికోసం ప్రశాంతంగా ఉన్న రాయలసీమలో ఫ్యాక్షన్‌కు తెరతీస్తున్నారని విమర్శించారు. చావును అడ్డం పెట్టుకుని జగన్మోహన్‌రెడ్డి రాప్తాడులో బలప్రదర్శన చేశాడని మండిపడ్డారు. పోలీసులను బట్టలూడదీసి కొడతానంటూ అనుచిత వాఖ్యలు చేసిన జగన్‌పై కేసు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు. తన బెదిరింపుల ద్వారా సాక్షులను బెదిరించినట్లే ఉందన్నారు. హెలికాప్టర్ విండ్ షీల్డ్ విరిగిపోయిందనేది పెద్ద డ్రామాలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, పిట్టి సత్యనాగేశ్వర రావు, కువ్వారపు బాలాజీ, అంచూరు శ్రీనివాసులనాయుడు, షేక్ జహీర్, ప్రశాంతకుమార్, నాని, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

విడవలూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) :అత్తింటి వేధింపులు తాళ లేక వివాహిత ముగ్గులో పోసుకునే రసాయన మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి ఊటుకూరు పెద్దపాళెంలో చోటు చేసుకుంది. బాధితురాలు కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోగోలు మండలం తాటిచెట్లపాలెంకు చెందిన సుగుణమ్మ(23)ను ఊటుకూరు పెద్దపాళెంకు చెందిన బుచ్చింగారి హరికృష్ణకు 2021లో పెద్దలు వివాహం చేశారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఇంతవరకు బాగానే సాగిన కాపురంలో అత్త నరసమ్మ, మామ రెండో నాగూర్, ఆడబిడ్డ నాగ లక్ష్మిలతో పాటు భర్త హరికృష్ణ నుంచి అదనపు కట్నం కోసం వేధింపులు మొదలైయాయి. ఇటీవల ఈ వేధింపులు శృతి మించడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. వారంరోజుల కిందట అత్తింటికి వచ్చింది. అయితే బుధవారం రాత్రి అదనపుకట్నం కోసం భర్తతో పాటు మామ, అత్త, తోడికోడల్లు దారుణంగా అవమానించడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేష్ కుమార్ యాదవ్ కేసు నమోదు చేశారు.

భర్తపై కేసు నమోదు

నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లకందుకూరుకు చెందిన శ్రీధర్, విష్ణువందన ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. తాజాగా తన భర్త అదనపు కట్నం కోసం వేదిస్తున్నాడని ఆమె చేసిన ఫిర్యాదుతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు రూరల్ సీఐ గుంజీ వేణు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో జాప్యం చేయొద్దు

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లకు జాప్యం లేకుండా వెంటనే మరమ్మతులు చేసి పంపాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలోని కావలి, ఆత్మకూరు, నెల్లూరులో విద్యుత్ సంస్థకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాలు వేసవి కాలం దృష్ట్యా 3 షిఫ్ట్‌లుగా పని చేస్తున్నాయన్నారు. వేసవి కాలంలో ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మట్ల మరమ్మతులకు గురవుతుంటాయని, వెంటనే మరమ్మతులు చేసి పంపాలని సూచించారు. ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటికి, రైతులకు తొలిప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి పథకాలకు, రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వెంటనే యుద్ధప్రాతిపదికన మార్చాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ ఖర్చు సంస్థకు పెనుభారంగా ఉందన్నారు. ఓవర్ లోడ్ కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ సిబ్బందిపై ఉందన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ అల్తాఫ్ పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

21న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈనెల 20న పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ఈస్టర్ పర్వదినం సందర్భంగా 21వ తేదీకి పరీక్ష మార్పు చేశారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ మార్పును గమనించి సంబంధిత తేదీలో ఉదయం 10 గంటలకు ఆయా పాఠశాలల్లో జరిగే పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లు www.cse.ap.gov.in లేదా www.apms.apcf-ss.in వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

నేడు ఏఎంసీ పాలక మండలి ప్రమాణస్వీకారం

వెంకటాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సర్వేపల్లి ఏఎంసీ (అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ) పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు హాజరుకానున్నారు. దీంతో సర్వే పల్లి ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన టీడీపీ మనుబోలు మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డితో పాటు పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఈదురు గాలులతో చిరుజల్లులు

కలిగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. ప్రజలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు.

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలుతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో లింగసముద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఒక్కసారిగా ఈదురు గాలులు వీచాయి.ఈ గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు ఊగిపోయాయి. రోడ్లపై వెళుతున్న ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.కొన్ని చోట్ల చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. లింగసముద్రం, మొగిలిచెర్ల, పెంట్రాల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో సుమారు అరగంట పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది.



కలిగిరిలో పడుతున్న చిరుజల్లులు

సోమశిలలో 52.501 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 52.501 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరు నీటి మట్టం 47.25 టీఎంసీలు

రాపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న కండలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 47.25 టీఎంసీలు ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1420 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 1340 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కులు చొప్పున మొత్తం 1420 క్యూసెక్కులు నీరు అవుట్ ఫ్లో అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

డిగ్రీ పరీక్షకు 478 మంది గైర్హాజరు

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షకు 478 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్.మధుమతి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 7,255 మంది విద్యార్థులకు 6,777మంది హాజరయ్యారు.